ఈ నెలలో...

కథలు (మాసపత్రిక)

4. ఒకే ఒక్క గుండుదెబ్బ—బొమ్మిడి అచ్చారావు
27. శ్రీవారి లీలలు—క్రిష్ణవేణి
39. వెనక్కి నడిచే గడియారం —ఎమ్.వి.వి.సత్యనారాయణ
55. పావురాలే దిక్కు—ఎమ్. సత్యవతి
74. జబర్దస్తీ చుట్టం—వసుంధర
91. హుండీ దొంగ—ఇమంది రామారావు
114. కుక్కల గోల—ఎమ్. శిరీష
124. ఫారిన్ బొమ్మ—జొన్నలగడ్డ రామలక్ష్మి
144. సత్యానికి సంకెళ్లా ?—టెంపోరావ్
176. కాంచన గ్రహం (సీరియల్)—వాణిశ్రీ

నవలలు (సప్లిమెంట్)

3. ప్రేమకట్నం—వసుంధర
45. నగల దోపిడి—ఇమంది రామారావు
87. బ్రిడ్జిమీది శవాలు—ఎమ్. వి. వి. సత్యనారాయణ
114. మూడు కత్తులు-రెండు హత్యలు—బొమ్మిడి అచ్చారావు
161. రక్తం త్రాగే పిశాచం (సీరియల్)—వసుంధర

ఇవిగాక — క్రైమ్‌లో తమాషాలు, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, మీ తీర్పు ఏమిటి, అపరాధ పరిశోధన పోటీ, జోక్స్, కార్టూన్లు మరెన్నో ఆకర్షణలు!!

ఒకే ఒక్క గుండు దెబ్బ

బొమ్మిడి అచ్చారావు

ప్రసాద్ గేటు తీసుకుని లోపలికి వెళ్ళాడు.

లోపల యెక్కడా అలికిడిలేదు. ఆల్సేషియన్ కుక్క వరండాలో ఓ పక్కగా కట్టేసివుంది. ప్రసాద్‌ని చూడ

గానే ఓ సారి తలెత్తి సన్నగా మూలిగి మళ్ళీ ముడిచిపెట్టు కుని పడుకుంది. అది ప్రసాద్‌ని గుర్తించడమన్న మాట! ప్రసాద్ ఆ యింటికి తరచు వచ్చిపోవడంవల్ల దానికి అతను ఆ యింటి మనుషులకిందే లెక్క!

ప్రసాద్ ముందు హాల్లోకి వచ్చాడు. నీరజ జాడ యెక్కడా కనిపించలేదు.

ప్రసాద్ మెల్లగా ఆమె గదివైపు అడుగులు వేశాడు. అయితే నీరజ గదికి పోయేముందు పరాంకుశంగారి గది మీదుగా పోవాల్సిందే. తప్పదు! పరాంకుశం నీరజ తండ్రి. ఆయినా ఫరవాలేదు, ఆయన యీ సమయంలో యింట్లో వుండడు! ఫ్యాక్టరీలో మంచి బిజీగా వుంటాడు.

పరాంకుశం గదిముందు కొస్తూనే ఓ క్షణం గతుక్కు మన్నాడు ప్రసాద్. పరాంకుశం గది తలుపులు తీసే వున్నాయి. అంటే, ఆయన యింటి దగ్గరే వున్నాడన్న మాట!

చప్పుడు చెయ్యకుండా వెనుదిరిగిన ప్రసాద్‌కి పరాంకుశం గదిలోనుంచి 'ఢాం' అన్న పిస్తోలుశబ్దం వినిపించింది. ప్రసాద్ గుండె గుభిల్లుమన్నది. ఒక్క అంగలో పరాంకుశం గదిలోనికి పరుగెత్తాడు.

గదిలో పరాంకుశం కుర్చీలో ఓ పక్కకి తల వాల్చి, నెత్తురుమడుగులో వున్నాడు. ఆయనలో చలనంలేదు. గుండెల్లోనుండి నెత్తురు ప్రవహిస్తూనే వుందింకా.

ప్రసాద్ నిర్ఘాంతపోయాడు. దగ్గరగా వెళ్ళి చూడటానికి భయంవేసింది. పక్కనే రివాల్వర్ పడివుంది. కంగారుగా వెనుతిరిగి రాబోయాడు. గుమ్మంలో నీరజ!

ఆమె ప్రసాద్‌మీదుగా గదిలోని దృశ్యం చూసి కెవ్వున కేకవేసింది. ఆ దృశ్యం చూడలేనట్టు కళ్ళు గట్టిగా మూసు

కుంది.

"ప్రసాద్, యెంతపని చేశావు?" అంది వణుకుతున్న కంఠంతో.

"నీరూ! ఏమిటి నువ్వంటున్నది? నాకే పాపమూ తెలియదు" అన్నాడు బొంగురుపోయిన కంఠంతో.

తండ్రి శవంవైపు అడుగులు వేస్తున్నదల్లా చివ్వున తలతిప్పి, "పిస్తోలు శబ్దం స్పష్టంగా విన్నాను. వెంటనే పరుగెత్తుకొచ్చేసరికి గదిలో నువ్వున్నావు. ఇంతకన్నా వేరే సాక్ష్యం దేనికి? బుకాయించకు. దేవుడులాంటి నాన్న గార్ని పొట్టనబెట్టుకుంటావా?" ఆవేశంగా, ఏడుపుజీరతో ప్రసాద్‌వంక నిప్పులు కురిపిస్తూ చూసింది నీరజ.

"నీరూ ప్లీజ్! నన్నుమానించకు. మీ నాన్నగారే ఎంచేతో ఆత్మహత్య చేసుకున్నట్లున్నారు!"

"అసంభవం! నాన్నగారు నీ మాట కాదన్నారనే కక్షతో ఆయన్న అంతం చేశావు. నాకు తెలుసు. నా తండ్రిని చంపి నన్ను నీ దాన్ని చేసుకోగలవా? నా తండ్రిని చంపిన వాడి నీడ కూడా నేను భరించలేను."

"నీరూ! ఆవేశంలో ఏవేవో అర్థంలేకుండా మాట్లాడుతున్నావు. నేను హంతకుడినా? నేను చేతులారా నిండు ప్రాణాలు తీసే రాక్షసుడినా? ఇదా నా ప్రేమకు నువ్విచ్చిన బిరుదు, బహుమానం?" ఆవేదనగా అన్నాడు ప్రసాద్.

నీరజ చకచక హాల్లోకి వచ్చింది. ఫోన్ ఎత్తి పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేసింది.

ప్రసాద్ ఆమె చేతిలో రిసీవర్ లాక్కోబోయాడు. "నీరూ! ప్లీజ్, నామీద కంప్లెయింట్ యివ్వకు. కావాలంటే నే నిక్కడినుంచి వెళ్ళిపోయాక పోలీసుల్ని పిలు? హంతకు డెవరో వాళ్ళే కనుక్కుంటారు—లేకుంటే ఏమీ ఎరగని

నన్నే హంతకుడిగా నిలబెడతారు" అన్నాడు.

అప్పటికే నీరజ పోలీసులకి చెప్పేసింది. ప్రసాద్ స్థాణువులా నిల్చుండిపోయాడు.

"నిజంగా నువు నిరపరాధివే అయితే నీ కెందుకు భయం? నువ్వీ హత్య చేసి వుండకపోతే, నిన్నెవరూ ఏం చెయ్యలేరు. కాని మిష్టర్, కళ్ళారా చూసిన ప్రత్యక్ష సాక్షిని నేనున్నాను. ఎవరి కళ్ళు కప్పినా నా కళ్ళు కప్ప లేవు. నిజాన్ని దాచలేవు" అన్నది నీరజ.

ప్రసాద్ గుమ్మంవైపు పరుగెత్తాడు. అప్పుడే లోని కడుగుపెట్టిన యిద్దరు నౌఖర్లనుద్దేశించి "అతన్ని పట్టు కోండి!" అని అరిచింది నీరజ.

నౌఖర్లు ప్రసాద్ చెరో రెక్కా అంది పుచ్చుకుని అతన్ని నిలేశారు. సరిగ్గా అదే క్షణంలో పోర్టికోలో పోలీసు జీప్ వచ్చి ఆగింది.

ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తన బలగంతో చకచక యింట్లో ప్రవేశించాడు.

2

"రా బ్రదర్, యీ కేసు నువు టేకప్ చేశావని తెలిసింది. నాకు కొండంత రిలీఫ్!" నవ్వుతూ ఆహ్వానించాడు ఇనస్పెక్టర్ శ్రీనివాస్.

డిటెక్టివ్ కిరణ్ నవ్వుతూ చూశాడు శ్రీనివాస్ వంక. "ప్రతిసారీ నువ్వే కబురుపెట్టి నన్ను స్పాట్‌లోకి పిలిచే వాడివి కదా! ఈసారి నువ్వే హేండిల్ చేసినట్టున్నావే డైరెక్టుగా!" అన్నాడు.

"అవును బ్రదర్! ప్రతిసారీ నిన్ను డిస్టర్బ్ చేయటం దేనికని నేనే ప్రొసీడయిపోయాను. అందునా యిది క్లియర్ కట్ కేసు. హంతకుడు స్పాట్‌లోనే దొరికిపోయాడు.

హత్యాయుధం శవం పక్కనే వున్నది. ఆధారాలు నేరస్థుడి నేరాన్ని రుజువు చేశాయి. ప్రత్యక్ష సాక్షి స్వయానా హతుడి కన్నకూతురు. ఇక యిందులో నిన్ను లాగటం దేనికని నీకు కబురు పెట్టలేదు. అయినా కేసు వివరాలు నీకు చెప్పకుండా వుంటానా? కేసుని కోర్టుకి పంపించే ముందోసారి నిన్ను కల్సుకోవాలనే అనుకుంటున్నాను. ఇంతలో నువ్వే వచ్చావు" అన్నాడు శ్రీనివాస్.

"అయితే ప్రసాదే హంతకుడని నిర్ణయించావన్న మాటే కదా!" అడిగాడు కిరణ్.

"అవును. ఆధారాలు సరిపోయాయి."

కిరణ్ కుర్చీలో ముందుకి వంగి, "ఏమిటా ఆధారాలు?" అన్నాడు.

"నంబర్ వన్! హంతకుడు హత్యా సమయంలో పక్కనే వున్నాడు. నీరజ—అదే—హతుడి కుమార్తె ప్రత్యక్షంగా చూసింది. హంతకుడు పారిపోతుంటే యింటి నౌఖర్లు పట్టుకున్నారు. ఇంతలో నేను స్పాట్‌కి చేరుకున్నాను. హంతకుడు పెనుగులాడటం కళ్ళార చూశాను. నంబర్ టూ! నీరజ చెప్పిన సమయం. హత్య మధ్యాహ్నం మూడూ యిరవైకి జరిగిందని. డాక్టర్ రిపోర్టు కూడా సరిగ్గా అదే! హత్య జరిగిన యిరవై నిమిషాలకి నేను అక్కడికే చేరుకున్నాను. అప్పుడు సమయం మూడూ నలభై అయింది.

"నంబర్ త్రీ! హతుడు ధరించివున్న లాల్చీ జేబులో హంతకుడు తన ప్రియురాలు నీరజకు రాసిన ఉత్తరం వుంది! హతుడు తమ ప్రేమపెళ్ళికి అడ్డొస్తున్నాడని ప్రసాద్ అందులో స్పష్టంగా రాశాడు. ఇకపోతే హత్యా

యుధం శవం పక్కనే దొరికింది. ఇంతకన్న సాక్ష్యాలు, ఆధారాలు యింకేం కావాలి?" అన్నాడు శ్రీనివాస్.

కిరణ్ అతను చెప్పినది జాగ్రత్తగా విన్నాడు.

"హత్యాయుధం ఏమిటి?" అనడిగాడు.

".38 కాలిబర్ పిస్తోలు."

"హంతకుడు ఎన్ని గుళ్ళు పేల్చాడు?"

"ఒకే ఒక్కటి! సూటిగా గుండెల్లో దూరి చిక్కుకుంది. వెంటనే ప్రాణం పోయింది."

"తూటా అదే పిస్తోలునుంచి విడుదలయినదని నిర్ధారణ అయిందా?"

"ఎస్! అదే పిస్తోలునించి పేల్చబడింది. మేగజైన్ విప్పి చూశాం. ఓ గుండు తక్కువగా వుంది."

కిరణ్ తలూపాడు.

"పిస్తోలు మీద ప్రసాద్ వేలిముద్రలు దొరికాయా!" అడిగాడు.

"నో. తుడిచేశాడు. ఎవరి వేలిముద్రలూ లేవు దాని మీద."

"అది ఆత్మహత్య అయేందు కవకాశం లేదా?"

"లేదు. ఆ గుండు ప్రయాణించిన వేగాన్నిబట్టి, అది సూటిగా గుండెల్లో గుచ్చుకున్న కోణాన్నిబట్టి అది సుమారు రెండుగజాల దూరంనించి పేల్చినట్టు నిర్ధారణ అయింది. ఆత్మహత్య అయితే గుండు చాలా సమీపం నుండి గుండెల్లోకి దూరి వుండేది. పిస్తోలు మీద పరాంకుశం వేలిముద్రలు తప్పక వుండేవి!"

"సో, అది హత్యే నన్నది నిర్వివాదాంశం."

"ఎస్. హత్యే!"

"సరే, యింకా, ఏదో ఉత్తరం దొరికిందన్నావు. అది

ఓసారి నే చూడవచ్చునా?"

శ్రీనివాస్ ఫైలు తెరిచి ఓ పావుటావు సైజు కాగితం కిరణ్ కందించాడు. కిరణ్ చదివాడు.

"డార్లింగ్ నీరూ!

మీ నాన్న మనకి ప్రతిక్షణం అడ్డు తగుల్తూనే వున్నాడు. మన పెళ్ళికి ససేమిరా ఒప్పుకోవటం లేదు సరికదా, నన్ను మీ యింటికి రావద్దని శాసించాడు. ఇలా ఎన్నాళ్ళు? నేను నిన్ను ఆమాత్రం పోషించుకోలేకపోను. నాకున్న ఉద్యోగం చాలు! మా నాన్నమీద ఆధారపడి లేను. ఆ విషయం నీకెన్నోసార్లు చెప్పాను. అయినా నువు ధైర్యం చేసి నాతో రాలేకపోతున్నావు. బహుశా నేను నిన్ను సుఖపెట్టలేనని నీ భయం కదూ!

నన్ను ప్రాణసమంగా ప్రేమించానని, నాకోసం నీ సర్వస్వం, ఆస్తిపాస్తులు—అన్నీ వదులుకుంటానని నువ్వన్న మాటలు, చేసినబాసలు అన్నీ ఉత్తవేనా? వారంరోజులుగా మొహం చాటేశావు. నా బాధ ఎలా వర్ణించను? ఏమయినా సరే, వెంటనే మనం ఓ నిర్ణయానికి రావాలి! అన్ని విషయాలు నీతో ముఖ్స్తంగా మాట్లాడాలి.

రేపు మధ్యాహ్నం మీ నాన్నగారు ఫ్యాక్టరీకి వెళ్ళిపోయాక వస్తాను. అప్పటికి నౌఖర్లను ఏదో పనిమీద బయటికి పంపెయ్యి. లేకుంటే నేనొచ్చిన విషయం మీ నాన్నకు చెప్పేస్తారు. మనిద్దరమే ఏకాంతంగా మాట్లాడి నిర్ణయం చేసుకుందాం.

—నీ ప్రసాద్."

కాగితం మడిచి శ్రీనివాస్ కందించాడు కిరణ్.

"బహుశా, ఆ విషయం మాట్లాడటానికే ఆ రోజు ప్రసాద్ పరాంకుశం యింటికి వచ్చివుంటాడు. పరాంకుశం యింట్లో వుంటాడని వూహించి వుండడు ప్రసాద్. ఇద్దరికీ ఘర్షణ జరిగింది. ఆవేశంలో ప్రసాద్ రివాల్వర్‌తో పరాంకుశాన్ని కాల్చేశాడు" అన్నాడు శ్రీనివాస్.

"రివాల్వర్ ప్రసాద్‌కెలా వచ్చింది?"

"అది పరాంకుశంగారిదే. దానికి లైసెన్సుకూడా వుంది. బహుశా ఎందుకో అది పైనపెట్టి వుంటాడు పరాంకుశం. అవకాశం దొరికింది ప్రసాద్‌కి. దాన్ని చేజిక్కించుకుని పరాంకుశాన్ని కాల్చి చంపాడు" అన్నాడు శ్రీనివాస్.

"అంటే పరాంకుశం ఎందుకైనా మంచిదని రక్షణ కోసం ఆ రివాల్వర్ పైనే సిద్ధంగా పెట్టుకుని వుంటాడంటావా?"

"కావచ్చు. ఎందుకంటే ప్రసాద్ రాసిన ఉత్తరం చూశాక పరాంకుశానికి అనుమానం వచ్చివుంటుంది. అందుకే ఫ్యాక్టరీకి పోకుండా ప్రసాద్‌కోసం ఎదురుచూస్తూ సిద్ధంగా యింట్లో వున్నాడు."

"ఆ ఉత్తరం రాసింది నీరజకు కదా? అది పరాంకుశానికి ఎలా చేరింది?"

"అదీ ఎంక్వయిరీ చేశాను. ప్రసాద్ నీరజకు ఓ కుర్రాడిద్వారా పంపించాడట ఉత్తరాన్ని. అది నీరజకు చేరనే లేదు. నౌఖరు చేతిలో పడింది. విశ్వాసపాత్రుడైన నౌఖరు జాగ్రత్తగా దాన్ని యజమానికందించాడు. అందుకే పరాంకుశానికి ప్రసాద్ వస్తున్న విషయం ముందుగానే తెలిసింది."

కిరణ్ తలూపాడు.

"ప్రసాద్ నీ కస్టడీలోనే వున్నాడు కదూ?"

"అవును. రేపు కేసుని కోర్టుకి పంపిస్తున్నాను."

"ఓసారి నేనతనితో మాట్లాడాలి."

"అలాగే! ఇక్కడికి రప్పించనా?"

"అక్కర్లేదు నాతో సార్జెంట్‌ని పంపించు" లేచాడు కిరణ్.

శ్రీనివాస్ సార్జెంట్‌ని పిలిచాడు.

3

"మీ పేరేనా ప్రసాద్?"

అతను కళ్ళెత్తి కిరణ్‌వంక చూశాడు. అతని ముఖం బాగా పీక్కుపోయింది. కళ్ళనిండా దైన్యం! చూపులు ఎక్కడో శూన్యంలోకి చూస్తున్నాయి.

"అవునండి, మీరెవరు?" అడిగాడు.

"నన్ను కిరణ్ అంటారు. డిటెక్టివ్‌ని."

అతని కళ్ళు మెరిశాయి. "ఉదయం మా నాన్నగారు చెప్పారు మిమ్మల్ని నియమిస్తున్నట్టు? నేను మీ గురించి పత్రికల్లో చాలా చదివాను. ఉరికంబం ఎక్కడానికి సిద్ధంగా వున్న నిర్దోషుల్ని ఎంతోమందిని రక్షించారని విన్నాను. సార్! నేను నిరపరాధిని. నన్నెలాగైనా విడిపించండి, నేనే పాపమూ ఎరగను" చేతులు జోడించాడు.

"నిజంగా మీరీ హత్య చేసి వుండకపోతే, మిమ్మల్ని రక్షించటానికి నేను సిద్ధం! మీకు తెలిసినవన్నీ దాచకుండా నాకు చెప్పాలి. అబద్ధం సహించను" అన్నాడు కిరణ్.

"అడగండి సార్! మీ దగ్గిర ఏదీ దాయను."

"నీరజతో మీ కెన్నాళ్ళుగా పరిచయం?"

"దాదాపు నాలుగేళ్ళుగా! నీరజ నేను ఒకే కాలేజీలో డిగ్రీ చదువుతున్నాం. గత సంవత్సరం యిద్దరం డిగ్రీలు



పుచ్చుకున్నాం. చదువుకునే రోజుల్లోనే ఒకరికొకరు మన సిచ్చుకున్నాం. పెళ్ళి చేసుకోవాలనే నిర్ణయానికొచ్చాం. ఆర్నెల్ల క్రితం నాకు ప్రయివేట్ ఫర్మ్‌లో జాబ్ దొరికింది. సిటీలోని పేరున్న పెద్ద యిండస్ట్రీ. నాకో ఆధారం దొరక గానే యిద్దరికీ చాలా సంతోషం కలిగింది. పెద్దలు కాదన్నా వేరుగాపోయి కలిసి బతుకుదామని నిర్ణయించుకున్నాం."

అతను ఓ క్షణం ఆగి మళ్ళీ మొదలెట్టాడు.

"చదువుకునే రోజుల్లో పరాంకుశంగారింటికి యధేచ్ఛగా పోయి వచ్చేవాడిని. గత నాలుగైదు నెలలుగా నా రాకపోకలు పరాంకుశంగారికి ఎందుకో నచ్చక, నన్ను రావద్దని కట్టడి చేశారు. నీరజతో మాట్లాడి పరాంకుశంగారికి మా పెళ్ళి విషయం చెప్పేశాను. ఆయన కాలరుద్రుడిలా చిందులు వేశాడు. నేనా యింటి ఛాయలకొచ్చినా పాతేస్తానని బెదిరించారు. నీరజతో మాట్లాడటానికి ఎట్టి ప్రయత్నమూ చెయ్యొద్దనీ, శాస్త్రీ కనిపించకుండా నా అంతు చూస్తానని కేకలు వేశాడు.

తర్వాత మేము రహస్యంగా కలుసుకునేవాళ్ళం. నేను

పెళ్ళికి తొందరపడుతుంటే నీరజ వారించేది. నెమ్మదిమీద తండ్రితో చెప్పి ఆయన్ని ఒప్పిస్తానని చెప్పింది. నీరజ తన మనసు మార్చుకుంటున్నదేమో ననే అనుమానం కూడా కలిగింది నాకు!"

"అంటే మీమీద మనసు మార్చుకున్నదనా?"

"అవునండి. నాతో మాట్లాడటం తగ్గించేసింది. నన్ను కలవటం కూడా తగ్గించింది. దానితో ఆమెకు నామీద మోజు తగ్గిపోయిందనే అనుమానం కూడా కలిగింది నాకు! అందుకే ఏదోక విషయం తేల్చుకుందామని ఆమెకు ఉత్తరం రాసి పంపించాను. కాని అది ఎలా చేరిందో పరాంకుశంగారి చేతికి చిక్కింది."

"అయితే మీరు నీరజ పేర ఉత్తరం రాసినమాట నిజమేకదా! పరాంకుశంగారి జేబులో దొరికిన ఉత్తరమేనా?"

"అవునండి. నా దురదృష్టం నన్ను వెంటాడింది. ఆ ఉత్తరం ఆయనకెలా చిక్కిందో అర్థంకాదు. పొరపాటున కింద సంతకం పెట్టాను. అదీగాక పోలీసులు నా దస్తూరితో సరిపోల్చారు. ఆ ఉత్తరం నేను రాసిందేనని నిర్ధారణ చేశారు కూడా."

"మీరు పరాంకుశంగారింటికి వెళ్ళిన సమయానికి యింట్లో ఎవరెవరున్నారు?"

"ఎవరూ లేరండి. ఇద్దరు నౌఖర్లుండేవారు. వాళ్ళుకూడా సమయానికి లేరు. నేను నీరజ ఒక్కతే నాకోసం ఎదురు చూస్తుంటుందని, నా ఉత్తరంలో రాసిన ప్రకారం నౌఖర్లను ఏదో పనిమీద బయటికి పంపించేసి వుంటుందనీ అనుకున్నాను.

కానీ తీరా నీరజ గదివైపు వెళ్తుండగా, పరాంకుశంగారి గది తలుపులు తెరిచివుండటం గమనించాను. అయితే ఆయన

యింటిలోనే వున్నారని, ఫ్యాక్టరీకి పోలేదని గ్రహించి వెనక్కి తిరగబోయాను. ఇంతలో 'ఢాం' అన్న పిస్తోలు చప్పుడు విని పరిగెత్తుకుని ఆయన గదిలోకి వెళ్ళాను. ఆయన కుర్చీలో తల పక్కకి వాల్చి వున్నారు. గుండెల్లో నించి రక్తం స్రవిస్తోంది. పక్కనే రివాల్వర్ వుంది.

నా గుండె ఝల్లుమంది. నా కళ్ళు చీకట్లు కమ్మినట్టుగా అయింది. దగ్గరికి వెళ్ళి చూడాలనుకుని ధైర్యం చాలక భయంతో వెనుతిరిగాను. అప్పటికే నీరజ నిల్చుని వుంది. జరిగింది చూచి కెవ్వున కేకపెట్టింది. నేనే హత్య చేశానని భ్రమించి పోలీసులకి ఫోన్ చేసింది. నేను వారించినా వినలేదు. పోలీసులు, జైలు అనగానే భయంవేసి పారిపోబోయాను. ఇంతలో నౌఖర్లు నన్ను పట్టుకుని ఆపేశారు. ఇంతలో పోలీసులు వచ్చేశారు" చెప్పాడు ప్రసాద్.

కిరణ్ రెండు క్షణాలు మౌనంగా వున్నాడు.

"ఇందాక నీరజకి మీమీద మనసు లేదేమోనని అనుమానం వెలిబుచ్చారు. ఆమె మనసు అన్యాక్రాంతమయిందేమో ఖచ్చితంగా చెప్పగలరా? అంటే ఆమెకు మీరుగాక యింకా, సన్నిహితంగా వున్న స్నేహితులుగాని, బాయ్ ఫ్రెండ్‌గాని వున్నారా?"

"నాకు నీరజతో నాలుగేళ్ళ సన్నిహితత్వముంది సార్! ఆమె బుద్ధెరిగి నాతోనే స్నేహం చేసింది. ఆమెకు బాయ్ ఫ్రెండ్సంటూ ఎవ్వరూ లేరు. కాకపోతే గత రెండు నెలలుగా నాతో అంత ఫ్రీగా మూవ్ కాకపోవటాన్ని బట్టి నేనలా అనుమానించాను, అంతే!"

"పరాంకుశంగార్ని హత్యచెయ్యటాని కుపయోగించిన రివాల్వర్ మీరెప్పుడైనా ఎవరిదగ్గరైనా—అంటే నీరజదగ్గర గాని, యింకెవరి దగ్గరయినాగాని చూశారా?"

"లేదు సార్! అసలు పరాంకుశంగారికి రివాల్వర్ వున్న సంగతి కూడా నాకు తెలియదు."

"ఓ.కే! ఇంకా ఏమైనా చెప్పాల్సిన వుంటే చెప్పండి. మిమ్మల్ని నిర్దోషిగా కంటే దోషిగా నిరూపించే సాక్షాధారాలే కనిపిస్తున్నాయి. అయినా మీరు నిర్దోషి అయితే కాపాడటానికి నేను ప్రయత్నిస్తాను. ఐ విల్ ట్రై మై లెవెల్ బెస్ట్!" అన్నాడు కిరణ్ లేస్తూ.

ప్రసాద్ చేతులెత్తి మరోసారి నమస్కారం చేశాడు.

కిరణ్ వంక మందహాసం చేస్తూ చూసి, "ఏమిటి, మీ క్లయింట్ హత్య చెయ్యలేదంటున్నాడా?" అన్నాడు ఇనస్పెక్టర్ శ్రీనివాస్.

"మై డియర్ యినస్పెక్టర్! ఒక్కొకసారి మనం ఊహించని రీతిలో హంతకుడు దొరుకుతాడు. ప్రత్యక్షంగా దొరికినవాడే హంతకుడని ఎలా చెప్పగలం?" అన్నాడు కిరణ్.

శ్రీనివాస్ ముఖం గంభీరముద్ర దాల్చింది.

"సో, వాట్ నెక్ట్స్?" అన్నాడు.

"మనిద్దరం బయల్దేరి పరాంకుశంగారి అమ్మాయిని కలిసి మాట్లాడాలి. కమాన్!" అన్నాడు కిరణ్.

"ఓ.కే. పద వెళ్దాం" లేచాడు శ్రీనివాస్.

4

"నా పేరు కిరణ్—మీ తండ్రిగారి హత్యకేసు పరిశోధిస్తున్నాను" అన్నాడు కిరణ్ నీరజతో.

ఆమె యిద్దరికి నమస్కారంచేసి కుర్చీలు చూపించింది.

"ఇలాంటి దుఃఖసమయంలో మిమ్మల్ని మళ్ళీ మళ్ళీ విసిగించడం భావ్యంకాదు—అయినా తప్పదు. ప్రసాద్ మీకు ఎన్నేళ్ళుగా తెలుసు?" అడిగాడు కిరణ్.

"దాదాపు నాలుగేళ్ళుగా!"

"మీ రిద్దరూ ప్రేమించుకున్నారు కదూ!"

"అవును. పెళ్ళికూడా చేసుకోవాలనుకున్నాం. ఇక కొద్దిరోజుల్లో పెళ్ళి జరిగివుండేది. కాని యింతలో...."

ఆమె కంఠం గద్గదికం గావటం గమనించాడు కిరణ్. రిలీఫ్‌కోసం రెండు క్షణాలు ఆగి అడిగాడు. "మీ యిరువురి మధ్య భేదాభిప్రాయాలేమైనా వచ్చాయా?"

"అబ్బే, అదేంలేదండి. ఈ మధ్య ఓ సారి నాన్నగారు ప్రసాద్ మీద కేకలు వేశారు. ప్రసాద్ నన్ను పెళ్ళి చేసుకుంటానని నాన్నగారితో చెప్పాడు. ఆయన రెచ్చిపోయారు. నీలాంటి గతిలేనివాడికి నా కూతుర్నివ్వను పొమ్మన్నాడు. మళ్ళీ కళ్ళబడితే అంతు చూస్తానని కూడా బెదిరించారు. నేను ప్రసాద్‌ని కలవకూడదని ఆంక్ష విధించారు. ప్రసాద్‌ని కలవటం అందుకే తగ్గించాను. నెమ్మదిమీద నాన్నగార్ని ఒప్పించాలనుకున్నాను. ఇంతలోనే ప్రసాద్ తొందరబడ్డాడు. నిష్కారణంగా నాన్నగార్ని పొట్టనబెట్టుకున్నాడు."

"ప్రసాద్ మీ నాన్నగార్ని చంపటం మీరు ప్రత్యక్షంగా చూశారా?" అడిగాడు కిరణ్.

"ప్రసాద్ చంపటం ప్రత్యక్ష్యంగా చూడలేదనుకోండి. 'ఢాం' అన్న శబ్దం వినిపించగానే ఒక్కసారిగా నా గది నుండి పరుగెత్తుకొచ్చాను. సరిగ్గా అదే సమయానికి నాన్నగార్ని చంపి ప్రసాద్ నాన్నగారి గదిలోనుంచి బయటకి కంగారుగా వస్తున్నాడు. నన్నుచూసి తప్పించుకోవాలనుకున్నాడు. నేను పోలీస్‌కి ఫోన్ చేస్తుండగా పారిపోబోయాడు. మా నౌకర్లు పట్టుకున్నారు."

"అంటే మీ గదినుండి మీ నాన్నగారు గదికి మీరు పరుగెత్తుకొచ్చేసరికి ప్రసాద్ మీ నాన్నగారి గదిలోనుండి

రావటం మీరు చూశారు. అంతేగాని, ప్రసాద్ హత్య చేస్తుండగా చూడలేదు—మరి ప్రసాదే హత్య చేశాడని ఎలా అనుకున్నారు?"

"ప్రసాద్ మా యింట్లోకి ప్రవేశించటం మేడమీది నా గదిలోనుండి చూశాను. నాన్నగారు యింట్లోనే వున్నారన్న విషయం ప్రసాదుకి సైగచేసి చెప్పాలనుకున్నాను. కాని అంతలోనే అతను హాల్లోకి వచ్చాడు. అతను మేడమీది నా గదికి రావాలంటే దిగువనున్న నాన్నగారి గది ముందునుండి వచ్చి మెట్లు యెక్కాలి. నాన్నగారి కళ్ళబడక తప్పదు.

అందుకే నేను నా గదిలోనుండి బయటికి వచ్చి చెప్పాలనుకునేలోపల అతనే యెందుకో వెనుతిరిగి వెళ్ళిపోబోతున్నాడు. నేను నా గదిలోకి వచ్చేశాను. ఇంతలో 'ఢాం' అన్న పిస్తోలుశబ్దం విని నేను నా గదిలోపల మెట్లు దిగి పరుగెత్తుకొచ్చాను. అప్పటికే ప్రసాద్ మా నాన్నగారి గది నుంచి వస్తున్నాడు. మళ్ళీ ఎప్పుడు మా నాన్నగారి గదిలోకి వెళ్ళాడో, ఎప్పుడు హత్యచేశాడో చాలా వేగంగా జరిగిపోయింది" అన్నది నీరజ.

కిరణ్ ఆ యింటి గదంతా ఓ సారి పరీక్షగా చూశాడు.

ముందు గేట్లోంచి లోపలికి తిన్ననైన దారివుంది. ఇంటి ముందు ఎదర, వెనక బాగా ఖాళీస్థలముంది. ఓ పక్కగా కారు పార్కింగుకి స్థలముంది. ఇంటి చుట్టూ క్రోటన్సూ, పూలమొక్కలు పుష్కలంగా వున్నాయి. పోర్టికో దాటగానే వరండా వుంది. అది దాటగానే పెద్దహాలు!

ఆ హాలుకి కుడివైపు, ఎడమవైపు గదులున్నాయి. కుడివైపు గదుల పక్కగా వెళితే మేడమీదికి మెట్లున్నాయి. మేడమీద రెండే రెండు గదులు. బయటికే చాలా ఆకర్ష



ణీయంగా చలువరాళ్ళు తాపటం చేసినట్టు తెల్లటి పెయింట్‌తో మెరుస్తున్నాయి. బహుశా అందులో ఓ గది నీరజదయివుంటుంది. మరి రెండవది?

"మేడమీద యెన్ని గదులున్నాయి?" కిరణ్ అడిగాడు.

"రెండు."

"అందులో ఒకటి మీరు వాడుకుంటున్నట్టున్నారు. మరి రెండవది?"

"రెండవది నాన్నగారి గది."

"మరి దిగువనున్న గది మీ నాన్నగారిదని చెప్పారు."

"అవునండి. పగలంతా ఆయన దిగువ గదిలోనే తన పని చూసుకుంటారు. ఆయనకి బ్లడ్ ప్రెషరుంది. అస్తమాను మేడమెట్లు యెక్కి దిగుతుంటే ఆయాసమొస్తున్నదని దిగువ గదిలోనే ఎక్కువగా వుంటారు. రాత్రి నిద్రపోయేదానికే పై గది ఉపయోగిస్తారు. నేను పై గదిలోనే యెక్కువగా వుంటాను. క్రింది గదులు కూడా వాడుతుంటాను. ఇంట్లో వున్నది నాన్నగారు, నేను! ఇల్లంతా ఏం చేసుకునేది?" అన్నది నీరజ.

"ఓ సారి మీ నాన్నగారు హత్య చెయ్యబడ్డ గది చూడాలి. పదండి" అన్నాడు కిరణ్.

నీరజ దారితీసింది. కుడివైపున్న గదుల్లో చివరిగది దగ్గర ఆగింది. తాళంపెట్టి వున్నది.

"ఈ గదితాళం నా దగ్గరే వున్నది!" అంటూ జేబులో నించి తాళాలగుత్తి తీశాడు శ్రీనివాస్. ఓ తాళంతో కప్ప తెరిచాడు.

గది విశాలంగా వుంది. లోపల ఓ బెడ్, ఓ కుర్చీ, మేజాబల్ల వున్నాయి. రేక్స్‌లోను, అల్మారాల్లోను పుస్తకాలు, ఫైల్సు తొంగిచూస్తున్నాయి. గదిలో తైలవర్ణ చిత్రాలు, దేశనాయకుల పటాలు వున్నాయి.

శ్రీనివాస్ గదిలో ప్రవేశిస్తూ, "ఇదిగో, యీ కుర్చీలో వుండగానే పరాంకుశంగారు హత్య చెయ్యబడ్డారు. తల పక్కకు వాలివుంది నేను చూసేసరికి. నెత్తురు ధారగా ఈ కుర్చీ మీదుగా కిందికి జారింది. చుట్టూ మడుగుకట్టింది. రివాల్వర్ గుండు సూటిగా గుండెల్లోనే గుచ్చుకోవటం మూలాన రక్తం బాగా పోయింది" అన్నాడు.

డిటెక్టివ్ కిరణ్ గదిని పరీక్షగా చూశాడు. శ్రీనివాస్ రెండోపక్క వున్న తలుపులు కూడా తెరిచాడు. గదినిండా నెత్తురు పరుచుకుంది. చల్లటిగాలి దక్షిణదిశనుండి ఆ గదిలోకి వీస్తుంది తిన్నగా.

"ఈ కుర్చీని జరపటం జరిగిందా?" అడిగాడు కిరణ్.

"లేదు. హత్య జరిగినపుడు ఏ స్థానంలో వుందో యిప్పుడు అక్కడే వుంది."

"ఊ, కుర్చీ డైరెక్షన్....అంటే దిశ....?"

"ఇదిగో, వెనకద్వారం వైపుగా ఫేసింగ్ అయివుంది కదా! ఇది దక్షిణదిక్కు! అంటే ఉత్తరం వైపుగా వీపు పెట్టుకుని యిటు పెరటివైపుగా కూచునివుండి వుంటారు. పెరటివైపుగా గాలి బాగా వీస్తుందని అలా కూర్చునే

వారేమో!"

"అంటే, హాలులోనుంచి వెళ్ళేవాళ్ళకు ఆయన వీపు మాత్రమే కనిపించే అవకాశం వుంది. అవునా?" అడిగాడు కిరణ్.

"అవును."

"మరి ప్రసాద్ లోపలికి వచ్చింది హాలులోనుండే కదా! ఏమ్మా నీరజా, అంతే కదా!"

"అవునండి. హాల్లోనుండి యీ గదిమీదుగా మేడమెట్లు ఎక్కిరావాల్సి వుంటుంది."

"మీరు ప్రసాద్ హాల్లోనుండి మీ గదివైపుగా రావటం వరకు చూశారు కదూ!"

"అవునండి."

"పెరట్లోనుండి, అంటే మీ నాన్నగారు ముఖంపెట్టిన వైపునుండి కాదుగదా ప్రసాద్ లోపలికి వచ్చినది!?"

"కాదండి. సరాసరి హాల్లోనుండే వచ్చాడు."

"మై డియర్ ఇన్‌స్పెక్టర్! హాల్లోనుంచి లోనికొచ్చిన ప్రసాద్—పరాంకుశంగార్ని ఎదుటనుంచి ఎలా పిస్తోలుతో కాల్చాడు? పరాంకుశం హాల్లోకి వెన్నుపెట్టి కూచుని వున్నారు కదా! హత్య జరిగినప్పుడు కూడా ఆయన అదే స్థానంలో వున్నట్టు నువ్వే చెప్పావు. అంటే పెరటిద్వారం గుండా యెవరో వచ్చి పరాంకుశంగార్ని కాల్చివుండాలి అవునా?"

శ్రీనివాస్ అయోమయంగా చూశాడు కిరణ్‌వంక. ఇంతలోనే ఏదో గుర్తొచ్చి, "అలా అనే యెందుకనుకోవాలి? ప్రసాద్ పరాంకుశంగారి యెదుటబడి, ఆయనతో ఘర్షణపడి యెదుటినుండే కాల్చివుండొచ్చుగా!" అన్నాడు.

"అక్కడే పొరబడ్డారు అంతా! ప్రసాద్ పరాంకుశం

గారితో మాట్లాడేంత సావకాశం కూడా లేదు. అతను పరాంకుశంగారి గదిలోనికి వెళ్ళకుండా వెనుతిరిగి వెళ్ళటం నీరజ చూశారు—ఇంతలోనే పిస్తోలుశబ్దం వినిపించింది. ముందు ప్రసాద్, ఆ వెనుక కొద్ది క్షణాల వ్యవధిలో నీరజ పరాంకుశంగారి గదిలోకి ప్రవేశించారు. ఇంత తక్కువ వ్యవధిలో ప్రసాద్ పరాంకుశంగారితో ఘర్షణపడి, పిస్తోలు చేజిక్కించుకుని పెరటిద్వారం దగ్గరకిపోయి కాల్చటం అసంభవం. అంటే యెవరో మరోవ్యక్తి పెరటిద్వారం నించి పరాంకుశంగార్ని కాల్చివుండాలి....'' అంటూ కిరణ్ పెరటిద్వారం దగ్గర పరీక్షగా చూశాడు.

అక్కడ చుట్టూ క్రోటన్స్ మొక్కలున్నాయి. చాలా గుబురుగా వున్నాయి. మనిషింత ఎత్తు ఎదిగివున్నాయి. చివర్లు అందంగా కత్తిరించబడివున్నాయి. అక్కడ ఓ మనిషి నిల్చుంటే బయటివాళ్ళకి కనిపించటం కష్టం!

కిరణ్ క్రోటన్స్ పక్కనే పరీక్షగా చూశాడు. అక్కడ మొక్కలు కాలితో తొక్కిన గుర్తులు స్పష్టంగా వున్నాయి. మొక్కల మొదళ్ళు విరిగివున్నాయి. బహుశా బూటు కాలితో తొక్కివుండాలి!

మొక్కల పక్కనేవున్న ఓ వస్తువు కిరణ్ దృష్టి నాకర్షించింది. అది పొడవుపాటి రాయల్ చుట్ట! చాలా అరుదుగా దొరికేది, ప్రత్యేకమైన వ్యక్తులు వాడేది! ఆ పక్కనే అయిదారు అగ్గిపుల్లలు-వాడినవి పడున్నాయి. అంటే యెవరోవ్యక్తి అక్కడ కొంతసేపు యెదురుచూస్తూ నించున్నాడన్న మాట! కర్చీఫ్‌తో చుట్ట మొదలుభాగంపట్టి తీశాడు.

కిరణ్ గదిలోకొచ్చి నీరజని అడిగాడు. "మీ నాన్న గారికి చుట్టలు తాగే అలవాటుందా?'' అని.

నీరజ చెప్పింది. "లేదండి ఆయన సిగరెట్లుగాని, చుట్టలుగాని ఏవీ తాగరు-పైపే వాడతారు."

కిరణ్ ఆమెవంక సూటిగాచూసి, "మీకు దగ్గర బంధువులెవరైనా వున్నారా? అంటే, మీ నాన్నగారు పోవటం వల్ల ఆర్థికంగా లాభం పొందేవాళ్ళు! అలాంటి వాళ్ళుంటే చెప్పండి" అన్నాడు.

నీరజ తల అడ్డంగా తిప్పి "ఎవరూ లేరండి. మా అమ్మ తమ్ముడు-మేనమామ ఒకాయన వున్నాడు. ఆయన అప్పుడప్పుడు వచ్చి వెళ్తుంటాడు" అన్నది.

"ఆయననేం చేస్తుంటాడు? ఏం పేరు? వయసెంత?" అడిగాడు కిరణ్.

"ఆయన ఎక్స్ సర్వీస్‌మన్. పేరు సూర్యం. ఆర్నెల్ల క్రితం జాబ్ పూర్తి చేసుకొని వచ్చాడు. వయసు చిన్నదే. ముప్ఫయిలోపు" అన్నది నీరజ.

కిరణ్ మస్తిష్కంలో మెరుపులు మెరిశాయి.

తాను సేకరించిన చుట్ట బయటికి తీసి, "మీ మామయ్య దగ్గర యిలాంటి చుట్టలు యెప్పుడైనా చూశారా?" అనడిగాడు కిరణ్.

ఆ చుట్ట చూస్తూనే "ఆం మామయ్య యీ చుట్టలే వాడతారు. మిలిటరీనించి వస్తూ యిలాంటివి చాలా కట్టలు వెంట తెచ్చుకున్నాడు కూడా!" అన్నది నీరజ.

"ఒక్క విషయానికి సూటిగా జవాబు చెప్పండి. మీ మామయ్య మిమ్మల్ని వివాహం చేసుకోవాలనే ప్రపోజల్ ఏదయినా వుందా?" అనడిగాడు.

నీరజ వెంటనే సమాధానం చెప్పలేదు. తర్వాత మెల్లిగా అన్నది "ఇదివరలో అంటే మామయ్య మిలట్రీకి వెళ్ళకముందు మా అమ్మగారు బతికుండగా ఆ ప్రసక్తి

వచ్చిందండి. తర్వాత మొన్న మొన్న ఆయన తిరిగొచ్చాక నాన్నగార్ని అడిగాడు. నాన్నగారు కోప్పడి కేకలువేశారు. మామయ్యకి యుద్ధంలో చెంపమీద పెద్దగాయమయింది. వికృతంగా వుంటాడు. అదీగాక మిలట్రీ మనిషికి నన్ను కట్టబెట్టడం నాన్నగారి కిష్టంలేదు" అన్నది నీరజ.

"మీ నౌకర్లు యెవరు? ఓ సారి యిటు పిలవండి" అన్నాడు కిరణ్.

నీరజ పిలిచింది.

5

"ఇతని పేరు సోములు. ఇతని పేరు రజాక్. దాదాపు అయిదేళ్ళుగా పని చేస్తున్నారు. నమ్మకస్తులు" అన్నది నీరజ.

కిరణ్ పరిశీలనగా చూశాడు. ఇద్దరూ నడివయసు దాటినవాళ్ళే!

కిరణ్ వాళ్ళిద్దర్నీ ఉద్దేశించి "మీలో నీరజగార్కి ప్రసాద్‌గారు రాసిన ఉత్తరం ఎవరు అందుకున్నారు?" అనడిగాడు.

సోములు ముందుకొచ్చి "నేనేనండి. అయ్యగారు— ప్రసాద్‌గారు వచ్చినా, ఉత్తరాలు రాసినా ఆ సంగతి అమ్మాయిగార్కి చెప్పకుండా సరాసరి తమకే చెప్పమన్నారండి. అంచేత ఓ పిల్లగాడు ఉత్తరం తెస్తే దాన్ని నేను అందుకుని చూశానండి! అది ప్రసాద్‌గారు రాసినదేనండి. అయ్యగారికిచ్చానండి" అన్నాడు.

"అయ్యగారికిచ్చేముందు దాన్ని నీరజ మామయ్య సూర్యంగారి కిచ్చావు కదూ!" గద్దించాడు కిరణ్.

"బాబోయ్, లేదండి!" లబలబలాడాడు సోములు.

"శ్రీనివాస్! వీడ్ని నాలుగు ఉతికెయ్! నిజం చెబు

తాడు" అన్నాడు కిరణ్.

శ్రీనివాస్ లాఠీతీసి "ఒరే, నిజం చెప్పకపోతే జైల్లో తోసేస్తాను. చెప్పు, ఏం జరిగిందో చెప్పు!" అన్నాడు.

సోములు ఒక్కసారిగా శ్రీనివాస్ కాళ్ళమీద పడి పోయడు. "నన్ను క్షమించండి బాబూ! నిజం చెప్పేస్తాను. సూర్యంబాబు ప్రసాద్‌గారి గురించి మమ్మల్ని నిగా వెయ్యమన్నారండి. ఆయన యిక్కడికొచ్చినా, ఉత్తరాలు రాపినా ముందు తనకి తెలియచెప్పమన్నారండి. మా ఇద్ద రికీ డబ్బులు బాగా ఇచ్చేవారండి. అలాగే మొన్న ప్రసాద్ గారు రాసిన ఉత్తరం సూర్యంబాబుకి యిచ్చానండి! ఆయన నాకు ఏభై రూపాయలిచ్చి ఉత్తరాన్ని జేబులో పెట్టేసుకున్నారండి. తర్వాత రజాక్‌ని పిలిచి ఏదో చెప్పా రండి. అది నాకు తెలియదండి" అన్నాడు.

శ్రీనివాస్ అడక్కముందే రజాక్ వాళ్ళిద్దరికీ సాష్టాంగ పడి నమస్కారాలు చేసి, "నన్ను నిండా చమించాలి బాబయ్యా! అయ్యగారి పిస్తోలు తెచ్చియివ్వమని సూర్యం బాబు నాకు నూరురూపాయలిచ్చారండి. బుద్ధి గడ్డితిని అయ్యగారి పడగ్గదిలో పరుపుకింద దాచివున్న పిస్తోలు తెచ్చి సూర్యంబాబు కిచ్చానండి. దాంతో అయ్యగారినే చంపేత్తారని నాకు నిజంగా తెలియదు బాబూ! అయ్యగారు చనిపోయే రోజున సూర్యంబాబు మా ఇద్దర్ని పిలిచి చెరో పదిరూపా యలు యిచ్చి, ఓ గంటసేపు బయట తిరిగిరమన్నారండి! మళ్ళీ మేము తిరిగొచ్చేసమయానికి హడావుడిగా మాకు ఎదురొచ్చారండి గేటు దగ్గర. మేం లోపలికొచ్చేసరికి ప్రసాద్‌బాబు పారిపోతుంటే అమ్మగారు పట్టుకోమన్నా రండి. ఇంతలో పోలీసులు వచ్చారండి!" అన్నాడు రజాక్.

నీరజ నిప్పులుకక్కుతూ వాళ్ళవంక చూసి "చివరికి

తిన్న యింటికే ద్రోహం తలపెట్టారా కుక్కల్లారా!"
అంది.

కిరణ్, శ్రీనివాస్ వంక తిరిగి "డియర్ ఇన్‌స్పెక్టర్! కేసు ఎలా మలుపుతిరిగిందో చూశావా? ఒకే ఒక్క గుండుదెబ్బతో పరాంకుశంగార్ని హత్య చేశారనగానే హంతకుడు చాలా ఎక్స్‌పర్ట్ అయుండాలనుకున్నాను. నీరజగారు వాళ్ళ మామయ్య గురించి చెప్పగానే హత్య జరిగిన విధానం ఒక్కసారిగా నా కళ్ళముందు మెరిసింది.

సూర్యం, నీరజ తనకి దక్కదని నిర్ధారణ చేసుకున్నాడు. పరంకుశంగార్ని చంపి ఆ హత్య ప్రసాద్ మీద రుద్దితే అటు ప్రసాద్ జైలుపాలవుతాడు. ఒంటరి ఆడది నీరజ. ఆ ఆస్తితో దక్కుతుందనుకున్నాడు పాపం పూర్ ఫెలో! అనవసరంగా నౌకర్లని వాడుకుని దొరికిపోయాడు. గో అండ్ అరెస్ట్ హిమ్!" అన్నాడు. ★

రెండాకులు ఎక్కువ!

ప్రతీ శనివారం పిక్చర్‌కి వెళ్తాం. ఆ రాత్రి వంటచేయనక్కరలేదు. ఇంటావిడ విడమర్చి చెబుతోంది.

కొత్తగా చేరిన వంటమనిషి తలూపింది.

"ఇంకా.........ఇంటావిడ చెప్పబోతోంది.

"ఆదివారం ఉదయం టిఫిన్ చేయనక్కరలేదనుకుంటాను. ఎండెక్కి లేస్తారు!" అంది వంటమనిషి.

—ఎమ్. శిరీష, విశాఖపట్నం.

శ్రీవారి లీలలు

కృష్ణవేణి

విజయవాడ

6-8-1981

డియర్ సుధా!

నీకో శుభవార్త.

శుభవార్త అనగానే విషయం గ్రహించే వుంటావు.

ముప్పై సంవత్సరాల వయస్సు దాటినా నాగూర్చి యెవరికీ పట్టలేదు. అమ్మా నాన్నా చనిపోవడంతో ఒంటరిదానిని అయ్యాను.

అన్నా వదినల స్వార్థాన్ని భరించలేక ఒంటరిగా జీవిస్తున్న నా చీకటి బ్రతుకులోకి ఓ వెలుగు కిరణం వచ్చింది. దాని పేరే ప్రభాకర్!

నా ర్త్‌లో వుండే స్పిన్నింగ్ కంపెనీకి సౌత్‌లో సోల్ రిప్రజంటేటివ్. అనుకోకుండా సినిమాహాలు లోని పరిచయం పరిణయానికి దారితీసింది.

మొన్న శనివారం నాడు స్థానికి వెంకటేశ్వర స్వామి కోవెలలో చాల చాల నిరాడంబరంగా మా కల్యాణం జరిగింది.

మొన్న శనివారం నుండి యీ రోజు వరకూ రోజులు క్షణాల్లా గడచిపోయాయి. వారు ఈ రోజు క్యాంపుకి వెళ్ళారు.

అందువలన తీరిక చిక్కి నీకు లెటరు వ్రాస్తు న్నాను, నీవు హృదయపూర్వకంగా సంతోషిస్తావని.

సుధా! మొదటిసారే యీ దేశంలో ఆడపిల్లలకి పెళ్ళిళ్ళు కావడం చాల కష్టంగా వుంది. రెండో పెళ్ళి అంత యీజీనా అని నీవు అనవచ్చు. కాదని నాకు తెలుసు.

సుధా! అవకాశం వస్తే జారవిడుచుకోకు, మూఢ నమ్మకాలకి యీ సమాజానికి భయపడి.

సాధ్యమైనంతవరకూ అనుభవించాలన్నది యీ వారంలో నాకు తెలిసింది.

నీ శుభం కోరే నీ స్నేహితురాలు.

—ఉషారాణి,

ఆ లెటరు చదివి సుధ నిజంగానే వెర్రి ఆనందాన్ని పొందింది.

వెంటనే ఉషకి లెటరు వ్రాసింది.

విజయనగరం
10-8-1981

డియర్ ఉషా!

ఉభయకుశలోపరి.

ఓ నెలనుండి నాలో నేను మధనపడుతూవున్నాను గానీ సంకోచంవలన నీకు యీ విషయాన్ని తెలియ పరచలేకపోయాను.

కేవలం సిగ్గుతోనే.

నీకు మాదిరిగానే నా విషాదం క్రమ్మిన జీవితం లోకి రాధాకృష్ణ ప్రవేశించి, నా బ్రతుక్కి అర్ధాన్ని కలిగించాడు.

ఆయన మెడికల్ రిప్రజంటేటివ్.

నేనంటే ఎంతో ప్రేమాభిమానాలు.

పెళ్ళాం చనిపోయిన మగాడు తన జీవితాన్ని తీర్చిదిద్దుకుంటున్నప్పుడు స్త్రీ మాత్రం వ్యర్ధజీవితం ఎందుకు గడపాలి అనే ఆదర్శంగల వ్యక్తి.

ఉషా!

మార్పు అనేది కొందరి జీవితంలో ముందు మందకొడిగా వున్నా తరువాత వేగాన్ని అందు కుంటుందోయ్!

మా యిద్దరి ఫోటో నీకు పంపిస్తున్నాను. మీ యిద్దరివీ పంపు.

ప్రేమతో—

సుధారాణి.

2

ఎవరో సార్జంటు తంగానికి, ఇనస్పెక్టర్ పళనివేలుకి తెలుగులో లెటరు వ్రాశారు.

ఇద్దరికీ తెలుగురాదు.

అదేం లెటరో? అందులోవున్న విషయం యేమిటో తెలియదు.

తమ సిబ్బందిలో ఒకరిద్దరికి వచ్చుగానీ వాళ్ళు లీవులో వున్నారు. అందుకని తంగం దానిని పుచ్చుకొని ఓ తెలుగు స్నేహితుడి దగ్గరికి వెళ్ళి చదివించుకొని తెగ వుబ్బిపోయి, బంతిలా స్టేషనుకి తిరిగివచ్చి, ఆయాసాన్ని తీర్చుకోకుండానే....

"సార్! మనం పరిశోధించిన కేసులని మద్రాసులో వుంటున్న ఓ రచయిత్రి తెలుగు అపరాధ పరిశోధనకి వ్రాసి పంపిస్తున్నారట.

ఓ తెలుగు పాఠకుడు మనల్ని అభినందిస్తూ వ్రాశాడు సార్!

పైగా....మా ఆవిడ చేసే వంటపేర్లు బావున్నాయని, అవి తయారుచేయు విధం కూడా ఆ కథల్లోనే చెప్తే ఎంతో సౌకర్యంగా వుంటుందని వ్రాశాడు సార్!

సార్! మన కీర్తి తమిళనాడు నుండి ఆంధ్రాకి పాకిపోయిందండో...."

ఫోన్ రింగైయింది.

తంగం టక్కున తన నోరుని మూసేశాడు.

ఇన్స్పెక్టర్ ఫోన్ అందుకొని "హల్లో" అన్నాడు.

"సార్! నేను సైదాపేట నుండి ఫోన్ చేస్తున్నాను. నా పేరు మణి అయ్యర్! చిన్న టీ కొట్టు నాది. నా కొట్టుపైన గదిలో ముత్తురామన్ అనే ఆయన వుండే

వాడు. అయన తన గదిలో చచ్చిపడి వున్నారు."

మణి అయ్యరు చెప్పాడు.

"ఎవరు చూశారు?"

"ఆయన యింట్లో పనిచేస్తున్న పనిపిల్ల."

"డోర్ నెంబరు?"

"247."

"సరి వస్తున్నాం."

సైదాపేటలో ఆ యింటిని కనుక్కోవడం చాల తేలిక అయింది.

చాలమంది గుంపుచేరి వున్నారు.

పోలీసులకి మణి అయ్యర్ స్వాగతం పలికాడు.

అతను చెప్పినట్లు అతనిది చిన్న టీ కొట్టుకాదు. ఓ మాదిరి హోటల్. ఫోను అదీ వున్నది.

హోటలు పైన వుండే పోర్షన్‌లో ముత్తురామన్ వుంటున్నాడు.

ఒక పెద్దహాలు. ఓ గది లావెట్రీ. బాత్‌రూము వున్నది. అంతా మొజాయిక్ చేసివున్నది.

హాలులో డబుల్‌కాట్ సన్‌గ్లాస్ మంచం. దానిమీద డన్‌లప్ పరుపు, పిల్లోస్, వాటిమీద ఖరీదైన వెల్వెట్ బెడ్‌షీటు వేసివున్నది.

ముత్తురామన్ మంచంమీద వెల్లకిలా పడివున్నాడు. చాల బాధ అనుభవించినట్లు అతను పడివున్న తీరు, నలిగిన దుప్పటి చెప్పుతోంది.

కళ్ళు కుక్కున్నాడు.

మనిషి మెడలో పొడవాటి చైను, కుడిచేతికి బంగారు గొలుసు, ఎడమచేతికి బంగారు చైను కలిగిన రోలక్సు వాచి వుంగరాలు వున్నాయి.

హాలులో టి.వి., ఫ్రిజు వంటి స్టేటస్ సింబల్సు అన్నీ వున్నాయి.

ఖరీదైన జీవితాన్ని జీవిస్తున్న వ్యక్తి.

"ఈయన గూర్చి వివరాలు తెలిపిన వాళ్ళు ఎవరైనా వున్నారా?" ఇన్స్పెక్టర్ అడిగాడు.

మణి అయ్యరు ముందుకొచ్చి "ఈ ఇల్లు నాదే సార్! ఐదొందలకి బాడిగకి వదిలాను. ఐదేళ్ళ నుండి వుంటు వున్నారు."

"భార్య పిల్లలు లేరా?"

"ఉన్నారట సార్ వారి వూరిలో."

"ఐదేళ్ళ నుండి కాపురానికి తీసుకొని రాలేదా?"

"లేదు సార్!"

"ఎందుకని?"

"ఆయన అస్తమానం క్యాంపులకి వెళ్తారుసార్! నెలలలో ఓ వారం యిక్కడ వుండటం కష్టం సార్! ఆమె ఒంటరిగా వుండలేదని అమ్మగారి యింటిలోనే వుంచానన్నారు సార్."

"ఎక్కడ పనిచేస్తున్నారు?"

"తెలియదు సార్!" బుర్రగోక్కున్నాడు.

"వివరాలు తెలుసుకోకుండానే అద్దెకిచ్చావా?"

"ఇంజనీరని అన్నారు. అద్దె అయిదొందలు అనగానే సరే అన్నారు. మీల్సు, కాఫీ, టిఫిన్ మా హోటలు నుండే వెళ్తుంది.

ఆయన వచ్చేది తెలియదు పోయేది తెలియదు. ఫస్టుకి టంచనుగా అద్దె యిచ్చేస్తారు. ఈ మద్రాసు నగరంలో అంతకన్నా కావలసినదేముంది సార్!"

"ఆడవాళ్ళు రావడం పోవడం వంటిది ఏమైనా వుందా?"

"లేదు సార్!"
"ఫ్రెండ్సు?"
"అదీను లేదు సార్."
"పనిమనిషి వుందా?"
"ఓ పిల్ల వుందండి."
"పిలవండి."
ఓ పాతికేళ్ళ యువతి ముందుకొచ్చింది.
చూస్తే పనిమనిషిలానే లేదు. ఓ సామాన్య ఇల్లాలు మాదిరిగా నీటుగా శుభ్రమైన చీర కట్టుకొని తల దువ్వుకొని పూవులు బొట్టు కాటుక పెట్టుకొని వుంది.
బాగా ఏడవడం వలన కాటుకా బొట్టు చెరిగి మరకలు ఏర్పడి వున్నది.
"నీ పేరేమిటి?"
"నిర్మల."
"పెండ్లి అయిందా?"
అయింది అన్నట్లు తలూపింది.

"నూరురూపాయలు" తలొంచుకొని చెప్పింది.

ఇన్‌స్పెక్టర్ తల పంకించారు.

శవం ఫోటోలు వేలిముద్రలు తీసుకున్న తరువాత ఎగ్జామ్ కోసం వ్యాన్‌లో జి.హెచ్.కి తరలించారు.

శవం వెళ్ళిన తరువాత ఇల్లంతా వెతుకసాగారు.

అతని యింటి అడ్రస్సుగానీ, ఆఫీసు అడ్రస్సుగానీ దొరకలేదు.

హాలులో నుండి చిన్నరూములోకి వెళ్ళి వెతకసాగారు.

చాల శ్రమపడగా ఓ ఫైలు దొరికింది.

అందులో పన్నెండు పెళ్ళిఫోటోలు వున్నాయి.

పన్నెండు పెండ్లికూతుళ్ళు వేరేవేరే. కానీ పెండ్లి కొడుకు మాత్రం యితనే ముత్తురామన్.

పన్నెండు పెళ్ళిళ్ళు రిజిస్టర్ మ్యారేజులే.

పన్నెండు సర్టిఫికెట్లు వున్నాయి.

అయితే 'ముత్తురామన్' అన్న పేరు వీటిలో దేనిలోను లేదు.

1. అమరనాథ్ 2. ప్రతాపన్ 3. రాధాక్రిష్ణ 4. రాజ శేఖరం 5. మురళీకృష్ణ 6. సత్యమూర్తి ఇలా రకరకాల

పేర్లు వున్నాయి.

పన్నెండుమంది యువతుల వివరాలు అందులో వున్నాయి.

లత అనే అమ్మాయి మద్రాసులోనే ఐ.ఓ.బి. బ్యాంకులో క్లర్కుగా పనిచేస్తోంది. ఆమె నివాసం పెరంబూరు.

ఇంకొకామె అడయారులో సంగీతస్కూల్లో టీచరుగా పనిచేస్తోంది. ఆమె అడ్రస్సు అడయారే.

మిగిలిన పదిమంది ఆంధ్రా యువతులు.

నెల్లూరు, చిత్తూరు, ధర్మవరం, విజయవాడ, విజయ నగరం, తెనాలి, గుంటూరు ఇలా వూరుకో యువతి.

అంతా వుద్యోగినులే.

అందరూ ముప్పైపైన దాటినవారే.

3

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో పనిచేస్తున్న లత దగ్గరికి వెళ్ళారు.

ఆమె వయస్సు ముప్పైఐదు దాటినట్లు నలభైకి దగ్గర పడినట్లు చూడగానే తెలుస్తోంది.

మంచి హోదాలో వుంది.

తమని తాము పరిచయం చేసుకొని "మీ హజ్బెండ్ వివరాలు చెప్తారా!"

"దేనికి?"

"కావలసి వచ్చింది."

"నాకే సరిగ్గా తెలియదు. బ్యాంకులోనే నాకు అమర్ నాథ్‌తో పరిచయం అయింది. తను ఆంధ్రాలో స్పిన్నింగ్ ఏజంటుగా వుంటున్నానని, ఇంజనీరింగ్ చదివానని తన చదువుకి తగ్గ జాబు దొరకలేదని, నెలకి ఒకసారి ఆంధ్రా నుండి మద్రాసుకి క్యాంపుకి వస్తానని చెప్పారు.

నాకూ 'నా' అనేవాళ్ళు లేరు. నా గూర్చి పట్టించుకునే

వాళ్ళులేరు. ముప్పైఐదు దాటినా నాకు పెండ్లి కాలేదు.

ఒయాసిస్‌తో ఎండమావిలా అమర్‌నాథ్ నాకు పరిచయమయ్యారు.

రిజిస్టర్ మ్యారేజ్ అయింది. నాకు ఇద్దరు పిల్లలు.

ఈ ఆరేళ్ళలోనూ నేను ఒక్క పైసా ఆయన సంపాదన తినలేదు. పైగా నెల వచ్చేసరికి నా వద్దనుండే ఐదొందలు తీసుకొని వెళ్తున్నారు.

మీరు వుండే వూరు తీసుకెళ్ళండి అంటే ఏవో కుంటి సాకులు చెప్పుతున్నారు.

స్పిన్నింగ్ కంపెనీకి వివరాల కోసం వ్రాస్తే అటువంటి వ్యక్తి ఎవరూ తమ కంపెనీలో లేరని చెప్పారు.

పిల్లలు పెరుగుతున్నారు. ఖర్చులు పెరుగుతున్నాయి.

మీరు పెట్టకపోతే పోయింది నా డబ్బు వసూలు చేయకండి అని బ్రతిమాలినా ప్రతినెలా మాయమాటలు చెప్తున్నారు.

మొన్న లాయర్ నోటీసు ఆయన యిచ్చిన అడ్రస్సుకి యిప్పించా. అది తిరిగి వచ్చింది. విడాకులు పొందాలనుకుంటున్నాను" గబగబా చెప్పింది.

"ఆయన వయస్సులో మీ కన్నా చిన్నలా వున్నారు."

"ఔను" తలొంచుకొని చెప్పింది.

"ఇప్పుడు మీ దగ్గరకి వచ్చి ఎన్నాళ్ళయింది?"

"నెల అయింది. ఇవాళో, రేపో వస్తారు వసూలుకి. అవునూ ఇదంతా మీరెందుకు అడుగుతున్నారు?"

"ఆయన చంపబడ్డారు."

"ఆ(...." ఆర్తనాదం చేసింది.

ఎంతైనా ఇంకా భర్తేకదా!

4

అడయారులోని టీచరుని కలుసుకున్నారు. ఆమె ఇంచు మించు లత చెప్పిన కథే చెప్పింది.

అతను చనిపోయాడని తెలిసి ఏడ్చింది.

విజయవాడలోని ఉషారాణి వద్దకి వెళ్ళారు.

ఆమె కళ్ళు నిప్పులు కురిపించాయి.

"మోసగాడు. పెండ్లికాని అనాథ పిల్లలమీద వలవిసిరి విలాస జీవితాన్ని గడుపుతున్న వెధవ. నా స్నేహితురాలు తన పెండ్లిఫోటో పంపిస్తే ఆమె భర్త, నా భర్త ఒకరే అని తెలిసింది.

నిలబెట్టి అడిగితే, వెకిలిగా నవ్వుతూ—చాల అసభ్యంగా వుద్యోగం చేసే స్త్రీల గూర్చి హీనంగా మాట్లాడాడు.

నేను పోలీసు కంప్లయింటు యిస్తానని బెదిరించాను. పారిపోయాడు.

అయినా నేను నా స్నేహితురాలు కలసి వీడు యింకా ఎంతమంది స్త్రీల బ్రతుకు నాశనంచేస్తాడో అని హిందూలో మా పెండ్లి ఫోటోలు, అతని మోసం పబ్లిష్ చేశాం. మమ్మల్ని చంపుతానని బెదిరిస్తూ లెటరు వ్రాశాడు." అంటూ ఆమె హిందూ పేపరుని, అతని లెటరుని తెచ్చి చూపింది.

పోలీసులకి కంప్లయింటు యిచ్చినట్లు చెప్పింది.

పన్నెండు మందీ అతనికి భార్యలు అయింది కేవలం ఒంటరి వాళ్ళు కావడమే.

కానీ అతని సంపాదన వీళ్ళు తినలేదు.

ఎవరు చంపారు అన్నది ఆచూకీ తెలియలేదు.

5

పనిమనిషి నిర్మలని దబాయిస్తే ఆమె కూడా యితని శరీర భాగస్వామి అని తెలిసింది.

"తన వివరాలు ఏమైనా నీకు చెప్పాడా?"

"లేదు సార్. తనకి చదువుకునే రోజుల్లో పెండ్లి అయిందని, యిద్దరు పిల్లలని, మహాగారు అవమానం చేశారని, భార్యని వదిలేశానని చెప్పారు?"

"వూరు అదీ చెప్పారా?"

"లేదు సార్"

శవ రిపోర్టు వచ్చింది.

అన్నంలో విషం కలిపినట్లు తెలిసింది.

"తంగం, వెళ్ళి మణి అయ్యరుని అరెస్టు చెయ్యి" పళనివేలు అన్నాడు.

తంగం వెంటనే వెళ్ళి మణి అయ్యరుని అరెస్టుచేశాడు.

తనకేం తెలియదని లబో, దిబో మన్నాడు.

పోలీసు మర్యాద చేయగానే ఆ మర్యాదలని భరించలేక నేరం వొప్పుకున్నాడు.

మణి అయ్యరు, ముత్తురామన్ అతని గదిలో కలసి త్రాగుతూ వుంటారు. ఓనాడు తాగుడు మైకంలో తన లీల లన్నీ గొప్పగా చెప్పి — "నీ ముద్దుల పెళ్ళాం కూడా" అని చెప్పేశాడు.

మణి అయ్యరుకి ఆనందవల్లి మూడో భార్య. హోటలు ప్రక్కనే మేడమీద కాపురం.

మూడో భార్య కూడా తనని వదిలిపోతే, నాలుగో పెళ్ళి చేసుకుంటే నలుగురూ నవ్వుతారని, నెపం ఎవరిమీదో పోతుందని ముత్తురామన్‌కి పంపిన అన్నంలో విషం కలిపి పంపాడు.

అపర గోపాలకృష్ణుడు పన్నెండు మంది లీగల్ భార్య లని విధవలని చేసిపోయాడు.

దుష్టులకి ఏదో విధంగా శిక్షపడకపోదు. □

వెనక్కి నడిచే గడియారం

ఎమ్.వి.వి. సత్యనారాయణ

"ఈ రోజు నెంబర్ ఏం రాస్తున్నావు?"

తల వొంచి రాసుకుంటోన్న జనార్దనం తలెత్తాడు. వ్రేలు చూపించాడు. ప్రశ్న అడిగినవాడు అటుచూశాడు.

కొయ్యరాటకి మేకు దిగకొట్టి పలక వ్రేలాడగట్టి

వుంది. పలకమీద సుద్దముక్కతో అంకెలు రాసివున్నాయి.

"ఆరూ తొమ్మిదీ....ఏనభై రెట్లు!" అతడు చదువుకున్నాడు.

"థియరీ నువ్వే తీస్తావా?" అడిగాడు అతడు.

జనార్దనం చిరాకుగా బాల్‌పెన్‌ను బల్లమీద పెట్టాడు. రాస్తోన్న చిన్న పుస్తకాన్ని మూసేశాడు. బల్లమీది అలారం గడియారాన్ని చేతిలోకి తీసుకున్నాడు.

"చూడు బాబూ!" అన్నాడు జనార్దనం.

"నా పేరు బాబే! నీకు ఎలా తెలుసు?" అన్నాడు అతడు.

"ఇన్‌స్పెక్టర్ బాబువనుకున్నాను. లేకపోతే ఏమిటా ఎంక్వయిరీ ప్రశ్నలూ నువ్వూనూ....బ్రాకెట్టు నెంబర్లు రాసేవాళ్ళను తీసుకుపోయేవాడిలాగా...."

బాబు మొహం చిన్నబుచ్చుకున్నాడు.

"బ్రాకెట్టు ఆడితే సులువుగా డబ్బు వస్తుంది. ఈమాట ఎవరో అనుకుంటే విన్నాను."

"మన దగ్గర ఏమాత్రం డబ్బుంది?"

"మూడు రూపాయలు! సినిమాకి ఖర్చు పెట్టనా? బ్రాకెట్టు ఆడనా? తేల్చుకోలేకపోతున్నాను."

"సినిమా చూచినంత సేపే సరదా! కొన్ని సినిమాలయితే వున్న సరదాపోయి దుఃఖం మిగులుతుంది. నంబర్ రాయించు. వందలు పలకవచ్చు."

బాబు మొహంలో జ్యోతులు వెలిగాయి.

"ఏం చెప్పావయ్యా?"

"నేను నీకు యింతకు ముందు తెలుసా?"

"తెలియదు!"

"నీకంటె పెద్దవాడినేనా నేను?"

"అయే వుండాలి! నీ తల నెరిసింది కదా!"

"మరి ఏకవచనంలో మాట్లాడతావేం?"

"..............."

"గౌరవంగా మాట్లాడగలవ్ కదా!"

"ఆఁ!"

"నేనూ చదువుకున్నవాడినే! సంఘంలో కాస్త పరపతి వున్నవాడినే. కాలక్షేపానికి బ్రాకెట్లు నెంబర్లు రాస్తాను!"

"సారీ...."

"ఏ నెంబరు రాయను?"

బాబు గుణించుకుంటున్నాడు.

"జనార్దనం!" ఎవరో పిలిచారు.

జనార్దనం తల త్రిప్పాడు. పూర్ణయ్య.

"ఇంటికా?" అడిగాడు జనార్దనం.

"కాదు. ఇక్కడే వుండిపోతాను!"

"ఓపెనింగ్ వచ్చేవరకూ వుంటావా?"

"క్లోజింగ్ కూడా...."

జనార్దనం ఆశ్చర్యంగా చూశాడు.

"అవును. జనార్దనం! నా జీతంలో పద్దెనిమిది రూపాయిలా ఇరవై అయిదుపైసలు మిగిలాయి. వీటితో ఏం చేయను?"

జనార్దనం నిట్టూర్చి, "నెంబర్ రాయిస్తావా?" అన్నాడు.

"ఆఁ! అయిదూ నాలుగూ పదిరూపాయలు రాయి. ఆరూ తొమ్మిది మీద మిగతా డబ్బు రాసెయ్యి."

జనార్దనం చిన్నపుస్తకంలో కార్బన్ కాగితం సర్దాడు. నెంబర్లు రాశాడు.

"నాకూ అలాగే రాయండి. అటో రెండు రూపాయలు

ఇటో రూపాయి!" అన్నాడు బాబు.

జనార్దనం, పూర్ణయ్యా మొహాలు చూసుకుని బాబు మొహంలోకి చూడసాగారు.

2

"జనార్దనంగారూ!" పిలిచాడు పాలవాడు.

తూర్పున అప్పుడే రేఖలు విచ్చుకుంటున్నాయి.

పాలవాడు పొద్దుపొడుస్తోన్నవైపు చూచి కంగారుపడుతున్నాడు. ఈ డాబాలోని వాటాలన్నీ పూర్తయితే తనకి వేరే పనివుంది.

జనార్దనం పలకలేదు.

పాలవాడు జనార్దనం వాటా తలుపు తోశాడు.

తలుపు సులువుగా తెరచుకుంది. ముందుగదిలో రెండు బెంచీలూ, ఒక చిన్న రాతబల్లా, బట్టలు వేసుకునే చెక్కదండెమూ, న్యూస్‌పేపర్ల కట్టా వున్నాయి.

న్యూస్‌పేపర్ల కట్టకి యివతలగా .... నేలమీద .... జనార్దనం బోర్లగిలబడివున్నాడు. రక్తం కారి అతడి తల అట్టకట్టింది.

పాలవాడు బిక్కచచ్చిపోయాడు.

జనార్దనం బతికివున్నాడా? అతడిని ఎవరు గాయపరచారు? ఇప్పుడు తాను ఏం చేయాలి?

మౌనంగా వెళ్ళిపోతే....

పాపం! జనార్దనంలో యింకా వూపిరి వుండివుంటే....

పాలవాడు మాట్లాడకుండా తలుపు మూశాడు. బయటకు పరుగెత్తాడు. అరగంట తర్వాత ఆ డాబా స్వరూపమే మారిపోయింది.

పోలీసులతో పరిసరాలు గాంభీర్యం పులుముకున్నాయి.

3

డిటెక్టివ్ శిరీష్ శవంమీద వొంగాడు.

జనార్దనం తల పగిలి రక్తం కారింది. హత్య జరిగి ఎంత సేపయిందోగాని జుత్తు అట్టకట్టింది.

క్రైంబ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ కుమార్ నేలమీద గొంతు కూర్చున్నాడు.

"నేలమీద రక్తంలేదు!" అన్నాడు కుమార్.

"హత్య యిక్కడ జరిగివుండదు! లోపలి గదిలో జనార్దనం తలమీద కొట్టాడు హంతకుడు. జనార్దనమే గిల గిలలాడుతూ యిక్కడికి వచ్చి పడివుంటాడు."

ఇన్‌స్పెక్టర్ కుమార్ వ్రేలిముద్రల నిపుణుడికి సైగ చేశాడు.

డిటెక్టివ్ శిరీష్ హతుడి చేతికివున్న వాచీ చూశాడు. అది పన్నెండు గంటలకు ఆగివుంది.

హతుడు బోర్లగిల పడటంలో రెండు చేతులూ అటూ యిటూ చాపివున్నాయి.

"హత్య రాత్రి పన్నెండుగంటలకు జరిగి వుంటుం దంటావా?"

శిరీష్ మాట్లాడకుండా శవం కాలు వొంచాడు. కాలు వొంగలేదు. మోకాలివద్ద వెనక్కి ముడుచుకోవలసిన కాలు ముడుచుకోవడం లేదు.

శిరీష్ తిరిగి శవం చేతివ్రేళ్ళు వొంచబోయాడు. అవి వొంగలేదు.

పాథాలజీ సర్జన్ శిరీష్ భుజం తట్టాడు.

"రిగర్ మార్టిస్ ప్రారంభమయింది! అంటే హత్య జరిగి ఎనిమిది గంటలు దాటివుండాలి!" అన్నాడు సర్జన్.

శిరీష్ తన వాచీ చూసుకున్నాడు.

ఉదయం ఆరుగంటలయి అరగంట నడుస్తోంది.

"అంటే హత్య జరిగింది రాత్రి పదిగంటలకు ముందే అయివుండాలి!"

"అవును."

"అయితే వాచీ పన్నెండు గంటలు చూపిస్తోంది. ఎలా సాధ్యం?" అడిగాడు కుమార్.

"వాచీ పాడయిందేమో...."శిరీష్ హతుడి చేతివాచిని పరిశీలించాడు.

అద్దం పగిలి వుంది.

డిటెక్టివ్ శిరీష్ లోపలి గదిలోకి నడిచాడు.

బెడ్‌రూం. ఒక ప్రక్కగా పందిరి మంచం. దానికి యివతలివైపు టేబులూ, దానిముందు కుర్చీ, టేబులుమీద ఏనాటిదో ఫిలిప్స్ రేడియో, దానిముందు అలారం గడియారం ప్రక్క చిన్న టర్నర్ స్క్రూ, శ్రావణమూ, ఇతర పనిముట్లూ వున్నాయి.

అలారం గడియారం 'టిక్, టిక్' మంటోంది.

గదిలోకి ఇన్‌స్పెక్టర్ కుమార్ వచ్చాడు.

"తంతు ముగిసింది. శవాన్ని మార్చ్యురీకి పంపుతాను" అన్నాడు కుమార్.

శిరీష్ మాట్లాడలేదు. అతడు నిశ్శబ్దంగా అలారం గడియారం వైపు చూస్తున్నాడు.

"అరె....అదేమిటి...గడియారం వెనక్కి నడుస్తోంది!" అరిచాడు ఇన్‌స్పెక్టర్ కుమార్.

"అవును" నేలమీదకు చూశాడు డిటెక్టివ్ శిరీష్.

గచ్చుమీద రక్తం ఆరిపోయి కనిపిస్తోంది.

"హంతకుడు వచ్చాడు. జనార్దనాన్ని బెదిరించాడు. జనార్దనం అప్పుడు....ఎస్....అతడికి బ్రాకెట్టు నంబరు



రాయడం సైడు బిజినెస్. వాచ్ రిపేరింగ్. తెలిసివుండాలి: జనార్దనం అలారం గడియారం బాగు చేస్తూన్నాడు...."

"బాగు చేస్తోంటే మటుకు గడియారం వెనక్కి నడవటం ఏమిటి?"

"ముందు గడియారాలమీద వ్రేలిముద్రలు తీయించు."

కుమార్ వ్రేలిముద్రల నిపుణుడని పిలిచాడు.

రెండు గడియారాలమీద వేరువేరు వేలిముద్రలు దొరికాయి. అలారం మీది వేలిముద్రలు మాత్రం హతుడివే.

"ఇప్పుడు అసలు సమయం ఉదయం ఆరూ నలభై అయింది. వెనక్కి నడుస్తోన్న గడియారంలో పన్నెండూ పది అయింది."

"వెనక్కి నడుస్తోన్న గడియారం ప్రసక్తి దేనికి?"

"జనార్దనం హంతకుడిని పట్టి యిచ్చే క్లూ ఈ అలారం గడియారంలో యిచ్చి వుంటాడు."

"అబ్సర్డ్! చావబోయే వ్యక్తి లేదా తనకి చావు ముంచు

కొస్తోన్న విషయం తెలిసిన వ్యక్తి పజిల్ చేస్తాడా?"

"అదే వావు తెలివి: జనార్దనం బ్రాకెట్ నంబర్స్ రాస్తాడు. అంకెలనూ, అంకెలు తెచ్చే ధనరాసులనూ వూహిస్తాడు. సరియైన హత్యాసమయం పసిగడితే హంతకుడు పట్టుబడవచ్చును. అదీ అతడి వూహేమో!"

"పోస్టుమార్టంలో హత్యాసమయం తెలుస్తుందికదా!"

"రిగర్ మార్టిస్ ప్రారంభమైంది. హత్యాసమయం ఖచ్చితంగా నిర్ణయంకాదు. రెండు సమయాల మధ్యకాలంగా సర్జన్ చెప్పగలుగుతారు. అంతే!"

"ఏ టైముమండి గడియారం వెనక్కి నడుస్తోందో ఎలా తెలుస్తుంది?"

శిరీష్ ఆలోచనలో పడ్డాడు.

పాథాలజీ సర్జన్ మెల్లగా దగ్గాడు.

"అసలు గడియారం వెనక్కి ఎలా నడుస్తోంది?" అన్నాడు సర్జన్.

డిటెక్టివ్ శిరీష్ అలారం గడియారాన్ని చేతిలోకి తీసుకున్నాడు. వెనక మూత విప్పాడు.

అలారం గడియారం టిక్, టిక్ మంటోంది. స్ప్రింగు చుట్టవైపూ, లీవర్ వైపూ చూశాడు శిరీష్. నుదురు చిట్లించాడు.

"దయల్‌కి వ్యతిరేకదశలో మిషన్‌ను బిగించాడు" అన్నాడు శిరీష్.

"అందుకే ముళ్ళు తిరగడానికీ,దయల్ మీద అవి చూపే సమయానికి విరుద్ధమైన సంబంధం వుంది!"

"నిన్నరాత్రి జనార్దనం వుంటోన్న వాటాలోకి ఎవరు వొచ్చారో తెలుసుకో. అర్ధరాత్రి పన్నెండు గంటల వరకూ...."

"అంత టైమువరకూ ఎందుకు?"

"అర్ధరాత్రి 12 గంటలకు హంతకుడికి ఎలిబీ వుంటుంది" శిరీష్ కదిలాడు.

4

బాబు మంచం దిగాడు. హాంగర్‌ను సమీపించాడు. షర్ట్‌తొడుక్కున్నాడు. జేబు తడుముకున్నాడు. బ్రాకెట్ నంబర్ కాగితం ముక్క దొరికింది.

విజిల్ వేశాడు.

రాత్రి ఓపెనింగ్‌లో అయిదు నెంబర్ వచ్చింది. క్లోజింగ్‌లోకూడా నాలుగు వచ్చివుంటే....

ఈపాటికి వచ్చే వుంటుంది. వస్తే తన రెండు రూపాయలు నూట అరవై రూపాయిలవుతాయి?

లేకపోయినా ఫరవాలేదు.

ఓపెనింగ్‌లో అయిదు వచ్చినందుకు ఎంతో కొంత ముడుతుంది.

తన అదృష్టం బాగుంది. మొట్టమొదటిసారే తాను బ్రాకెట్‌లో డబ్బు సంపాదించ గలిగాడు. క్లోజింగ్ కూడా వస్తే తనకి మరింత అదృష్టం!

బాబు చకచక కాలకృత్యాలు ముగించుకుని రోడ్డెక్కాడు.

నిన్నరాత్రి జనార్దనం బ్రాకెట్ నంబర్లు రాసిన సెంటర్‌కి వచ్చాడు.

జనార్దనం లేడు. ఏమయ్యాడు? ఇంకా రాలేదు. ఉదయం ఏడు గంటలకు యిక్కడికి వచ్చి కూర్చుంటానన్నాడు. పేమెంట్ యిస్తానన్నాడు. అయినప్పటికీ రాత్రి తాను జనార్దనం యిల్లు తెలుసుకున్నాడు. 9 గంటల తర్వాత అతడి యింటికి తానువెళ్ళాడు.

అప్పుడే ఓపెనింగ్ నంబర్ వచ్చింది.

ఆ విషయం తానే తెలుసుకున్నాడు. పూర్ణయ్య తనతో చెప్పాడు. తానుచెప్పిన విషయం విని జనార్దనం నవ్వాడు.

"కొత్త బిచ్చగాడికి పొద్దు తెలియదట!"

తానూ నవ్వాడు.

"నువ్వు యీ బిజనెస్‌కి యింకా కొత్త! రెండుమూడు వేలు పోగొట్టుకో! నలభై వేలు సంపాదించుకో!"

"అలాగే. తప్పకుండా!"

"వెళ్ళిపో. నేను గడియారాలు రిపేర్ చేయాలి!"

"మీరు ఆ పనికూడా చేస్తారా?"

అతడు తలూపి అలారం గడియారం అందుకున్నాడు. తాను తిరిగి వచ్చేశాడు.

బాబు సిటీబస్సెక్కి జనార్దనం యింటివైపు కదిలాడు.

జనార్దనం వుంటోన్న డాబాలోకి ప్రవేశించాడు. ఇండియాలో వున్నన్ని విభిన్నమైన రకాల కుటుంబాలు డాబాలో కాపురం వుంటున్నాయి.

అన్ని వాటాల మనుషులూ కలసి ఆ డాబాను విశాఖ పట్నంలో వుంటోన్న మురికి వాడలకు మరో నెంబర్ పెంచుతున్నారు.

బాబు ముక్కు మూసుకున్నాడు.

జనార్దనం వుండే వాటా తలుపు తట్టాడు.

తలుపులు తెరుచుకున్నాయి. పోలీసులు ప్రత్యక్ష మయారు.

ఇన్‌స్పెక్టర్ కుమార్ అతడిని ప్రశ్నార్థకంగా చూశాడు.

"జనార్దనం నీకు ఎలా తెలుసు?" అడిగాడు కుమార్.

బాబు బిక్క చచ్చిపోయాడు.

"జనార్దనం నాకు నిన్నటినుండే తెలుసు!" గొంతు పెగిల్చాడు.

"ఎలా తెలుసు?"

"నిన్ననే మొట్టమొదటిసారిగా బ్రాకెట్ నంబర్ రాయించాను."

కుమార్ లోపలకు చూశాడు. అతడి చూపులను అర్థం చేసుకుని పూర్ణయ్య బయటికి వచ్చాడు.

"పూర్ణయ్యా! రాత్రి వచ్చినట్టు చెప్పిన వ్యక్తి యితడేనా?" అడిగాడు కుమార్.

బాబువైపు చూచి పూర్ణయ్య తలూపాడు.

"రాత్రి నువు జనార్దనం యింటికి వచ్చావు. అవునా?" అడిగాడు కుమార్.

"వచ్చాను సార్!"

"ఎందుకు?"

"ఓపెనింగ్ నెంబర్ నేను రాయించుకున్నదే వచ్చింది సార్! ఆ విషయం చెప్పాలని...."

కుమార్ పళ్లు నూరాడు. చెయ్యి ఎత్తాడు.

"ఇలాంటి హరికథలు నా సర్వీసులో గంటకి నాలుగు వింటూంటాను...." చెయ్యి విసరబోయాడు.

డిటెక్టివ్ శిరీష్ ఆతడి చెయ్యి పట్టుకున్నాడు.

"పూర్ణయ్యా, నువ్వూ ఒకే నెంబర్ రాయించారు కదూ!" అడిగాడు శిరీష్.

"అవున్సార్! ఓపెనింగ్ నెంబర్ రాగానే నేను పూర్ణయ్యతో కలసి జనార్దనం యింటికి వచ్చాను. పూర్ణయ్య అక్కడే పడివుంటానన్నాడు. క్లోజింగ్ నెంబర్ కూడా వస్తేనే అతడి దరిద్రం తీరుతుందని చెప్పాడు. కాని ఏమనుకున్నాడో నా వెంట వచ్చాడు. అతడు కూడా యిక్కడే ఒకే వాటాలో వుంటోన్నట్టు చెప్పాడు."

శిరీష్ నుదురు చిట్లించాడు.

పూర్ణయ్యకి డబ్బు అవసరం. జనార్దనం ఇంట్లో డబ్బు లేదు. బట్టలపెట్టె, డ్రాయర్ సొరుగూ వెతికాడు హంతకుడు. వాటిమీద కూడా వేలిముద్రలు దొరికాయి. డబ్బు ఎత్తుకుని పారిపోయాడు.

పూర్ణయ్యే హంతకుడా? వెంటనే పూర్ణయ్యని, బాబుని వేలిముద్రలు తీసుకొని హత్యాస్థలంలో దొరికిన వేలిముద్రలతో పరిశీలించారు. అవి సరిపోలేదు.

హంతకుడు బయటివాడు కాదు! ఈ వాటాల్లో వుంటోన్న వ్యక్తులలో ఒకడు. అతడికి జనార్దనం అలవాట్లు బాగా తెలుసు. అతడు డబ్బు ఎక్కడ దాస్తాడో హంతకుడు కనిపెట్టాడు. ఎక్కువ కష్టపడకుండానే డబ్బు చేజిక్కించుకున్నాడు హంతకుడు.

జనార్దం బ్రహ్మచారి.

డిటెక్టివ్ శిరీష్ బుర్రలో తళుక్కుమన్నది.

జనార్దనం రాత్రి భోజనం చేశాడా? చేస్తే హోటల్‌కి వెళ్ళివస్తాడా! ఇంట్లో వంటసామగ్రి లేదు.

"జనార్దనం భోజనం ఎక్కడ చేస్తాడు?"

"ఇక్కడే ఒకవాటాలో సూర్యనారాయణ వుంటున్నాడు. అతడికి నెలకి యింత అని యిచ్చి భోజనం చేస్తాడు."

"అతడికి కుటుంబం వుందా?"

"భార్యా, నలుగురు పిల్లలూ...."

"సూర్యనారాయణ వయసు ఎంత వుంటుంది."

"యాభై వుంటుంది?"

"బాబూ! నువ్వు యెన్ని గంటలకు జనార్దనం ఇంటికి వచ్చావు?"

బాబు గుర్తుకు తెచ్చుకున్నాడు.

"రేడియోలో 'స్పాట్ లైట్' కార్యక్రమం వస్తోంది సార్! అంటే తొమ్మిదింపావు దాటాక!"

తొమ్మిదింపావు వరకూ జనార్దనం బతికివున్నాడు!

శిరీష్ నిట్టూర్చారు.

శవం అంబులెన్స్‌కి వెళ్ళింది. పోస్ట్‌మార్టం రిపోర్ట్ రావాలి! అంతవరకూ కేసుకు తలాతోకా వుండదు.

"కుమార్! నువ్వు సూర్యనారాయణను విచారించు" శిరీష్ లోపలి గదిలోకి కదిలాడు.

5

మార్చ్యురీ ముందు డాట్సన్ కారు ఆగింది.

ఇన్‌స్పెక్టర్ కుమార్, శిరీష్ కారు దిగాడు. మార్చ్యులోకి నడిచారు.

పాథాలజీ సర్జన్ ఎదురు వచ్చాడు.

ముగ్గురూ ఆఫీస్ రూంలో కూర్చున్నారు.

"జనార్దనం రాత్రి తొమ్మిదికీ పదికీ మధ్య మరణించాడు. తలమీద బరువైన వస్తువుతో కొట్టడంవలన మరణించాడు. దెబ్బ అతడి చిన్నమెదడు మీద పడింది!" అన్నాడు పాథాలజీ సర్జన్.

"అంటే దెబ్బతిన్న వెంటనే జనార్దనం ముందు గదిలోకి వచ్చిపడే అవకాశం వుంటుందా?" అడిగాడు డిటెక్టివ్ శిరీష్.

"దెబ్బతిన్న వెంటనే మరణం సంభవించి వుండాలి. ఆ స్థితిలో హతుడు ముందుగదిలోకి రావడం అసాధ్యం."

"హతుడి జీర్ణాశయంలో...."

"జీర్ణం కాని అన్నం వుంది!"

ఇన్‌స్పెక్టర్ కుమార్ కుర్చీలో వెనక్కి వాలాడు. "అన్నం తిని చనిపోయినవాడి కడుపులో అన్నమే వుంటుంది!"

"సూర్యనారాయణ ఆ విషయం నిర్ధారణ చేశాడు కదా!" అడిగాడు శిరీష్.

"అవును. జనార్దనం అతడి వాటాకి వెళ్ళి భోజనం చేశాడట!"

"సూర్యనారాయణ ఏం చేస్తాడు?"

"నైట్ వాచ్‌మాన్. జనార్ధనం భోజనం తొమ్మిది గంటలకు చేశాడు. అతడు భోంచేస్తోండగానే సూర్యనారాయణ నైట్‌డ్యూటీకి వెళ్ళిపోయాడట."

"అతడి డ్యూటీ ఎన్ని గంటలకు?"

"రాత్రి పది గంటలనుండి ఉదయం ఆరు గంటల వరకు!"

"హత్య తొమ్మిది పది గంటల మధ్య జరిగింది. హంతకుడికి అర్ధరాత్రి 12 గంటలకు ఎలిబీ వుంటుంది. ఏమిటా ఎలిబీ?"

"వెనక్కి నడుస్తున్న గడియారం ఎన్నిగంటల నుండి తిరుగుతోందో ఎలా తెలుస్తుంది?"

"లెక్క వేశాను. అసలు సమయం ఆరూ నలభై అయినప్పుడు గడియారంలో వెనక్కి తిరిగిన టయిం పన్నెండూ పది. అంటే అర్ధరాత్రి రాటితే 12-10 ని॥ వెనక్కి తిరుగుతోన్న టయిమ్ ముందుకు తిరుగుతోన్న టయిమ్‌తో పోలిస్తే రెట్టింపు వేగంతో పోతోంది."

"ఎలా?"

"ముందుకు తిరగవలసిన ఒక నిముషమూ, వెనక్కి

తిరుగుతోన్న ఒక నిముషమూ కలసి రెండు నిముషాలవు తుంది. అంటే ఒక నిముషం తేడా కనిపెట్టాలంటే మనం రెండేసి నిమిషాల వంతున తీసెయ్యాలి."

"గందరగోళం లెక్క!"

"జనార్దనం చేతిలో గడియారం వెనక్కి నడిచిన టైం 9 గం. 25 ని. రాత్రి."

కుమార్ తల విదిలించాడు. "ఆ సమయానికే అతడు మరణించడం ఎలా సాధ్యం? బాబు అతడితో మాట్లాడు తోన్నాడు."

"స్పాట్‌లైట్ కార్యక్రమం రాత్రి 9.15 కి ప్రారంభ మవుతుంది. 9.20 వరకూ బాబు మాట్లాడి వుండవచ్చు."

"ఆగాగు. నాకు దృశ్యం అర్థమవుతోంది. 9.20 కి బాబు అతడిని వొదిలిపెట్టాడు. హంతకుడు అతడి గదిలో అడుగుపెట్టాడు. జనార్దనం రాబోయే ప్రమాదం వూహిం చాడు. తన చేతిలోని అలారం గడియారాన్ని సూచనగా మార్చివుంచాడు. హంతకుడు అతడిని కొట్టాడు. ఆయువు పట్టుమీద తగిలింది."

"రైట్! పద - సూర్యనారాయణను కలుసుకుందాం!"

"నేను ఒక్కడినే వెళ్తాను!" శిరీష్ లేచాడు. "నువు అతడి గతం వెతుకు!"

6

"సూర్యనారాయణా!" పిలిచాడు శిరీష్.

సూర్యనారాయణ తలెత్తి చూశాడు. అతడి కడుపులో అల్సర్లు వున్నట్టు మొహంలో మత్తు చూపిస్తున్నాడు సూర్యనారాయణ.

"మొన్న అర్ధరాత్రి 12 గంటలకు నువు ఎక్కడ

వున్నావు?" అడిగాడు శిరీష్.

"12 గంటలకు మా సూపర్నెంటు వాచ్‌మాన్‌ల మస్తర్ వేసుకుంటోంటే అక్కడే వున్నాను" అన్నాడు సూర్యనారాయణ.

ఎలిబీ అదే!

"ఆ రోజు డ్యూటీకి నువు ఆటోలో వచ్చావు."

"ఆలస్యం జరిగితే అంతే!"

"ఎక్కడ జరిగింది?"

"దారిలో"

"అబద్ధం. ఆ రోజు నువు రాత్రి తొమ్మిది కాకుండానే బయటపడ్డావు. తొమ్మిదీ పదికి మీ యింటినుండి ఉద్యోగ స్థలానికి సిటీబస్సు వుంది. నువు ఆ బస్సు మిస్సయావు. నీకు ఆ బస్సులో నైట్ సీజన్ పాస్ వుంది."

సూర్యనారాయణ తల వొంచుకున్నాడు.

"జనార్దనాన్ని ఎందుకు చంపావు? హత్యా స్థలంలో మూడు చోట్ల నీ వేలిముద్రలు దొరికాయి!"

సూర్యనారాయణ నిట్టూర్చాడు. "గతంలో నాకు పది వేల రూపాయలు అప్పుయిచ్చాడు. నేను తీర్చలేకపోయాను. పెద్ద అమ్మాయి పెళ్ళి చేయాలనుకున్నాను. డబ్బు ఖర్చయిపోయింది...." సూర్యనారాయణ పళ్ళు నూరాడు. "జనార్దనం మా పెద్ద అమ్మాయిని నా అసమర్థతకి....అతడు కోరరాని కోరిక కోరాడు. రోజూ సతాయించడం మొదలు పెట్టాడు....అందుకే ఆ రాత్రి....వాడిని....నా చేతి కర్రతో ఒకే దెబ్బ...." వణుకుతోన్నాడు.

శిరీష్ అతడిని భుజం తట్టాడు సానుభూతిగా. □

పావురాలే నిక్షు

ఎమ్. సత్యవతి



సైంటిస్ట్ పరాంజపే చకచక నాడుచుకుంటూ లేబొరేటరీకి వచ్చాడు. లావణ్య తండ్రివంక పరిశీలనగా చూచింది.

తండ్రికి అరవై సంవత్సరాలు వస్తున్నాయి. ఆలోచనల తాకిడికి జుత్తు పండి రాలిపోయింది. తీక్షణమైన ఆయన కళ్ళు కళ్ళజోడు వెనక మరింత గాంభీర్యం పులుము

కున్నాయి. లేబొరేటరీ దాటి ఏ పాతిక సంవత్సరాలో కావడం వలన శరీరం సీడపట్టున వుండి దబ్బపండు ఛాయకు తిరిగింది.

"ఏమిటమ్మా! అలా చూస్తున్నావూ!" అడిగాడు పరాంజపే.

లావణ్య చూపు త్రిప్పుకున్నది.

"డాడీ! మీకు ఈ వయసులో కూడా యింకా శ్రమ తప్పలేదు" అంది లావణ్య, రిటార్ట్ స్టాండ్ వైపు కదులుతూ.

పరాంజపే స్టాండ్ కి బిగించివున్న గాజు కుప్పెలోని ద్రవాన్ని గమనించసాగాడు. ద్రవం బుసలుకొడుతోంది.

"నా ప్రయోగం ఒక కొలిక్కి వచ్చింది తల్లీ! భారత ప్రభుత్వం నామీద వుంచిన భారం మరోవారం రోజులకు భుజాలు దించుకోవచ్చును!"

లావణ్య తృప్తిగా నవ్వింది.

తన తండ్రిమీద భారత ప్రభుత్వతం గొప్ప బాధ్యత వుంచింది. తన తండ్రి రసాయనశాస్త్రంలో అందెవేసిన చెయ్యి.

యుద్ధసమయంలో శత్రువుల మీద ప్రయోగించడానికి విషవాయువు తయారుచేయాలని భారత ప్రభుత్వం ఆదేశించింది. విషవాయువుతోబాటు తన తండ్రి దానికి విరుగుడు వాయువు కనిపెట్టాడు. శత్రువు విషవాయువును పీల్చేటప్పుడు మన సైనికులు విరుగుడు వాయువును పీల్చుతారు. శత్రువులు ప్రమాదంలో పడతారు. మనవాళ్ళు క్షేమంగా వుంటారు.

ప్రయోగాలు పూర్తి కావచ్చాయి.

త్వరలో భారత ప్రభుత్వానికి ఫార్ములా యిస్తాడు డాడీ.

లావణ్య బయటకు చూచింది.

లాబొరేటరీ చుట్టూ సెక్యూరిటీ గార్డ్స్ నిలబడివున్నారు. తన తండ్రి చేస్తోన్న ప్రయోగం విషయం భారత ప్రభుత్వం రహస్యంగా వుంచినప్పటికీ శత్రుదేశాలకు తెలిసిపోయింది.

అందుకే ప్రభుత్వం తమకు రక్షణ ఏర్పాట్లు చేసింది.

"త్వరగా కానివ్వు తల్లీ! ఫార్ములా టైప్‌చేద్దాం!" పరాంజపే సమాధానం కోసం ఎదురుచూడకుండా ప్రక్క గదిలోకి నడిచాడు.

తల వొంచి రాసుకుంటోన్న రాఘవ్ తండ్రివైపు తల త్రిప్పాడు.

"మెటీరియల్ ఈ రోజు వొస్తుందా?" అడిగాడు పరాంజపే.

"వస్తుంది డాడీ!" అన్నాడు రాఘవ్.

అరగంట తర్వాత లావణ్య ఫార్ములాను టైప్‌చేస్తోంది. టైపింగ్ పూర్తయేసరికి రాత్రి తొమ్మిదయింది.

పరాంజపే సైంటిఫిక్ ఎనాలిసిస్ కోసం లాబొరేటరీలో ఆగిపోయాడు.

రాఘవ్ కారు బయటికి తీశాడు. లావణ్య ఎక్కి కూర్చుంది.

కారు బయలుదేరింది.

"అన్నయ్యా! ఏదైనా బార్‌కి వెళ్దాం!" అంది లావణ్య.

"లావణ్యా! నిజమా!".

"అవునన్నయ్యా! మనసుమీద విపరీతమైన వొత్తిడిగా వుంది. కాస్త హాట్ డ్రింక్ ఏదైనా...."

కారులో ఎవరో పకపక నవ్వినట్టయింది.

రాఘవ్, లావణ్యా వులిక్కిపడ్డారు. వెనక్కి తలలు తిప్పారు.

వెనకసీట్లో మధ్యగా ఎవరో కూర్చున్నారు. లావుగా పొట్టిగా, బలిసిన జీడిపిక్కలాగా వున్నాడు. నున్నగా గొరిగిన గుండూ, బుర్రమీసాలూ, బుగ్గన గాటూ....

"అచ్చగా సినిమా విలన్‌లాగా వున్నాను కదా!" అతడు నవ్వాడు. అతడి నవ్వు హృద్యంగా లేదు. డబ్బాలో గీత గీచినట్టుగా వుంది.

"విలన్‌లాగానే వున్నావు కానీ నీపేరు ఏమిటి?" అడిగాడు రాఘవ్, కారు ఆపి.

"ఫరవాలేదు. నువు ధైర్యవంతుడివే!" అతడు మెచ్చుకోలుగా చూశాడు.

"ఏయ్, నువ్వెవరు? మా కారులోకి ఎలా వచ్చావు?" అరచింది లావణ్య.

"ఎందుకు వచ్చానోకూడా అడుగు పిల్లా?"

"అవును....ఎందుకు వచ్చావు?"

"ఇద్దరూ జాగ్రత్తగా వినండి. సెక్యూరిటీ గార్డ్సులో ఒకడు మావాడు!" అతడు చటుక్కున రెండు చేతులలోకి రెండు పిస్తోళ్ళు తెచ్చుకున్నాడు. "మిమ్మల్ని నా స్థావరానికి తీసుకుపోతాను. పువ్వులలో పెట్టి చూస్తాను?" ఆగాడు అతడు.

రాఘవ్ నుదురు చిట్లించాడు.

"నీది ఈ రాష్ట్రం కాదు! అవునా?"

"అవును నా పేరు గబ్బర్‌సింగ్."

"తెలుగు నేర్చుకున్నావా?"

"అవును - కష్టపడ్డాను. ఫార్ములా కోసం."

అన్నాచెల్లెళ్ళు ఒక్కసారిగా వులిక్కిపడ్డారు.

"నువు మాట్లాడేది నిజమేనా?"

గబ్బర్‌సింగ్ పకపక నవ్వాడు. చటుక్కున రెండు

పిస్తోళ్ళు ప్రేల్చాడు.

కారులో తియ్యటి వాసన!

రాఘవ్, లావణ్య తలలు వాల్చారు. సీట్లోకి జారి పోయారు.

2

సైంటిస్టు పరాంజపే చిరాకుగా అటూ యిటూ తిరగ సాగాడు. లాబరేటరీలో ఆ గదిలోంచి ఈ గదిలోకి పచార్లు చేశాడు. రాఘవ్, లావణ్య మాయమై 12 గంటలయింది. రాత్రి 9 గంటలకు కారులో ఇద్దరూ కనిపించారు. అదే చివరిసారి!

పరాంజపే తల విదిలించాడు.

తన బిడ్డలిద్దరూ శత్రువుల చేతుల్లో పడ్డారా?

తన ఫార్ములా కోసం వాళ్ళిద్దరూ ఆహుతి కానున్నారా?

పరాంజపే విసుగ్గా బయటకు చూశాడు. ఎటు చూచినా రక్షణ సిబ్బంది! ఏం లాభం? తన పిల్లలను యిద్దరినీ రక్షించలేకపోయారు. ఎంతమంది వుంటే ఏం ప్రయోజనం.

టెలిఫోన్ గణగణలాడింది.

పరాంజపే ఆలోచనలు తెగాయి.

చటుక్కున టెలిఫోన్ రిసీవర్ అందుకున్నాడు.

"పరాంజపే!"

"ఎవరు నువ్?"

"గబ్బర్‌సింగ్!"

"అంటే...." పరాంజపే బయటకు చూశాడు.

"నీ రాఘవ్‌నూ లావణ్యనూ ఎత్తుకుపోయినవాడిని."

"ఎందుకు ఎత్తుకుపోయావు?"

"నువ్వు కనిపెట్టిన ఫార్ములా నాకు యిచ్చెయ్యి!"

"నాన్సెన్స్! పది సంవత్సరాల శ్రమ...."

"నీ బిడ్డలకంటె ఎక్కువ కాదు!"

పరాంజపేవైపు సెక్యూరిటీ గార్డ్ వచ్చాడు. పరాంజపే అతడికి రిసీవర్‌ను చూపించి సైగచేశాడు.

సెక్యూరిటీ గార్డ్ బయటకు నడిచాడు.

"ఫార్ములా యివ్వకపోతే...."

"ఇచ్చి తీరతావు!"

"ఏం?"

"నీ బిడ్డలలో ఒకరి తల నీకు అందుతుంది కనక!"

పరాంజపేకు గుండెల్లో కలుక్కుమంది.

"కాని భారత ప్రభుత్వం కళ్ళలో దుమ్ము కొట్టలేవు."

"నువు మాటలు పెంచుతున్నావు. టెలిఫోన్ ఎక్కడి నుండి చేస్తున్నానో పట్టుకోవాలనా...."

"ఛ....ఛ...."

అవతల క్లిక్‌మన్నది.

పరాంజపే నిట్టూర్చాడు. అతడు దొరకడు.

3

రాఘవ్ చెవులు ఓరగా పెట్టి విన్నాడు. బయట నడవాలో ఎవరో నడుస్తోన్న చప్పుడవుతోంది.

"లావణ్యా!" పిలిచాడు రాఘవ్.

లావణ్య తల దువ్వుకుంటోన్నదల్లా తల త్రిప్పి చూచింది.

"గబ్బర్‌సింగ్ వస్తున్నాడు."

"రానివ్వు."

"మన యిద్దరిలో ఒకరిని చంపుతాడట!"

లావణ్య చేతిలోని దువ్వెన జారిపడింది.

"ఏమో...."

తలుపు చటుక్కున తెరచుకుంది.

గుమ్మంలో నిలబడినవాడిని తేరిపార చూశాడు రాఘవ్. అతడు గబ్బర్‌సింగ్ కాదు. అతడి అసిస్టెంట్ సాంబం. చిన్నగడ్డం పల్చని మొహంమీద అంటించినట్టుగా వుంది. సన్నగా పొడవుగా వున్నాడు. జేగురు రంగు కళ్ళు.

"ఏం పిల్లా! బాగున్నావా?" అడిగాడు సాంబం.

లావణ్య కొరకొరా చూచింది.

రాఘవ్ విసురుగా అతడివైపు వెళ్ళాడు.

"చెంప పగులుతుందొరే సాంబా! నోటికొచ్చినట్టల్లా వాగక!"

సాంబం గడ్డం దువ్వుకున్నాడు.

"షోలే వాహనంలో మీలో ఒకరిని తీసుకువెళ్తాను." పకపకలాడాడు సాంబం.

"షోలే వాహనమా! ఎందుకు?" అడిగాడు రాఘవ.

"షోలేలో వెళ్ళినవారు బతికిరారు. అడవిలో తల నరుకుతాం!"

అతడిమీదకు దూకబోయేవాడల్లా రాఘవ్ ఆగాడు.

నడవాలో గబ్బర్‌సింగ్ నడచివస్తున్నాడు.

[illegible]

సాంబం దవడ పెళపెళలాడింది.

సాంబం కోరగా చూశాడు.

"రాస్కెల్! వాళ్ళు సైంటిస్ట్ పరాంజపే పిల్లలు! చంపితే ఒకేసారి చంపుతాను. చంపే హక్కు నాకే వుంది" అరిచాడు గబ్బర్‌సింగ్.

"సారీ బాస్!" సాంబం బయట నిలబడ్డాడు.

గబ్బర్‌సింగ్ లోపలకు వచ్చి తలుపులు మూశాడు.

గదిలోకి తేరిపార చూశాడు.

"రాఘవ్! నేను యింతవరకూ మీ యిద్దరిపట్లా మర్యాదగానే ప్రవర్తించాను. మీ డాడి కనిపెట్టిన ఫార్ములా నా చేతిలో పడగానే మిమ్మల్ని భద్రంగా యింటికి చేరుస్తాను."

గబ్బర్‌సింగ్ సోఫాలో చతికిలబడ్డాడు.

రాఘవ్ ఎదుటి సోఫాలో కూర్చున్నాడు.

"నువ్వు నాకు ఏర్పాటు చేసిన సౌకర్యాలకు కృతజ్ఞతలు. ఆహారం కూడా చాల రుచికరంగా వుంటుంది. గదిలోంచి బయటకు వెళ్ళే స్వేచ్ఛ తప్పించి అన్ని ఏర్పాట్లూ

చేశావు. కాలక్షేపానికి కారమ్‌బోర్డ్ కూడా యిచ్చావు. కాని నువ్వు ఫార్ములాతీసుకుని భారతప్రభుత్వం కళ్ళు కప్పలేవు."

"రాఘవ్! నాకు నువ్వు ఉపదేశించక! మీ నాన్నకు పుత్తరం రాశాను!" గబ్బర్‌సింగ్ పళ్ళు పటపట కొరికాడు. "మీరు ఇక్కడినుండి ప్రాణాలతో తప్పించుకోవడం కల్ల. బయట నా అనుచరులు నిత్యమూ ఆయుధాలతో పహరాకాస్తారు" గబ్బర్‌సింగ్ చెయ్యి చాపాడు. అతడి చేతిలో ఎర్రటి కాగితం వుంది.

కాగితం మీద నల్లటి అక్షరాలు!

రాఘవ్ తల పంకించి కాగితం తీసుకున్నాడు.

లావణ్య యిద్దరినీ పరిశీలించి చూస్తోంది.

రాఘవ్ పైకి చదవసాగాడు.

"పరాంజపే!

నన్ను పట్టుకోవడం నీ తరంకాదు. నువ్వు కనిపెట్టిన ఫార్ములాను మైక్రోఫిల్మ్ తీయి. 11వ తేదీ అంటే రేపు సాయంకాలం 4 గంటలకు నాలుగు పావురాలు నీ లేబొరేటరీకి వస్తాయి. నాలుగు కాపీలు (ఫిల్మ్) వాటికాళ్ళకు కొట్టు. సాయంత్రం అయిదున్నరకి వాటిని విడిచిపెట్టు. వాటిని ఫాలో కావాలనిగానీ, భారతప్రభుత్వానికి తెలియపరచాలనిగానీ, నకిలీ ఫిల్ములు పంపించాలనిగానీ ప్రయత్నించక. నాకు నీ విషయం ఎప్పటికప్పుడు తెలుస్తుంది. 11వ తేదీరాత్రి నీ ఫార్ములాను పరీక్షించి 12 ఉదయం నీ పిల్లలను సజీవంగాగానీ నిర్జీవంగాగానీ పంపించగలను.

నీ శ్రేయోభిలాషివంటి

గబ్బర్‌సింగ్.

రాఘవ్ పళ్ళు నూరుకున్నాడు.

"పావురాలను వెంటాడితే నీ స్థావరం తెలుస్తుంది" అంది లావణ్య.

"అదీ ప్రమాదమే! ఫార్ములాను అందుకుని కూడా మీ ప్రాణాలు ఎదురువేసి మేము తప్పించుకుంటాం!"

రాఘవ లావణ్యా మొహాలు చూచుకున్నారు.

"పావురాలను వెంటాడటం అసాధ్యం. పక్షులు గూళ్ళకు తిరిగివచ్చే వేళ! నాలుగు పావురాల్లో ఏదో ఒక పావురం నా స్థావరానికి రాగలుగుతుంది. కాబట్టి మీ ప్రాణాలకు మోసంలేదు."

"గబ్బర్! షోలే వాహనం నీదేనా?" అడిగాడు రాఘవ్.

"అవును. ఆ వాహనంలో ప్రయాణించాలని కలలు గంటున్నావా" పకపక నవ్వాడు గబ్బర్‌సింగ్.

"నీ మాట పాటించమని మా డాడీకి రాస్తాను!" అంది లావణ్య.

"ఏదైనా కోడ్ మాటలా రాశావంటే నీ చర్మం వొలుస్తాను!"

"అలాగే!"

లావణ్యకు కాగితం కలం అందించాడు గబ్బర్‌సింగ్.

లావణ్య చకచక తెలుగులో వుత్తరం రాసింది.

"డాడీ,

గబ్బర్‌సింగ్ దయామయుడు. ఆయన చెప్పినట్టు నాలుగు పావురాలకు జాగ్రత్తగా ఫిల్ములు కట్టి పంపించు. నా ఫ్రెండ్ సరళ నాకు కుక్కపిల్లను యిస్తానంది. యిచ్చిందా? మనకి పావురాలే దిక్కు! వాటిని వెంటాడవద్దు. మా ప్రాణాలు కాపాడేదిక్కు

పావురాలే! మనం తిరిగి కలుసుకుంటాం.

ఎప్పటికీ నీ

లావణ్య."

గబ్బర్‌సింగ్ వుత్తరం చదివి పడిపడి నవ్వుకున్నాడు.

"పావురాలే దిక్కు! అహ్హాహ్హా....అరె ఓ సాంబా!" అరవసాగాడు.

లావణ్య మొహం సిగ్గుతో ఎర్రబడింది.

"నేను కూడా మా డాడీకి రాస్తాను. ఆ వుత్తరం వెనకనే!" అన్నాడు రాఘవ్.

"శభాష్! గాంధీగారి అహింసావాదంలో నాకు నమ్మకం కలుగుతోంది. మిమ్మల్ని బాధపెట్టకుండానే దారికి తెచ్చుకున్నాను!"

రాఘవ్ ఉత్తరం రాయసాగాడు.

"డాడీ!

హిందీ భాషా వుద్యమంలో జ్వాలగా రేకెత్తిన గందరగోళంలో పోయిన ప్రాణాలను గుర్తుకు తెచ్చుకో! మమ్మల్ని ఆ జ్వాలలో ఒక కీలగా మార్చక! పావురాలే దిక్కుగా మా ప్రాణాలు కాపాడు. శ్రీ గబ్బర్‌ను పట్టుకోవాలని ప్రయత్నించక. వేరేవేరే దిక్కులులేవు.

మమ్మల్ని ప్రాణాలతో చూడాలని కోరుకుంటూ ఘని ఆశిస్తూ

నీ రాఘవ్."

గబ్బర్‌సింగ్ పకపక నవ్వాడు.

"ఒరే బచ్చా! నీకు మతిచలించిందిరా! హిందీ వుద్యమం విషయం యిప్పుడెందుకురా బాబూ!" గబ్బర్

సింగ్ తన ఉత్తరంతోబాటు ఆ వుత్తరాన్ని కూడా మడిచి కవర్‌లో పెట్టాడు.

"ఇద్దరూ కారమ్స్ ఆడండి! వెర్రిమొర్రి ప్రయత్నాలు చేయకండి! మరో 30 గంటలలో మీ డాడీ దగ్గర వుండ గలరు!" గబ్బర్‌సింగ్ బయటకు నడిచాడు. తలుపు దగ్గరగా లాగి బయట తాళంవేశాడు.

రాఘవ్ చప్పున లోపల బోల్ట్ పెట్టాడు.

బాత్‌రూంలోకి నడిచాడు. గోడకివున్న అద్దంలోకి చూసుకున్నాడు. రెండురోజులకి గడ్డం మాసివుంది.

'మరో ఇరవై నాలుగ్గంటలు!' గొణుక్కున్నాడు.

చకచక బయటకు వచ్చాడు. కారంబోర్డ్‌ను ఎత్తాడు. దాన్ని మోసుకుంటూ బాత్‌రూంలోకి నడిచాడు.

బాత్‌రూం తలుపు మూశాడు.

లావణ్య అతడినే విచిత్రంగా గమనిస్తోంది.

కారంబోర్డ్‌తో గోడకివున్న అద్దాన్ని పగలగొట్టాడు. అద్దంపెంకులు బళబళ క్రిందరాలాయి.

బోర్డునూ అద్దంముక్కలనూ తీసుకుని గదిలోకి వచ్చాడు.

"లావణ్యా!" అన్నాడు రాఘవ్.

కారంబోర్డును యథాస్థానంలో అమర్చాడు. పగిలిన అద్దం పెంకులతో మంచంవైపు నడిచాడు.

"నువ్వు కారంమ్స్ ఆడు. అటూ యిటూ కూడా నువ్వే ఆడు!"

రాఘవ్ సమాధానం కోసం యెదురుచూడకుండా మంచంమీది దుప్పట్లు ప్రోగుపెట్టాడు.

లావణ్య కారంబోర్డుమీద కాయిన్స్ పేర్చింది.

అన్నను గమనిస్తోనే స్ట్రైయికింగ్ చేసింది.

రాఘవ్ అద్దంముక్కల సహాయంతో దుప్పట్లను చీలి

కలు చేస్తున్నాడు. పొడవుపాటి పీలికలు!

నాలుగు దుప్పట్లనూ కలిపి మొత్తం అరవై పీలికలు చేశాడు. పీలికలు కలిపి ఒకదానితో ఒకటి ముడివేశాడు. రెండు త్రాళ్ళు సుమారు ముప్ఫయ్యారేసి అడుగులవి తయారయాయి. వాటిచివర ఒక్కో వురి ముడివేశాడు.

రాత్రి తొమ్మిదయింది.

లావణ్య బద్ధకంగా వళ్ళు విరచుకుంది.

"ఆడి ఆడి వ్రేళ్లు నొప్పులు పుడుతున్నాయి." అంది లావణ్య.

రాఘవ్ త్రాళ్లు మొత్తం పరుపుక్రింద దాచాడు.

అతడి చేతులు ఎర్రగా కంది రక్తం పొంగాయి.

రాఘవ్ బలవంతంగా నవ్వాడు.

గది బయట అడుగుల చప్పుడయింది. రాఘవ్ తలుపుల బోల్ట్‌తీసి చప్పున కారమ్స్ దగ్గర కూర్చున్నాడు. చేతులమీద చాక్‌పౌడర్ చల్లుకున్నాడు.

స్ట్రయికర్‌తో కాయిన్స్‌ను కొట్టాడు.

లావణ్య చప్పట్లు కొట్టింది. వైట్స్ తీసి పాకెట్స్‌లో వేసింది. రెండు బ్లాక్స్ బోర్డ్‌మీద వున్నాయి.

"ఈ గేం నాదే! మొత్తం మూడు గేమ్స్‌నించి!" అరిచింది లావణ్య.

"రైట్....లావణ్యా....బాగా ఆడావు!" రాఘవ్ మాట పూర్తిగాకుండానే తలుపు తెరచుకుంది.

గబ్బర్‌సింగ్, సాంబం తలుపుల బయట నిలబడ్డారు.

సాంబం చేతిలో పెద్ద ట్రే వుంది.

దానినిండా నోరూరించే తినుబండారాలు!

"గుడ్! మీ యిద్దరూ బుద్ధిమంతులు!" గబ్బర్‌సింగ్ సైగచేశాడు.

సాంబం ట్రేను కారమ్స్ ప్రక్కగా పెట్టాడు.

"గుడ్‌నైట్!" ఇద్దరూ ఎయిర్ ఇండియా మహారాజుల్లాగా వొంగి సలాంచేశాడు.

వాళ్ళవెనుక తలుపు మూసుకుంది.

రాఘవ్ తలుపులకు బోల్ట్‌పెట్టాడు.

"లావణ్యా!" గుసగుసలాడాడు రాఘవ్. "ఈ భవనంలో గబ్బర్‌తో బాటు సాంబం తప్పితే యెవ్వడూ లేడు."

"అవును. ఏదో శత్రుదేశానికి ఈ ఫార్ములాను అమ్మి డబ్బు చేసుకుంటారు. అందుకే ఎక్కువమంది పార్టనర్స్ లేరు."

ఇద్దరూ ట్రే ఖాళీచేశారు.

రాఘవ్ పరుపు క్రిందనుండి త్రాళ్ళు తీశాడు.

రెండు పురిత్రాళ్ళు.

"లావణ్యా? నేను దూరంలో నిలబడతాను. ఈ పురి నా మెడకు పడేలాగా విసురు!" అన్నాడు రాఘవ్.

లావణ్య త్రాడు అందుకున్నది.

4

డిశంబర్ 11

సాయంకాలం నాలుగు గంటలు అయింది.

పరాంజపే నడవాలో పచార్లు చేయసాగాడు.

గబ్బర్‌సింగ్ పెట్టిన గడువు దగ్గరపడింది. తన వద్దకు నాలుగు పావురాలు రావాలి.

ఆశ్చర్యం! మనుషులకు బదులు గబ్బర్ పావురాలను వాడుకుంటున్నాడు. వాటిని బంధించి లాభంలేదు.

తన పిల్లలు రాఘవ్, లావణ్యా కూడా తనకి ఉత్తరాలు రాశారు. తాను ఎలా మసలుకోవాలో వళ్ళు చాలా జాగ్ర



త్తగా రాశారు.

అద్భుతం!

అచ్చగా వాళ్ళు రాసినట్టు జరుగుతోందా?

తాను తనపిల్లలను తిరిగి ప్రాణాలతో చూడగలుగుతాడా?

అన్నింటికంటె ముఖ్యం! తన ప్రాణంలో ప్రాణం ఫార్ములా శత్రుదేశాల చేతుల్లో పడకుండా తాను జాగ్రత్త పడగలడా? తనకీ తన పిల్లలకూ స్వయంకృషి మీద నమ్మకం వుంది. ఏ అతీతశక్తీ తమ ప్రాణాలకు అడ్డం పడదు! అడ్డంపడేది వుంటే వాళ్ళను ఎత్తుకుపోకుండా గబ్బర్‌ను అటకాయించేది!

పరాంజపే నవ్వుకున్నాడు.

విపరీత పరిస్థితిలో తను ఠఃపాత నిగ్రహం పాటించ గలిగాడు.

పరాంజపే కళ్ళు మెరిశాయి.

తన లాబొరేటరీ చుట్టూవున్న సెక్యూరిటీ గార్డ్స ఆకాశంలోకే చూస్తున్నారు.

వాళ్ళలో ఒకడు శత్రుమూకకి చెందినవాడు.

ఎవరో ఎలా తెలుస్తుంది?

వాళ్ళచూపులు ఆకాశంలో ఎగిరివస్తున్న పావురాలమీద వున్నాయి.

మొత్తం నాలుగు పావురాలు!

అవి లాబొరేటరీ నడవాలో వ్రాలాయి.

పరాంజపే వాటిని సమీపించాడు. లోపలకు నడిచాడు. అవి అతడి వెనుక ఎగురుతూ లాబొరేటరీలోకి వెళ్ళాయి.

పరాంజపే, గబ్బర్‌సింగ్‌ను మనసులోనే మెచ్చుకున్నాడు.

పావురాలు అచ్చుగా మనుషులలాగానే ప్రవర్తిస్తోన్నాయి.

నాలుగు పావురాలను పట్టుకున్నాడు పరాంజపే.

అవి విచిత్రంగా చూస్తోన్నాయి.

5

అదేరోజు సాయంకాలం.

ఆరున్నర గంటలవుతోంది.

గబ్బర్‌సింగ్ తన భవనం మేడమీద నిలబడ్డాడు. అతడి ప్రక్క వైర్‌లెస్ సెట్టువుంది. అతడు ఆకాశంలోకే చూస్తోన్నాడు.

సాంబం పిట్టగోడకి ఆనుకుని కూర్చున్నాడు. అతడు గబ్బర్‌సింగ్‌నే పరీక్షగా చూస్తోన్నాడు.

ఆరూ ముప్ఫయిరెండు అవుతోంది. వైర్‌లెస్ సెట్టులోంచి బీప్‌బీప్ మనే శబ్దం వచ్చింది.

ట్యూనింగ్ సరిదిద్ది గబ్బర్ వినసాగాడు.

"సార్!నాలుగు పావురాలు ఆకాశంలో బయలుదేరాయి. వాటి కాళ్ళకు మైక్రోఫిల్ములు కట్టాడు పరాంజపే....ప్లాన్ సక్సెస్...."

వైర్‌లెస్‌లో పావురాల గురించి రన్నింగ్ కామెంటరీ

వినిపిస్తోంది.

గబ్బర్‌సింగ్ మొహం ఆనందంతో వెలిగింది. వైర్‌లెస్ ఆఫ్ చేశాడు.

"పావురాలు రావడానికి పావుగంట టైముంది. క్రిందకు వెళ్దాం!" అన్నాడు గబ్బర్‌సింగ్.

"ఎందుకు? వాళ్ళు కారంస్ ఆడుకుంటున్నారు."

"పిల్ల బాగుంది రా సాంబా! ఆ పిల్లను వుంచేసుకుంటాను. వాడిని ఒక్కడినే రేపు వుదయం పంపేద్దాం!"

"అలాగే...."

"పద! ఒకసారి చూచివద్దాం."

ఇద్దరూ మెట్లు దిగి క్రిందకు వచ్చారు.

గదిలోంచి కారంస్ ఆడుతోన్న చప్పుడు వస్తోంది. ఇద్దరూ తలుపులను సమీపించారు.

కారంస్ చప్పుడు ఆగిపోయింది.

గబ్బర్‌సింగ్ తలుపు తాళంతీశాడు.

ఇద్దరూ లోపలకు నడిచారు.

గదిలో దీపం వెలుగుతోంది.

"అరె! రాఘవ్ ఎక్కడ?"

"ఆ పిల్ల?"

ఇద్దరి మాటలూ చటుక్కున ఆగాయి.

ఇద్దరి మెడలలో రెండు పురిత్రాళ్ళు పడ్డాయి. క్షణాలలో అవి బిగుసుకున్నాయి.

రాఘవ్ తన చేతిలోని త్రాడు పట్టుకుని లాగాడు. గబ్బర్‌సింగ్ మెడలోని త్రాడు అతడిని పల్టీ కొట్టించింది.

సాంబం కూడా అదే సమయంలో పల్టీకొట్టాడు. లావణ్య త్రాడును ఒడిసిపట్టుకుంది.

ఇద్దరూ ఒకరినొకరు ఢీకొన్నారు.

పురిత్రాళ్ళు మెడలను బిగుసుకున్నాయి.

క్షణాలలో ఇద్దరినీ త్రాళ్ళతో కట్టేశారు అన్నా చెల్లెళ్ళు. కాళ్ళూ చేతులూ కదపడానికి లేదు. సోఫాలకు బలంగా కట్టేశారు.లావణ్యా, రాఘవ్ ఒకరినొకరు అభినందన పూర్వ కంగా చూసుకున్నారు.

బయటకు నడిచారు.

భవనం మొత్తం నిర్జనంగా వుంది.

ఇద్దరూ భవనంలోంచి బయటపడ్డారు.

వాళ్ళముందు షోలే వాహనం ఆగింది.

సెక్యూరిటీ గార్డు దిగాడు. అంతే? అతడి వెనుక పోలీసులు వచ్చారు. అతడు చేతులెత్తి నిలబడ్డాడు. పోలీసులు అతడిని కస్టడీలోకి తీసుకున్నారు.

అంతలో, వాహనంమీద నాలుగు పావురాలు వచ్చి వాలాయి. కొద్దిదూరంలో వాటివెనకే హెలీకాప్టర్ ఎగురుతూ వచ్చింది.

అది షోలే వాహనానికి కొద్దిదూరంలో ఆగింది.

హెలీకాప్టర్‌లోంచి సైంటిస్టు పరాంజపే దిగాడు.

కొడుకునూ కూతురునూ కౌగలించుకున్నాడు.

ఆయన కళ్ళు బాష్పాలను వర్షిస్తున్నాయి.

"మీరు ఎలా రాగలిగారు?" అడిగాడు నకిలీ సెక్యూరిటీ గార్డు.

పరాంజపే నవ్వాడు.

"మా పిల్లలు తెలివైనవాళ్ళు. వాళ్ళు నన్ను గబ్బర్‌సింగ్ మాట వినమని హెచ్చరిస్తూ వుత్తరాలు రాశారు.

లావణ్యా రాసిన వుత్తరంలో కుక్కపిల్ల ప్రసక్తి తెచ్చింది. లావణ్యకు కుక్కపిల్లలంటే ఎలర్జీ. అంటే తనకి యిష్టంకాని విషం రాస్తోంది. ఇష్టమైనట్టు నటిస్తోంది.

ఆ ఉత్తరాన్నిబట్టి ఆమెకు ఫార్ములా పరులపాలు కావడం యిష్టంలేదని అర్థం చేసుకున్నాను.

తర్వాత పావురాలే దిక్కు. మా ప్రాణాలు కాపాడే దిక్కు అని రాసింది.

అంటే పావురాలను వెంటాడి దిక్కులను తెలుసుకోమని. పావురాలకి నకిలీ ఫిల్ములు కట్టి సెక్యూరిటీ గార్డ్ చూస్తోండగా ఆరూముప్ఫయికి విడిచిపెట్టాను. తర్వాత హెలికాప్టర్‌లో వాటిని వెంటాడి వచ్చాను.

రాఘవ్ తన ఉత్తరంలో హిందీభాషా వుద్యమంలో జ్వాల....అంటూ ఏదో గందరగోళం రాశాడు. బాగా ఆలోచించాను. ఆ వుద్యమంలో రాఘవ్ స్వయంగా ఒక వాహనానికి నిప్పు పెట్టాడు. భాషను నేర్చుకోవాలి. అంతే కాని బలవంతంగా రుద్దకూడదని రాఘవ్ నమ్మకం. మేము తెలుగువాళ్ళం కాకపోయినా తెలుగు నేర్చుకున్నాం.

భాషమీద సహజంగా అభిమానం వుండాలి.

కృత్రిమంగా కాదు.

రాఘవ్ ఏదో వాహనం గురించి రాశాడు. వాహనాలకు సినిమాల పేర్లు రాయడం ఒక ఫాషన్. రాఘవ్ రాసిన వాహనంమీద "షోలే" రాసి వుంటుంది. జ్వాలకి హిందీలో షోలే పదం వాడతారు.

'గబ్బర్‌సింగ్—షోలే.'

'షోలే' పేరు రాసిన వాహనం గురించి పోలీసులకు సూచనలిచ్చాను.

ఆరున్నరకి ఆ వాహనం దొరికింది. సెక్యూరిటీగార్డ్‌గా నటిస్తున్న నీవు దాని డ్రయివర్‌వని తెలిసిపోయింది. పోలీసులు నిన్ను వెంటాడి స్థావరాని కొచ్చారు" చెప్పాడు పరాంజపే. □

వసుంధర

జబర్దస్తీ చుట్టం

"నేనమ్మా—సూరపరాజుని!" అన్నాడాయన.

తెల్లటి గ్లాస్కో పంచె, పెద్దాపురం సిల్కు లాల్చీ, గోల్డ్‌ఫ్రేం కళ్ళద్దాలు, సుమారు యాభై ఏళ్ళ వయసు—పెద్దమనిషి తరహా చూపులు—ఇవీ ఆయన్ను చూడగానే నాకు అగుపడినవి. కానీ సూరపరాజెవరో నాకు తెలియలేదు.

ఇబ్బందిగా చూశానాయనవంక.

"అయినా....నీకేం తెలుస్తుందిలే—పెళ్ళి తర్వాత మళ్ళీ ఇదేగా రావడం-అబ్బాయి వచ్చేదాకా లోపలికి రానిస్తావా?" అన్నాడాయన.

నేను నొచ్చుకున్నా సంకోచిస్తూనే—"అయ్యో! ఎంత మాట—రండి, లోపలకు" అన్నాను.

ఆయన లోపలకి వచ్చి సోఫాలో నడుం వాలుస్తూనే కాఫీ కావాలన్నాడు.

కాఫీ తాగేవాళ్ళంటే నాకు వళ్ళు మంట. నాకు భయపడి ఆయన కూడా రోజుకి ఇంట్లో ఒకపూటే తాగుతారు కాఫీ. ఇంట్లో పాలు కూడా లేవు. కానీ ఆపద్ధర్మంగా కొన్న పాల పొడి వుంది. పాలపొడి కాఫీ ఈయన తాగుతాడో తాగడో నని అనుమానిస్తూనే అడిగాను.

"అయ్యో—కాఫీ పొడి అన్నది వాడితే—చన్నీళ్ళలో కలిపినా తాగేస్తాన్నేను" అన్నాడాయన.

సరే — తప్పేముంది — అనుకుంటూ వంటింట్లోకి వెళ్ళాను. ఇంకా నయం—గ్యాసుంది. గ్యాసైపోయిందంటే మళ్ళీ సిలిండర్ తెచ్చుకుందుకు పదిరోజులు పడుతోంది. ఆ పదిరోజులూ కిరసనాయిలుతో అవస్థపడాలి. స్టవ్ ఇబ్బందులు ఒక ఎత్తు, కిరసనాయిల్ సంపాదించే యిబ్బందులింకో ఎత్తు—....కాఫీ కలిపి పట్టుకెళ్ళాను.

ఆయన అలవోకగా కాస్త చప్పరించి "ఏమ్మా—మీది కోటా పంచదారా, బ్లాకు పంచదారా" అనడిగాడు.

"కోటాయేనండి" అన్నాను వినయంగా.

"మీ కోటా నాకు చాలదమ్మోయ్—ఓ రెండు చెంచాలు తీసుకురా" అన్నాడు అధికార స్వరంతో.

నాకు వళ్ళు మండింది. మనిషికి బొత్తిగా మొహమాటం

ఉన్నట్లు లేదు. ఈ రోజుల్లో పదిరూపాయలు బదులడిగినా ఇస్తున్నాం కానీ చెంచాడు పంచదార కూడా అప్పివ్వడం లేదు. ఈయనిప్పుడు రెండు చెంచాలు ఎక్స్ట్రా అడిగాడు. అసలెన్నాళ్ళుంటాడో ఏమిటో!....ఏమైనప్పటికీ తప్పదు కదా—వెళ్ళి రెండు చెంచాల పంచదారా తెచ్చాను.

"నిన్ను చాలా శ్రమపెట్టాను" అంటూ ఆయన ఒక్క-గుక్క-లో నేనిచ్చిన కప్పుడు కాఫీ తాగేసి—"ఈ వెధవ ప్రాణానికి గంట గంటకీ కాఫీ కావాలి" అని విసుగ్గా అన్నాడు.

నేను మర్యాదకు నవ్వుతూ "గంట గంటకీ కాఫీ కావాలనుకుంటేనే వెధవ ప్రాణమైపోతుందాండీ" అన్నాను.

"మంచి ముక్క- చెప్పావమ్మా!" అన్నాడాయన తృప్తిగా నా వంక చూసి నవ్వుతూ.

నేనాయనకు ఎదురుగా కూర్చున్నాను. ఆయనెవరో వారి కెలాంటి బంధువో తెలియదు. చనువునుబట్టి చూస్తుంటే బాగా దగ్గర బంధువులాగే వున్నాడు.

"పడుకుంటారాండీ" అని "మిమ్మల్ని ఏ వరసపెట్టి పిల వాలో తెలియడం లేదు. బాబాయిగారూ అంటానండి" అన్నాను వినయంగా.

"ఈ ప్రపంచంలో ఏది శాశ్వతం? నీకు తోచిన వరస పెట్టి పిలవ్వొచ్చు. పడుకోవాలనే వుంది. కానీ మీ యింట్లో అలారం టైంపీసు వుందా?" అన్నాడు సూరపరాజు.

"ఉందండి. దేనికి?"

"గంట గంటకీ కాఫీ తాగాలి కదా—నిద్రపట్టిందంటే నాకు మెలకువ రాదు. అలారం పెట్టుకుని లేచి కాఫీ తాగి మళ్ళీ పడుకుంటూంటాను. అది సరే — నీకు జీడిపప్పు పకోడీలు వేయడం వచ్చా" అన్నాడు సూరపరాజు.

ఆయనేం అడగబోతున్నాడో తెలిసి — "రాదండి!" అన్నాను.

"పోనీ మెత్తటి పకోడీలు?" అన్నాడాయన.

"వచ్చునండి" అన్నాను—రాదంటే బాగుండదని.

సూరపరాజు గలగలా నవ్వి — "మెత్తటి పకోడీలు వేయడం కూడా ఓ విద్యేనా—జీడిపప్పు పకోడీలు రాదంటే అవమానం కదమ్మా—పోనీలే—నీకు రాకపోయినా నాకు వచ్చునులే! నేను దగ్గరుండి నీకు అన్నీ చెప్పి చేయిస్తాను. సాయంత్రం మీ ఆయనకు సర్‌ప్రైజ్‌గా పడ్డిద్దువుగాని...." అన్నాడు.

నేను కంగారుపడి—"జీడిపప్పు పకోడీలు ఆయన తినరు" అన్నాను.

"నువ్వెప్పుడైనా వండిపెడితేకదా ఆయన తినరని తెలుస్తుంది!" అన్నాడు సూరపరాజు.

నేను గతుక్కుమని—"ఆయన తినరనే నేను నేర్చుకోలేదు" అని సర్దుకున్నాను.

"ఆ మాట పకోడీ ఒకటి రుచిచూసేక అనమను. దాచడమెందుకూ—జీడిపప్పు పకోడీలను మా ఆవిడకూడా నేనే దగ్గరుండి పాళ్ళేయించాలి—నేను చెప్పినట్లు చేయి. ఈ రోజునుంచి మీ ఆయన కూడా వాటిని ఇష్టపడడమే కాక రోజూ చేయమని వేధించుకు తింటాడు" అన్నాడు సూరపరాజు.

"ఇంట్లో జీడిపప్పు ల్లేవండి" అన్నాను. అది నిజం కూడా!

"నువ్వు నచ్చేవమ్మా నాకు. అలా చెప్పాలి. ఇల్లేమన్నా కిరాణా దుకాణమా అన్ని సరుకులూ అస్తమానూ వుండడానికి. అందులోనూ నువ్వు కలగనవు కదా నేనొస్తానని!

ఈ వీధిలో ఏదైనా కిరాణా దుకాణముంటే చెప్పు.అవసర మైన సరుకులన్నీ లిస్టురాసి తీసుకొచ్చేస్తాను. ఎటొచ్చీ మీ యింట్లో వుండడాని కొచ్చి నా డబ్బులు ఖర్చుచేస్తాననుకోకు. డబ్బు నువ్వే ఇవ్వాలి!'' అన్నాడాయన నిర్మొహమాటంగా.

ఇంట్లో వందరూపాయల నోటు మాత్రం వుంది. చిల్లర లేదు. నమ్మి ఈయన కెలా ఇచ్చేది? అలాగని ఇల్లీయన మీద వదిలిపెట్టి బైటకెలా వెళ్ళేది? అందుకని—''బాబాయ్‌గారూ—ఆయన రాగానే పకోడీలు అంతా కలిసి చేద్దాం. ఆయన ఇంట్లో ఒక్క పైసా కూడా వుంచరు....'' అన్నాను.

సూరపరాజు భ్రుకుటి ముడతలు పడింది. శ్రీవారినాయన కాసేపు విమర్శించారు.

''ఆయన తప్పేంలేదు. బాబాయ్‌గారూ—ఈ మధ్య దొంగతనా లెక్కువైపోయాయి. అడ్డమైనవాళ్ళూ ఇళ్ళలో చొరబడిపోతున్నారు'' అన్నాను.

''అలాగైతే నిన్నూకూడా తీసుకుపోక పోయాడా? ఆడ వాళ్ళమీద అత్యాచారాలు కూడా ఎక్కువయ్యాయి!''

ఏమనాలో తెలియదు. ఆడవాళ్ళమీద అత్యాచారాల గురించి ఆయనతో మాట్లాడ్డం దొంగాడా కరవకురా అన్నట్లు అవుతుందని నా భయమూ, అనుమానమూ. అందుకని మౌనంగా ఊరుకున్నాను.

''ఈ వీధిలో కిరాణా దుకాణం లేదా?'' అనడిగాడాయన. ఉందని చెప్పాను. అందులో అరువివ్వరా అనడిగాడు. అరువు మా కలవాటు లేదని చెప్పాను. అత్యవసర పరిస్థితుల్లో అరువు ఎంత ఉపయోగపడుతుందో ఆయన సోదాహరణంగా వివరించి—''నాకు జీడిపప్పు పకోడీల మీద ఎంత మమకారమో నీకు తెలియదు. ఈ అలారం టైంపీసు

తీసుకుని దుకాణానికి వెడతాను. మీ పేరు చెబుతాను. వాడు అరువివ్వనంటే ఈ గడియారం వుంచుకోమని చెబుతాను. సరుకులన్నీ తెస్తాను!" అంటూ సోఫాలోంచి లేచాడు ఆయన.

ఏం చేయాలో తోచలేదు నాకు. ఆయన్నెలా ఆపాలో తెలియలేదు. ఆయన లేచినపుడు పర్సుతీసి నా కందించి—"వీధిలోకి వెడితే డబ్బు ఖర్చుచేయ బుద్ధి. అందుకని ఇది ఇంట్లోనే వుంచు. నేను సరుకులు తీసుకొస్తాను. అన్నట్లు ఇంట్లో పచ్చిమిరపకాయలున్నాయా?" అన్నాడాయన.

"ఉన్నాయండి" అన్నాను. ఆయన జీడిపప్పు పకోడీలు వేయడానికి ఏమేం కావాలో నాకు చెప్పి ఇంట్లో లేనివి—కాగితంమీద నోట్ చేసుకుని అలారం టైంపీసు తీసుకుని బైటకు వెళ్ళాడు. పకోడీలు చేయడంలో ఆయన పరిజ్ఞానం చాలా గొప్పదని గ్రహించాను నేను. ఆయన వెళ్ళిపోగానే ఆత్రుతగా పర్సుతెరిచి చూశాను. అందులో డబ్బేమీ వుండదని నా అనుమానం. అయితే నా అనుమానం నిజంకాదు. అందులో అయిదువందల రూపాయలపైచిలుకు వుంది.

అందులోవి అసలు నోట్లేనా అని అనుమానం వచ్చింది. ఎందుకంటే ఆయన అంత దర్జాగా డబ్బు వదిలేసి పోతాడా? ఇంట్లో వున్న వందరూపాయల నోటు తెచ్చి అందులో ఉన్న రెండు వందరూపాయల నోట్లనీ పరీక్షించాను. అన్నీ ఒక్కలాగే వున్నాయనిపించింది. అవి దొంగనోట్లు అయి వుండవు.

అయితే సూరపరాజు ఎలాంటి మనిషి?

తనదగ్గర ఇంత డబ్బుంచుకుని పైసా కూడా ఖర్చుపెట్టకుండా నా యింట్లో పకోడీలు వేయించుకుని తినాలనుకుంటున్నాడు. మనిషికి బొత్తిగా సిగ్గు, మొహమాటం,

అభిమానం వున్నట్లు లేదు. ఇలాంటి పని చేయడానికి నేనైతే సిగ్గుతో చచ్చిపోతాను.

ఇంతకీ ఆయన అలారం టైంపీసుతో తిరిగొస్తాడా? ఎందుకు రాడు? టైంపీసు ఖరీదు వందచిల్లర.

అప్పుడే నాకో అనుమానం వచ్చింది. టైంపీసు తీసుకుని ఆయన వెళ్ళిపోతూంటే నాకు బెంగపుడుతుంది. ఆయన్ని అనుమానిస్తాను! ఆ అనుమానం పోవడం కోసమే తన పర్సు ఇంట్లో వదిలివెళ్ళాడు. అంటే ఈయనకు మర్యాద తెలిసి వుండాలి. తను పైసా ఖర్చు చేయకుండా పకోడీలు తినాలనుకునే మనిషికి మర్యాదేమిటో నాకు అర్థం కావడంలేదు. మొత్తంమీద ఈయన విచిత్రమైన మనిషి.

దుకాణంవాడు ఏమనుకున్నాడో అలారం టైంపీసు చూసి! ఆయనకు అబద్ధం చెప్పకుండా వుండాల్సింది.... అందువల్లనే ఈ గొడవంతా వచ్చింది.

నా ఆలోచనలింకా తేలకుండానే సూరపరాజు తిరిగి వచ్చేశాడు. ఆయనకు ఓ చేతిలో పొట్లాలున్నాయి. రెండో చేతిలో అలారం టైంపీసుంది. వస్తూనే ఆయన నావంక అదోలా చూసి "ఏమమ్మా—కాఫీ తాగి గంట కావస్తోంది. కాఫీ చేసేశావా, నేను గుర్తుచేయాలా?" అనడిగాడు.

"నీ అర్థార్ధి మండిపోనూ" అని మనసులో మాత్రం అనుకుని వంటింట్లోకి పరుగెత్తి ఈసారి కాస్త ఎక్కువగానే కాఫీ కలిపి ఫ్లాస్కులో పోసి తీసుకొచ్చాను. మొత్తం మూడు కప్పులు చేశాను. ఈసారి ఆయన దీనికి నన్ను చాలా మెచ్చుకుంటాడని ఆశించాను. నేను కూడా ఇప్పుడాయన మెప్పును ఆశిస్తున్నాను. వాటం చూస్తే సూరపరాజు మా ఆయనకు చాలా దగ్గర బంధువులాగున్నాడు.

నా చేతిలో ఫ్లాస్కును చూస్తూనే సూరపరాజు "ఎంత

పని చేశావమ్మా?" అన్నాడు.

ఏం జరిగిందో నాకు అర్థంకాక ప్రశ్నార్థకంగా ఆయన వంక చూశాను.

"ఫ్లాస్కులోంచి కాస్త కాస్త పోసుకుని కాస్త కాస్త తాగుకోవడం నాకు చేతకాదమ్మా—కాఫీ ఎంతుంటే అంతా తాగి తీరాల్సిందే! అయినా ఈ విషయం నీకు చెప్పడం మరిచిపోయాను. తప్పు నాది. శిక్ష నీకు...." అంటూ అప్పటికప్పుడు మొత్తం మూడు కప్పుల కాఫీ ఒక్కసారే తాగేసి "నీ చేతి కాఫీ చాలా బాగుందమ్మా" అన్నాడు.

నా గుండె చెరువై పోయింది. నా ముఖంలో హావభావాలు మారిపోతున్నాయని నాకు తెలిసిపోయింది. అలా జరగడం నా కిష్టంలేదు. మాట మారిస్తేకానీ నేను మామూలు మనిషిని కాలేను. ఎందుకంటే ఆయన్ను చూస్తూంటే నాకు కోపం, ఉక్రోషం ఆగకుండా వచ్చేస్తున్నాయి. అందుకని "బాబాయ్ గారూ—మీరు అలారం టైంపీసు ఇవ్వకుండానే సరుకులు తీసుకొచ్చారే!" అన్నాను.

ఆయన నవ్వి "ఏదో-సరదాకన్నాను కానీ వీధిలో వీధిలో వుంటూ దుకాణంవాడు ఆమాత్రానికి ముఖం చూసుకోడని నాకు తెలుసు. మీకైతే అరువు అలవాటు లేదు కానీ నాకు అనుభవమే కదా! అలారం టైంపీసు తాకట్టు పెడితే అసహ్యంగా కూడా వుంటుంది. మీ యిల్లు గుర్తు చెప్పడం కోసమని ఇది తీసుకువెళ్ళ-కావాలంటే ఉంచుకో మని సరదాగా అన్నట్లు అన్నాను...." అన్నాడు.

తెలివైనవాడే .... కానీ తెలివితేటలు అన్ని సమయాల్లోనూ ఉపయోగించడేం—!

నేనిలాగనుకుంటూండగానే సూరపరాజు — "అన్నట్లు

నా పర్సు నీకిచ్చానుకదమ్మా — ఇంక నాకిచ్చేసేయ్"
అంటూ అడిగేశాడు.

ఆ క్షణంలో నా వళ్ళు భగభగ మండింది. ఎలాగో తమాయించుకుని పర్సాయన చేతికిచ్చాను. డబ్బు లెక్క పెట్టుకోండి అన్న మాటలు నోటి చివరిదాకా వచ్చి ఆగి పోయాయి. నేను మర్యాదను అంత సులభంగా వదిలిపెట్ట లేక పోయాను.

ఆయన పర్సు జేబులో పెట్టుకుని "కాసిని మంచినీళ్ళు తీసుకురామ్మా!" అన్నాడు. నేను లోనికి వెళ్ళి క్షణాలమీద మంచినీళ్ళు తీసుకొచ్చాను. వచ్చేసరికి కళ్ళబడ్డ దృశ్యం నన్నాశ్చర్య చకితురాల్ని చేసింది.

సూరపరాజు పర్సులోని డబ్బు చిల్లరతో సహా లెక్క పెట్టుకుంటున్నాడు. అంతా అయ్యేక జేబులోంచి ఏదో కాగితం తీసి మొత్తం సరిపోయిందో లేదో చూసుకుంటు న్నాడు.

సిగ్గు, అవమానం నా శరీరాన్ని కుంచింపజేశాయి. ఆయన నన్ను కూడా తనవంటి పిగ్గుమాలిన మనిషికిందే లెక్క వేసుకున్నాడా?

నేను మంచినీళ్ళు తీసుకుని వెళ్ళేసరికి ఆయన పర్సు జేబులో పెట్టుకుని—జేబులోని కాగితాన్ని నాకు చూపిం చాడు. దానిమీద ఒక అంకె వున్నది.

"చూశావా అమ్మా! ఇది ఈ పర్సులో ఎంత డబ్బుందో చెప్పే అంకె! ఈ కాగితంమీది అంకెకూ, పర్సులోని డబ్బుకూ ఒక్క పైసాకూడా తేడా రాకూడదు" అన్నాడు.

"అప్పన్నెండి—లెక్క చూసుకోలేక పోయారా? అందు లోనూ పర్సు నా చేతికి కూడా ఇచ్చారు మరి" అని కాస్త నిష్ఠూరంగానే అన్నాను.

సూరపరాజు చలించలేదు "జాగ్రత్తకు యెవరైనా నా తర్వాతనే అమ్మా. పర్సుదేముంది ఏ మాత్రం అజాగ్రత్తగా వున్నా ఓ నోటో, కాస్త చిల్లరో జారిపడిపోవచ్చు. అందుకే ఎవరికి పర్సిచ్చినా నేను డబ్బు లెక్కపెట్టుకుంటాను" అని ఆయన మంచినీళ్ళందుకుని తాగి "కాస్త నడుం వాలుస్తా నమ్మా మడతమంచం వాల్చగలవా?" అన్నాడు.

నేను మడతమంచం వాల్చి పక్కవేశాను. ఆయన పడుకోబోతూ "ఇందాకా మూడుకప్పులూ తాగేశాను కదా అని ఇంక ఇవ్వాల్సినపని లేదనుకోకు. ఒక్కసారి యెన్ని కప్పులు తాగినా ఒక్కసారి కిందే లెక్క!" అన్నాడు.

భగవంతుడా ఇదెక్కడి తద్దినం తెచ్చిపెట్టావురా అనుకున్నాను మనసులో. ఇలాంటి అలవాటు శ్రీవారికుందంటే వచ్చే జీతమంతా కాఫీకే సరిపోతుంది!

నిమిషాలమీద ఆయన గుర్రుపెట్టాడు. అసలే స్థిమితం లేకుండా వున్న నాకు ఈయన గుర్రొకటి. శబ్దంవల్ల ఇల్లంతా అదిరిపోతోంది. అదలాగుంచితే ఆయన ఉనికి అనుక్షణం గుర్తుచేస్తోందా గుర్రు.

[illegible] తున్నాను. అందుకు [illegible] ఆయన కట్టిన పంచ, వేసుకున్న లాల్చీ, ముఖకవళికలు.

చూడ్డానికి ఆయన గొప్పవాడిలాగున్నాడు. చేతలలా లేవు. అయినా ఆయన మీద ద్వేషం పెంచుకుంటున్నాను తప్పితే ఏమీ అనలేకపోతున్నాను.

ఆలోచిస్తూండగా ఆయన కంఠం వినపడింది "ఏమమ్మా అలారం మోత వినబడలేదా?"

ఉలిక్కిపడ్డాను. ఆలారం మోత నిజంగానే నాకు వినపడలేదు. ఆయన గుర్రు శబ్దం ఇల్లంతా ఆక్రమించేయగా యింకా అందులోంచి అలారం శబ్దం ఎక్కడ వినిపిస్తుందీ. అవునూ అసలది ఆయనకు మాత్రం యెలా వినిపించింది? బహుశా ఆయన గుర్రు ఆయనకు వినిపించదేమో!

నేను కాఫీ కలుపుకురాగానే ఆయన గలగలా నవ్వి "ఏమమ్మా నిద్రపోతున్న నాకే వినిపించింది_మెలకువగా వున్న నీకు వినపడలేదేంటమ్మా అలారం మోత" అన్నాడు.

నేను ఏడ్వలేక నవ్వి ఊరుకున్నాను. ఆయన కాఫీ తాగేసి మళ్ళీ పడుకున్నాడు. పడుకుని రెండు క్షణాలైనా

కాకుండా గుర్రు మొదలెట్టాడు. ఆ శబ్దం నేను భరించలేక పోతున్నాను. ఇలాంటి బాధల్నుంచి తప్పించుకునేందుకు ఏకాగ్రత ఒక్కటే ఉపాయం. ఏదైనా పుస్తకం తెచ్చి చదువుదామనుకున్నాను. సోఫాదగ్గర టీపాయ్‌మీద పక్కింటావిడిచ్చిన నవల వుంది. అది చదువుదామనుకుని పుస్తకం తీయగానే చేయిజారి పుస్తకం క్రిందపడింది.

"అబ్బా-ఏమిటమ్మా చప్పుళ్ళు!" అన్నాడాయన విసుగ్గా.

నేనాశ్చర్యపోయాను. పుస్తకం కిందపడడంవల్లనైన శబ్దం చాలా చిన్నది. ఆయన గుర్రుశబ్దంలో నాకసలది వినపడనేలేదు. అంత గుర్రుపెడుతూ ఆయన ఈ శబ్దానికి నిద్రాభంగం పొందాడు. "నీ అసాధ్యం కూలా-భలేవాడివే" అని మనసులో అనుకున్నాను. ఆ తర్వాత నుంచి నన్నో కుతూహలం బాధించింది. ఆయన గుర్రులో ఈసారైనా నేను అలారం వినగలనా అని. పట్టుదలగా కూర్చున్నాను. ఆయనకు వినబడ్డ అలారం నాకు మాత్రం యెందుకు వినపడదు?

పట్టుదలగా చెవులు రిక్కించి మరీ కూర్చున్నాను. అప్పుడే ఇంకో విచిత్రం తెలిసింది నాకు.

మనిషి ఆగి ఆగి ఊపిరి పీలుస్తాడు. మనిషి గుండె ఆగి ఆగి కొట్టుకుంటుంది. అలాంటప్పుడు గురక కూడా ఆగి ఆగి రావాలి గదా! ఈయన గురక ఆగడంలేదు. ఎడతెరిపి లేకుండా బాజా వాయిస్తున్నట్లుగా వుంది. గాయకుడి వెనుక తంబురాలాగాన ఒక్కక్షణం వ్యవధిలేకుండా శబ్దం వస్తూంటే నాకు సంగీతానికి శృతిపెట్టె గుర్తు కొచ్చింది. ఆయన ఒకసారి గుర్రుపెడితే అది గదిగోడలో తగిలి ప్రతిధ్వనిస్తుంది. ఈలోగా ఆయన మళ్ళీ గుర్రు పెడుతున్నాడు. ఆగకుండా గురక వినిపించడానికి కొక్కటే కారణమయిండాలి.

ఇలా ఆలోచిస్తూండగానే ఆయననుంచి మళ్ళీ హెచ్చరిక వినపడింది. అలారం మ్రోగిందని.

ఆయనమీద కోపంకూడా మరిచిపోయి ఆశ్చర్యపడ్డాను. ఈ వింత శ్రీవారికి చూపించడం కోసమైనా మరొక్క రోజాయనకు ఆతిధ్యం యివ్వాలనిపించింది నాకు. శ్రీవారైతే మరీ భ్రమిస్తై పోతారు. ఆయనకు కుక్కర్ మ్రోగితేనే యింకేమీ వినపడదని గోల పెట్టేస్తారు.

నేను లేచి కాఫీ కలుపుతూండగా ఎవరో తలుపుతట్టారు. ఆయనే లేచివెళ్ళి తలుపు తీశాడు. వచ్చింది పక్కింటి తులశమ్మగారు.

నేనాయనకు కాఫీ యిచ్చి తులశమ్మగారిని వంటింట్లోకి తీసుకుపోయాను.

"ఆయనెవరమ్మా" అడిగింది తులశమ్మ.

"శ్రీవారి బంధువులు కానీ-ఏమిటిలా వేళగాని వేళలో వచ్చారు" అన్నాను. సాధారణంగా తులశమ్మ ఈ సమయంలో నిద్రపోతుంటుంది.

"ఆఁ ఏమీలేదు, మీరు జాన్సన్ మిక్సీగాని కొన్నారేమిటి?" అడిగింది తులశమ్మ.

"ఆ అనుమానమెందు కొచ్చిందీ" అన్నాను ఆశ్చర్యంగా. మా యింట్లో మిక్సర్ వుంది. ఇంకొకటి కొనాలని కూడా నేననుకోలేదు. కానీ నిప్పులేందే పొగ రాదంటారు.

"అబ్బే ఏంలేదూ—పేపర్లో రాస్తూంటాడు గదా—అదైతే సలభై అయిదు నిముషాలు ఆగకుండా వాడుకోవచ్చనీ మీ యింట్లో ఆగకుండా మిక్సర్‌శబ్దం వస్తూంటే బహుశా జాన్సన్ మిక్సర్ కొని టెస్టు చేస్తున్నారేమోననుకున్నాను. టెస్టుచేస్తే మధ్యాహ్నం సమయాల్లో చేయకండమ్మా నిద్ర చెడిపోతూంది. ఏ సాయంత్రంలో అయినా

ఫరవాలేదు" అంది తులశమ్మ.

నాకు నవ్వాలో, ఏడ్వాలో తెలియలేదు. అది మిక్సర్ చప్పుడు కాదనీ, సూరపరాజు గురక అని చెప్పగానే మాత్రం తులశమ్మ గుక్కపట్టి పడిపోయింది. ఆవిణ్ణి సేద తీర్చడం చాలా కష్టమయింది.

ఈలోగా సూరపరాజు వంటింట్లోకి వచ్చి "ఏమమ్మా నా నిద్ర అయిపోయింది మరి" అన్నాడు.

వెంటనే తులశమ్మ లేచి వెళ్ళిపోయింది.

సూరపరాజు నా దగ్గర దండకం ఆరంభించాడు "ఈ ఇరుగు, పొరుగులకు బొత్తిగా మర్యాదలు తెలియవమ్మా. ఇంట్లో చుట్టం వున్నాడుగదా ఏ టిఫినైనా చేసిపెడుతుందేమో ననుకుని వెంటనే వెళ్ళిపోవద్దూ-పోనీలే నేనురాగానే అయినా వెళ్ళిపోయింది-మనం జీడిపప్పు పకోడీలు ప్రారంభిద్దామా!"

తప్పుతుందా-ఆయన ఆధ్వర్యంలో వంటకం ప్రారంభమయింది. తయారయేసరికి నిజంగానే అద్భుతంగా వచ్చాయి. పెద్దపళ్ళెం నిండా అయ్యాయి.

"ఈ పళ్ళెం నిండా ఉన్నాయిగదా చెల్లవేమోనని భయపడకు. ఇది పూర్వకాలపు శరీరం. ఈజీగా చెల్లిపోతాయివన్నీ. ముందు మనమిద్దం కాసిని తిందాం. మీ ఆయన వచ్చేసరికి మన ముగ్గురికీ మూడు ప్లేట్లుంచు. ఇప్పుడు తినేయడమైపోయింది గదా అని మరి తిననని అనుకోకు". అన్నాడు సూరపరాజు.

"అబ్బే అలా ఎందుకనుకుంటానండీ" అన్నాను కాస్త వ్యంగ్యం ధ్వనించేలా.

ఆయనది పట్టించుకోలేదు. ప్లేట్లో సర్ది ఇచ్చాను. క్షణాల మీద తినేశాడు.

"నువ్వు తినడంలేదేమమ్మా!" అన్నాడు.

"ఆయనొచ్చేక తింటానండి" అన్నాను.

"సరే నాకు మరో ప్లేటియ్యి" అన్నాడు సూరపరాజు.

"మంచినీళ్ళు తాగుతారా?" అన్నాను.

"వద్దమ్మా. టిఫిన్ పూర్తిగా తిన్నాకగానీ మంచి నీళ్ళు తాగకూడదు. ఎప్పుడు మంచినీళ్ళు తాగానో అప్పటితో టిఫిన్ తినడం అయిపోయిందన్న మాటే" అంటూ ఆయన యింకో రెండు ప్లేట్లు తిన్నాకనే మంచినీళ్ళు త్రాగాడు.

మధ్యాహ్నం గడిచిపోతే ఆయనకింక కాఫీ అక్కర్లే దుట. అదో శుభవార్త చెప్పాడాయన నాకు. ఎటొచ్చీ శ్రీవారితోపాటు కలిసి టిఫిన్ తినేసమయంలో మాత్రం ఓ కప్పు కాఫీ ఇమ్మన్నాడు.

ఆయన్నసహ్యించుకోవడం తగ్గించి వినోదించగలిగాను. శ్రీవారు వచ్చేసరికి నేను వీధిగుమ్మంలోనే నిలబడి క్లుప్తంగా సూరపరాజు గురించి చెప్పి జీడిపప్పు పకోడీల గురించి కూడా క్లుప్తంగా చెప్పాను. ఎందుకంటే మా ఇద్దరి మాటలకూ తేడా వుండకూడదు.

"సూరపరాజా-వాడెవరు?" అన్నది ఆయన రియాక్షన్. ఆయన్నే అడగండన్నాను ఆశ్చర్యంగా.

అయితే సూరపరాజు ఆయన్ని ఒరేయ్ అని పిలిచి అవీ యివీ కబుర్లు చెప్పి అసలాయన ప్రశ్నవేసే అవకాశం కూడా యివ్వలేదు.

కాసేపు కూర్చుని జీడిపప్పు పకోడీలు అందరితో కలిసి తిని "ఇంకో గంటలో వచ్చేస్తాను" అంటూ బయటకు వెళ్ళిపోయాడాయన.

అప్పుడు మా యిద్దరికీ మాట్లాడుకునే అవకాశం వచ్చింది. నేను జరిగినదంతా తూచా తప్పకుండా శ్రీవారికి చెప్పాను. అంతా విని "ఎలా సహించావిదంతా శ్రీమతీ!"

అన్నారాయన ఆశ్చర్యంగా.

"ఒకొక్కరి ముఖారవింద ప్రభావం మీరు మాత్రం నోరెత్తి అయనెవరో అడిగారా?" అన్నాను.

ఇంతకీ ఆ సూరపరాజెవరో ఆయనకూ తెలియదు. కానీ అయినవాడే అయుండాలంటారాయన. అయినవాడు కాకపోతే మరీ అంత చనువుగా వుండలేడట.

"సరే ఓ గంటలో వస్తాడుగా చూద్దాం" అన్నారాయన.

కానీ సూరపరాజు మళ్ళీ రాలేదు. శ్రీవారు కంగారుపడి ఇల్లంతా వెదికారు. ఏమైనా పట్టుకుపోయాడేమోనని. కానీ పాపం అలాంటిదేం జరగలేదు. "ఊ జబర్దస్తీ చుట్టమెవడో ఎంత ఆలోచించినా అంతుబట్టడంలేదు" అంటూ తల పట్టుకున్నారాయన.

సూరపరాజు విషయం మరో నాలుగురోజుల వరకూ మిస్టరీగానే వుండిపోయింది. అయితే ఒక రోజున బజార్లో మాకు సూరపరాజు కనబడ్డాడు. సూరపరాజుతో పాటు ఒక ముసలావిడ వుంది. ఇంచుమించు వాళ్ళతో పాటే మరోజంట నడుస్తోంది. ఆ జంట మాకు తెలిసినదే! శ్రీవారి స్నేహితుడు కమలాకరమూ, అతడి భార్యానూ....

అప్పటికప్పుడు సూరపరాజుకు ఎదురుపడ్డం మా కిష్టం లేకపోయింది. అయితే ఆ జంటను కుతూహలంగా వెంటడించడంలో సూరపరాజు జంట ఓ పార్కులో స్థిరపడగా కమలాకరం మాకు విడిగా దొరికాడు.

"ఆయనెవరు, మీకు చుట్టాలా?" అనడిగారు శ్రీవారు.

"ఏదో దూరపుచుట్టం. కానీ పెద్ద యిబ్బంది వచ్చిపడింది. ముసలాయన ఆరోగ్యం మంచిదికాదు. రక్తపుపోటు. మధుమేహం. డాక్టర్లు కాఫీ తాగకూడదన్నారు. పంచదార తినకూడదన్నారు. ఉప్పూకారం మానేయా

లన్నారు. ముసలాయనకు జిహ్వాచాపల్యం. ఆయన ఆరో గ్యాన్ని పిల్లలు వెయ్యికళ్ళతో కాపాడుకుంటున్నారు. కూడా ఆయన పిల్లలు కూడా వచ్చారు. ముసలాయన్ని విడిగా వద లరు వాళ్ళు. వదిలేస్తే యెక్కడ ఏం తినేస్తాడోనని భయం వాళ్ళకి. ఈరోజు వాళ్ళని ఎక్కడైనా తిరగమనిముసలాళ్ళకు మేం బాడీగార్డులుగా బయల్దేరాం" అన్నాడు కమలాకరం.

"అలాగా_అయితే ఆయన్నెప్పుడూ విడిగా వదలరా?"

"ఎందుకు వదలరూ? చాలాసార్లు వదుల్తుంటూరు. వదలినప్పుడేం చేస్తారంటే ఆయనచేతికి పర్సిచ్చి అందులో ఎంత డబ్బుందో పైసలతో సహా కూడా లెక్కరాస్తారు. ఒక్కపైసా ఖర్చయినా ఇంటిల్లిపాదీ శోకాలుపెట్టి ఆయ నకు స్థిమితం లేకుండా చేస్తారు. అందుకని ఆయన తీసుకు వెళ్ళిన డబ్బు తీసుకువెళ్ళినట్లే వెనక్కు తెచ్చేస్తాడు. ఈ ఆంక్షతో వాళ్ళు ముసలాయన్ని అదుపులో పెడుతున్నారు" అన్నాడు కమలాకరం.

ఉన్నట్లుండి నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. అందుకు కారణం ఆ రోజు సూరపరాజు పర్సు నాచేతికిచ్చేక డబ్బు లెక్కచూసుకుంటున్న దృశ్యం గుర్తుకు రావడం.

ఒకప్పుడదే దృశ్యం నన్నాయన్ను ద్వేషించేలాచేసింది. ఆ దృశ్యమే యిప్పుడు నా కాయనపై జాలి కలిగిస్తోంది.

భగవంతుడా మనం చూసే దృశ్యాల్లోని నిజానిజాలే తెలుసుకోలేని అల్పులుగా మమ్మెల్నెందుకు సృష్టించావు? అని మనసులో బాధపడ్డాను.

సూరపరాజును తల్చుకుంటేనే నా మనసిప్పుడు సాను భూతితో ద్రవించిపోతోంది.- నేను శ్రీవారి చేయిపట్టుకుని "ఊఁ" అన్నాను. పదండి పోదాం అనడానికి గొంతులో ఏడుపు ధ్వనిస్తుందని భయంవేసింది. □

వాలంటీ దొంగ

ఇమంది రామారావు

"ఏడుకొండలవాడా.... వెంకటరమణా

గోవిందా గోవిందా!" తిరుమల సింహద్వారం కని పించగానే భక్తుల్లో కలకలం బయలుదేరింది. 'గోవింద' శబ్దం యెక్కువయింది. కళ్ళు మూసుకొని అంతా భక్తి

ప్రపత్తులో వేంకటేశ్వరుణ్ణి ధ్యానిస్తున్నారు.

మావయ్య మరీను. 'బస్సు' మార్మోగేలా తనకొచ్చిన గోవిందనామ శబ్దాలతో తారెత్తిస్తున్నారు. నేనూ పారు మనసులోనే స్మరించుకున్నాం.

ఒక్క కుదుపుతో బస్సు ఆగింది. మూటా ముల్లే సర్దుకొంటూ భక్తులు బిలబిలా దిగుతున్నారు. మావయ్య హడావుడి చేస్తున్నారు.

"పార్వతీ! ఆలస్యమయితే ఎలాగా. యిలాంటి ప్రయాణాల్లో ఎంత ముందుంటే అంత మంచిది దిగండీ.... సామాన్లు సరిపోయాయా. సూట్‌కేసులు మూడున్నాయా? హాండీబ్యాగూ, వాటర్‌బ్యాగూ, ప్లాస్టిక్ సజ్జ ఏది?" చుట్టూ చూశాడు.

"నా చేతిలోనే వుంది నాన్న" గుర్తుచేసింది పార్వతి.

"అహా....అయితే సరిపోయాయి దిగండి. మొత్తానికి మనం మంచి టైంలో వచ్చాం!" అన్నాడు మావయ్య ఉత్సాహంగా.

మావయ్య రిటైర్డ్ పోలీసు 'హెడ్'గా సర్వీసు చాలించాడు. డ్యూటీలో చాలా స్ట్రిక్టు. హెడ్డు యల్లారావు అంటే అందరికీ హడల్ అంటూంటారు యిప్పటికీ. అరవై ఏళ్ళు పైబడినా ఆయనలోఎంతో ఉత్సాహం వుంది.

పారూ మొహంలోకి చూశాను. వాళ్ళనాన్నలో కనిపిస్తోన్న కొత్త కాంతుల్ని చూస్తూ సంబరపడిపోసాగింది.

"రండి కాటేజీ తీసుకుందాం!" అంటూ కాటేజీ బుకింగ్ కౌంటర్‌కేసి నడిచాను చెరో సామాను పుచ్చుకుని. నాలుగడుగులు వేసేసరికి చేతులుంటాయో ఊడిపోతాయో అనుమానం వచ్చింది నా వరకూ. బహుశా మావయ్యకీ అలాగే వుండొచ్చు.

"రూం....తీసుకోండి. ఒక డబుల్ రూము!" అన్నాడు మావయ్య ఆయాసంగా.

'క్యూ'లో నుంచున్నాను. నా ముందు సుమారు నలభై మంది వుంటారు.

మరో ప్రక్క లేడీస్ 'క్యూ' వుంది. వాళ్ళొక పాతిక మందిదాకా వున్నారు. ముందు లేడీస్‌కి యిస్తున్నట్లు తెలిసింది. పారుకి 'క్యూ'లో నుంచోవడం, పోట్లాడి టికెట్స్ తీయడం యిలాంటివి పట్టవు. అందుకే నేను అడగలేదు కూడా. మావయ్య కదిపేరు.

"పార్వతీ నువు 'క్యూ'లో నిలబడితే తొందరగా వెళ్ళిపోవొచ్చుగా!" అని. దానికి పారు ఓ 'చూపు' విసిరింది కోపంగా—మావయ్య గప్‌చిప్‌గా ఊరుకున్నారు.

అరగంటయింది. గంటయింది.

"అబ్బా .... ఏడుకొండలవాడా — చచ్చాను తండ్రీ! రామూ, నేను కాఫీ తాగకపోతే అవుట్—మీరు వస్తారా?" అన్నాడు.

"ఆయనొస్తే 'క్యూ'లో ఎవరు నుంచుంటారు. మీరెళ్ళి తాగిరండి!" అంది పారూ. మావయ్య తల గోక్కుంటూ కదిలాడు. కాఫీ తాగడం ముగించి అక్కడ పిచ్చాపాటి గడిపి వచ్చాడు 'క్యూ' కదల్లేదు.

"అల్లుడూ! యిలా ఎంతసేపు నుంచున్నా ప్రయోజనం లేదు. ఆ కౌంటర్ దగ్గరున్నాయన్ని రిక్వెస్టుచేయండి. దాని మీద కొంత బరువుపెట్టి" అన్నాడు. లంచాన్ని మావయ్య ముద్దుగా 'బరువు' అంటూంటాడు.

నాకూ చిరాకు అనిపించింది. నాచేత్తో నేను లంచం యివ్వలేను. మనస్కరించదు. అలాగని ఏటికి ఎదురీదలేం కదా. "అదేదో మీరే చెయ్యండి" అని ఇరవై రూపాయల

నోటు ఆయన చేతిలో పెట్టాను.

"అబ్బబ్బ. ప్రాణం విసిగిపోతుంది బాబూ!" అంది పార్వతి.

ప్రయాణం బడలిక తీరలేదు. మొహాలు జిడ్డుగా వున్నాయి. ముందు స్నానం చేస్తేగాని మాట్లాడేస్థితిలో లేదు పారు. నేనుకూడా అంతే — అంతలో మావయ్య వచ్చారు. టికెట్ తీసుకొని.

"ఇదీ ప్రపంచమంటే — గంటన్నరనుంచున్నావ్. యిలా వెళ్ళి ఇరవై రూపాయిల నోటు యిచ్చి 'డబుల్ రూమ్' కావాలన్నాను. చిల్లర అవసరం లేదన్నాను. ఒ.కె. అయిపోయింది."

"రసీదు ఏది?" అడిగాను. యిచ్చాడు.

పదకొండు రూపాయలకు రసీదు వుంది. అంటే తొమ్మిది రూపాయలు?

"అల్లుడూ! యాత్రకి వచ్చినపుడు యిలాంటి చిన్న చిన్న విషయాలు పట్టించుకోకూడదు. పద!" అన్నాడు హుషారుగా.

"ఎవర్నయినా 'కూలీ'ని పెట్టండి!" నిర్మొహమాటంగా చెప్పేసింది పార్వతి. కూలీని మావయ్య బేరమాడాడు.

"గరుడాద్రికి ఈ సామాన్లు జేర్చడానికి ఎంత తీసుకుంటావోయ్!" అన్నాడు డిగ్నిటీకి తక్కువ రానీకుండా.

"గరుడాద్రికి ఎడతారా అయ్యగారూ—ఈ సామాన్లన్ని జేర్పించాలండీ.... ఒకటి రెండు.... ఆరు మూర్తులండీ.... గదిలో పెట్టాలకదండయ్యగారూ. 'మూర్తికి' మూడు రూపాయలు రేటేనండీ. ఆపైన రెండ్రూపాయలు కాఫీకిప్పించండయ్యగారూ!" అన్నాడు.

అంతవరకూ కూలీ మాటలకి 'తాళం' వేసినట్లు తలూపు

తున్న మావయ్య తల హఠాత్తుగా ఆగిపోయింది. చూపు నిలబడింది.

"ఇరవై రూపాయిలా!" నోరు విప్పాడు ప్రయత్నం మీద.

"అవునండీ. యేం ఎక్కువడిగావండీ. మూర్తికి మూడు రూపాయిలు యిచ్చుకోనేరండీ" ఈసారి కూలీ దబాయించాడు.

మావయ్య మొహం పాలిపోయింది.

"ఇరవై రూపాయిలు కావాల్రా నీకు. ఇరవై రూపాయి లంటే ఎంతనుకుంటున్నావ్రా ఒక పోలీసు జీతంకంటే ఎక్కువ. ఒక ఎన్.జి.వో జీతం కంటే ఎక్కువ. స్కూలు మేస్టారు జీతంకంటే ఎక్కువ. ఆర్నీ ఆశకి అంతుం డొద్దురా!" ముక్కుమీద వ్రేలేసుకున్నాడు మావయ్య.

"ఆ కబుర్లన్ని ఎందుకండీ. మీ కిష్టమైతే ఒప్పుకోండి-లేకపోతే మీరే మోసుకెళ్ళిపోండి. ఎవరు కాదన్నారు?" అంటూ మా మాట వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు.

"ఏయ్ బాబూ! యిలారా!" మర్యాదగా పిలిచాడు ఓ కుర్రాడిని. ఆ కుర్రాడు కొంచెం బుద్ధిమంతుడిలాగే వున్నాడు.

"ఈ సామాన్లు—ఆరుసామాన్లు గరుడాద్రికి జేర్చాలి. ఎంత తీసుకుంటావు. న్యాయంగా చెప్పు—బేరం ఆడకుండా ఒప్పేసుకుంటాం!" అన్నాడు మావయ్య.

కాస్సేపు మంత్రం చదివినట్లు లెఖ్ఖలుగట్టి ఠక్కున "పాతిక రూపాయలు యిప్పించండి. అటుపైన మీ దయ!" అన్నాడు.

మావయ్య షాక్ లోనుంచి తేరుకోకముందే మొదటి కూలీని పిలిచాను. గరుడాద్రి మా రూమ్ నెంబరు

తొంభయ్‌లో అనుకున్న ప్రకారం సామాన్లు పెట్టాడు.

మావయ్య ఇరవై రూపాయలు యిచ్చి పంపించాడు.

మా వెనుకే ఒక అమ్మాయి వచ్చింది. ఎవరో బాగా వున్నవాళ్ళమ్మాయిలాగా వుంది. ఒంటినిండా నగలున్నాయి. మెడలో రాళ్ళనెక్లెసు పల్చటి చెయిను. లాకెట్. చెవులకి న్యూ మాడల్ టార్సు. వొదులుజడ. చాలా అందంగా వుందా అమ్మాయి' ఆమె రూమ్‌నెంబరు తొంభయ్ ఒకటిలో దిగింది.

"అల్లుడూ కొంప మునిగింది!" అన్నాడు మావయ్య.

"ఏవయ్యింది-ఏదయినా సామాను మాయమయ్యిందా?" అన్నాను కంగారుగా.

"నీళ్ళు రావడం లేదు. మనమే క్రిందకి వెళ్ళి స్నానం చేయుట, లేదా బకెట్‌లతో పైకి మోసుకొని వచ్చుట!" అంటూ వరండాలోకి వచ్చి నిలబడ్డాడు మావయ్య.

ఒక ముసలి వయసు ఆవిడ వచ్చింది. "మీకు నీళ్ళు కావాలా బాబూ. చన్నీళ్ళా, వేడినీళ్ళా?" అనడిగింది. వేడ్నీళ్ళనేసరికి మావయ్య ప్రాణం లేచొచ్చింది.

"యిక్కడ వేడ్నీళ్ళుకూడా దొరుకుతాయా. ఆహా, గోవిందా—ఒక రెండు బకెట్‌లు పట్రమ్మా" అన్నాడు.

"మీకు అయ్యగారూ!"

"రెండు బకెట్‌లు చల్లనీళ్ళు తీసుకురా" అన్నాను.

నీళ్ళు తీసుకొచ్చి అక్కడ పెట్టింది.

"డబ్బులు యివ్వండి బాబూ!" అంది మావయ్యని.

"ఎంత?"

"అయిదు రూపాయిలు."

"ఎందుకూ?"

"ఎందుకో చెప్పాలంటే నాకు సైసవుతుంది. రూపాయి



వేడ్నీళ్ళ బకెట్, రెండు బకెట్‌లు, రెండు రూపాయిలు, చన్నీళ్ళు అర్ధరూపాయి, రూపాయి అయింది. ఇల్లు ఊడ్చాను. రెండు రూపాయిలు. మీ సొమ్ము దోచుకు పోడానికి మేమేం కూర్చొని సంపాయిస్తున్నామనుకుంటు న్నారా? కట్టపడి బ్రతుకుతున్నామండీ!'' అంది.

మావయ్య బరువుగా అయిదురూపాయిల నోటు తీశాడు. గెద్ద తన్నుకెళ్ళిపోయినట్లు ఎత్తుకుపోయింది పనిమనిషి—

''పది నిముషాల్లో అయిదు రూపాయిలు సంపాదించింది అంటే, రోజుకి యాభయ్‌కి పైనే సంపాదించొచ్చు. అంటే—అమ్మో చాలామంది బ్రతుకులకంటే నయం. లెక్చరర్ జీతం, గెజిటెడ్ ఆఫీసరు జీతం, మెడికల్ ప్రాక్టీషనర్ జీతం, పోలీసు ఇన్స్‌పెక్టర్ జీతం'' ఆలోచనల్లో మునిగిపోయాడు.

''అబ్బా! మావయ్యా యిలాంటి యాత్రలకి వచ్చినపుడు చిన్నచిన్న విషయాలు పట్టించుకోకూడదు!'' అన్నాను.

మావయ్య మొహంలోకి బలంగా నవ్వు పులుము కున్నాడు.

2

"మీవారేం చేస్తుంటారండీ!" అంది ఆమె.

నేను నిద్రపోతున్నాను వాళ్ళ దృష్టిలో.

"ఆయన సినీఫీల్డులో వర్క్ చేస్తుంటారండీ!" అంది పారు.

సినీఫీల్డు అనగానే ఆమె ఎగిరి గంతేసినంత పనిచేసింది.

"సినీఫీల్డు అంటే - మీవారికీ, యాక్టర్స్‌కీ పరిచయం వుంటుందా!" అనడిగింది.

"ఆయన అసిస్టెంట్ డైరెక్టరు. అందులోనూ ఒక పెద్ద పేరున్న డైరెక్టరు దగ్గర. మావారు మూడు యన్.టీ. రామారావు పిక్చర్లు, రెండు నాగేశ్వర్రావు పిక్చర్లకూ పని చేశారు" అంది గొప్పగా.

"యన్.టి. రామారావు పిక్చర్‌కి మీవారు పనిచేశారా! అంటే ఆయన్ని చూసే వుంటారు. మాట్లాడే వుంటారు. అబ్బ....ఎంత అదృష్టవంతులండీ మీవారు. అలాంటి వ్యక్తిని భార్యగా పొందిన మీరు ఎంత అదృష్టవంతులండీ!" అంది పొగడుతూ.

పారుకి పొగడ్తలు గిట్టవు. ఇబ్బందిగా ఫీలయ్యింది.

"నాకు యన్. టి. రామారావు అంటే చచ్చేంత పిచ్చండీ బాబూ. నా చిన్నప్పటినుంచీ అంతే. ఆయన ఫైటింగ్స్ చేసినా, దేవుళ్ళ కేరక్టర్స్ వేసినా ఎంత రియలిస్టిక్‌గా వుంటాయండీ బాబూ! ఏవండేవండే—మద్రాసు ఎప్పుడయినా వస్తే మీరు యన్.టి.ఆర్‌ని చూపిస్తారా?" బ్రతిమాలింది.

"ఓ తప్పకుండా" అంది అభయహస్తం యిస్తూ.

"మీ అడ్రసివ్వండి!"

రాసి యిచ్చింది పారు.

భద్రంగా జాకెట్‌లో దాచుకుంది.

నన్ను యిద్దరూ పట్టించుకోలేదు.

"మీవారేం చేస్తుంటారండీ" ఈసారి ప్రశ్నించడం పారూ వంతయింది. ఆమె ధోరణి చూస్తే పెళ్ళి కానట్లుంది. పార్వతి అంత తెలివి తక్కువగా ప్రశ్నించదు. అంటే మెడలో నల్లపూసలయినా కనిపించి వుండాలి, లేదా కాళ్ళకు మట్టెలయినా వుండాలి—కొంచెం ప్రక్కకు వొత్తిగిల్లి చూశాను. ఆమె కాళ్ళకు మట్టెలున్నాయి.

"నేను చదువుకుంటున్నానండీ" అంది ఆమె.

"ఎక్కడ?"

"విశాఖపట్నంలో."

మావయ్య రియాక్టయ్యారు.

"ఏవిటమ్మాయ్. నీపేరు ఏవిటన్నావు—కమలా! మీది విశాఖపట్నమా? మాది కూడా విశాఖపట్నమే!" అన్నాడు మావయ్య పరిచయంగా చూస్తూ.

"మేం యల్లమ్మతోట దగ్గరంటున్నాం. నేను బి.యస్.సి బై. పి.సి. గ్రూపు ఫైనలియర్ చదువుతున్నాను. నాకు చిన్నవయసులోనే పెళ్ళయిందండీ పార్వతిగారూ కొన్ని చెప్పకూడని పరిస్థితులవలన ఆయన నేనూ వేరయ్యాం. నేను చదువు ముగించి ఏదయినా వుద్యోగం చూసుకుంటాను. నామీద ఆధారపడిన నాన్న చెల్లాయి, తమ్ముళ్ళు అంతా వున్నారు. వారికి నేనే అండగా వుంటాను. నాకు పెళ్ళిమీద ఆశలేదు. మావారు నేను కావాలనుకొని వస్తే ఆయన్ని పోషిస్తాను. లేదా నా కుటుంబాన్ని పోషించుకుంటాను!" అంది బాధగా.

"వజ్రంలాంటి మాటన్నావ్ అమ్మాయ్. ఏ తండ్రి కన్నాడోగాని మాణిక్యం లాంటి కూతుర్ని కన్నాడు. సరే గాని నువొక్కదానివే వచ్చావేంటమ్మా మీ నాన్నరాలేదా?"

"లేదండీ. మాకు ఫైనలియర్ పరీక్షలు. యింతకు ముందు టు ఇయర్స్ పరీక్షలముందు ప్రిపరేషన్ హాలీడేస్‌కి యిక్కడికే వచ్చాను. పాసయ్యాను క్లాసులో. ఈ సంవత్సరం అందుకే వచ్చాను. ఈ నెలాఖరు వరకూ వుంటాను" అంది సౌమ్యంగా.

"ఆహా! ఎంత మంచి నిర్ణయమమ్మా నీది! నాకూ డ్యూటీలో వుంటున్నపుడు శలవుపెట్టి వచ్చి యిక్కడ పది రోజులు వుండి, గోవింద లక్ష రాసి వెడదామనుకుంటుండే వాణ్ని. కుదిరి చస్తేగా—చాలా మంచిపని చేశావమ్మా!" అంటూ తెగమెచ్చుకున్నారు మావయ్య.

"రేపు ఉదయం దర్శనం చేసుకుంటారండీ మీరు?" అడిగింది కమల.

"లేదమ్మా. మధ్యాహ్నం. యిక్కడే రేపంతా వుంటాం యెల్లుండి ఉదయం మరోసారి దర్శనం చేసుకొని వెళతాం. యిదీ మా ప్రోగ్రాం. అవునూ ఆడపిల్లవి ఒంటరిగా నీ గదిలో ఎందుకూ - ఈ మధ్య పేపర్లో హత్యలూ, మాన భంగాలు. అమ్మో తలచుకుంటే నిద్ర పట్టదు. పార్వతి దగ్గర పడుకోమ్మా" అన్నాడు మావయ్య ప్రేమగా.

"ఎందుకులెండి నాన్నగారూ! నాకేం భయంలేదు. అన్నిటికీ ఆ ఏడుకొండలవాడే తోడు — యింతకు ముందు రెండుసార్లు వచ్చి వెళ్ళాను. నాకే ప్రమాదమూ జరగలేదు!" అంది కమల.

"నా కూతురులాంటి దానివి-పార్వతి పక్కన పడుకో. నేనూ అల్లుడూ బయటపడుకుంటాం!" అన్నాడు మావయ్య.

కమల, పార్వతి బాగా మాటల్లో పడిపోయారు. కావలించుకొని మరీ పడుకున్నారు.

3

"ఏవండీ!" నేను నిద్రలో త్రుళ్ళిపడి లేచేలా అరిచింది.

మావయ్యకూడా లేచారు. కంగారుగా కళ్ళద్దాలు పెట్టుకుని, "ఏమిటమ్మా—ఏం జరిగింది?" దగ్గరి కెళ్ళారు.

పార్వతి అప్పుడప్పుడు నిద్రలో అరుస్తుంటుంది. దయ్యాలు, భూతాలు వున్నాయి. అవి నీరసంగా వున్నపుడు తనను పట్టుకు పీడిస్తున్నాయి అనే నమ్మకం తనది.

"నాన్నా ఏవండి పిలుస్తే అలా చూస్తారేవిటి - రండి. కొంప మునిగిపోయింది" అది గుండె బాదుకొని. పారు మొహంలో యింత ఆతృత ఎప్పుడూ చూడలేదు.

"ఏం జరిగింది?"

"మన హుండీ పోయింది!" అంది. సూట్ కేసు తెరిచే వుంది. లోపల చెంబులో వున్నై వెయ్యిరూపాయలు. నేను మద్రాసులో బ్రతికి బాగుపడి సెటిలయితే వెయ్యిరూపాయిలు వేస్తామని మొక్కుకుంది తను. చాలా కష్టపడి సంపాదించిన డబ్బు అది. పదీ పాతిక వేసి వెయ్యి రూపాయిలు చేసింది అయిదువందల వరకూ. మిగతా అయిదువందలూ ఒకేసారి వేశాం.

కమల మాయమయ్యింది. బాత్రూం తలుపులు తెరిచే వున్నై. నాకు ఒళ్ళు జలదరించింది. అపాదమస్తకం కంపించిపోయాను. టైము రెండు గంటలయింది.

ఆమె కాటేజీ తాళం వేసివుంది. అంటే రూమ్ వెకేట్ చేసి వెళ్ళిపోయుంటుంది. తాళం ఒప్పగించినట్లయితే ఆ కౌంటర్ దగ్గర ఆమె ఎన్ని గంటలకి వెకేట్ చేసింది చెబుతారు కదూ — యిదంతా ప్లాన్ ప్రకారం చేసింది.

మావయ్య మీద పీకలవరకూ కోపం వచ్చింది. మావయ్య తప్పుచేసినవాడిలాగా తల దించుకున్నాడు.

"ఏమండీ. నాకెందుకో భయంగా వుందండీ. ఏ అరిష్టం పడుతుందో ఏమో. వెయ్యిరూపాయలు ఎప్పటినుంచి దాచిన డబ్బండీ. మన పెళ్ళయినప్పటినుంచీ దాచాను. దొంగ ముండ. బయటికి యెంత వినయంగా మాట్లాడింది?" తిట్టింది పారు.

మావయ్య గొంతు సవరించుకున్నాడు. "అసలు వీరినే నయవంచకులంటారు. ఇలాంటివారిని నమ్మకూడదు. ఆవిడతో కాలక్షేపం చేశావ్" చిరుకోపం ప్రదర్శించారు మావయ్య తెలివిగా ప్లేటు మారుస్తూ.

"అసలు యిదంతా నీ మూలంగా జరిగింది నాన్నా. మనం యింట్లో తలుపుతీసుకొని పడుకుంటే ఈ గ్రహచారం జరిగేదా. ఆడపిల్లవు మా పాపపక్కని పడుకోమ్మా అన్నావు. ఇప్పుడు వెయ్యిరూపాయలు గోవిందా!" నెత్తి మీద చేతులువేసుకుంది పార్వతి.

అయిదు నిమిషాలు నా మెదడు పనిచేయడం మానేసింది. భారంగా నిట్టూర్చి గుండె రాయి చేసుకున్నాను. ఒక నిర్ణయానికి వచ్చాను.

"మావయ్యా! నీ దగ్గర మనం తిరిగి వెళ్ళేందుకు చార్జీలకి డబ్బుందా?"

"వందరూపాయ లుంటాయేమో!" అనుమానంగా అన్నాడు.

"చూడండి. అనుమానం వద్దు. ఉంటే ఇలా ఇవ్వండి. ముందు అంతా స్నానంచేసి బయలుదేరండి. వెంటనే దేవుణ్ణి దర్శనం చేసుకుందాం" అన్నాను.

మావయ్య పక్కజేబుల్లోవున్న వందరూపాయలుతీసి నా

కిచ్చాడు. నేను స్నానంచేసి రెడీ అయిపోయాను. నేను కొత్తగా రాసిన సినిమా స్క్రిప్టు తీసుకున్నాను.

"నేను కాఫీ తాగి కాంటీన్ దగ్గర నిలబడతాను. అయిదు నిముషాల్లో మీరు రండి." అన్నాను. ఇద్దరూ తలూపేరు. టి.టి.డి. ఆఫీసుకేసి నడిచాను.

"గుడ్ మార్నింగ్ సర్!" అన్నాను. అక్కడున్నాయన కునికిపాట్లు పడుతూ తృళ్ళిపడి లేచాడు.

"ఏవిటండీ ఏం కావాలి. రూమ్ వెకేట్ చేస్తున్నారా?" అడిగాడు కంగారుగా.

"కాటేజీ నెంబరు 91లో పున్నామె పేరు 'కమల' కదూ" అడిగాను. రిజిస్టరు తిరగేసి చూశాడు పెదవ్విరిచాడు.

"కాటేజీ నెంబరు 91లో 'ప్రమీలారాణి' వుందండీ" అన్నాడు. అంటే పేరు మార్చుకుందన్నమాట.

"ఆమెకిచ్చిన నవతళ్ తాళం తాలూకు కీ మీదగ్గరొకటి వుంటుంది కదూ!"

నా మొహం పరీక్షగా చూశాడు.

"ఉంటుందండీ!"

"దాని నెంబరు చూడండి!"

"6372 నవతళ్" అన్నాడు. థాంక్స్ చెప్పి బయటికి నడిచాను. మావయ్య వారు ఎదురుచూస్తున్నారు.

4

రెండు గంటలకే క్యూ ఆరంభమయ్యిందట.

మేం వెళ్ళేసరికి మూడుగంటలు కావస్తోంది. అప్పుడే ఒక బాక్సు నిండిపోయింది. పార్వతి ఏడుపు మొహం పెట్టింది. మావయ్య కూడా అలాగే వున్నాడు. నా మెదడు చురుగ్గా పనిచేయసాగింది. కళ్ళముందు దేవుడు కనిపించడం

లేదు. కమల వేషంలో ప్రమీలారాణి కనిపిస్తూంది.

"ఇప్పుడెలా నాన్నా మొక్కు తీర్చకపోతే...."

"దొర్లి ప్రదక్షిణ చేసి—లెంపలు వేసుకొని—ఇంతకు రెండింతలు తీరుస్తామని మొక్కుకోవాలి!" అన్నాడు మావయ్య.

"అంటే గుడిచుట్టూ దొర్లుతూ తిరగాలా!"

"ఆ-నూటాఎనిమిది సార్లు తిరగాలి! యిది మోక్షానికి సాధనం. ఆరోగ్యానికి మంచిది."

"ఈలోగా చినుకులు పడితేనో" పారూ సందేహం.

"చినుకులా—దివిసీమ వరదలాంటిది వచ్చినా విర మించకూడదు. నియమం అంటే నియమమే!" అన్నాడు ఖచ్చితంగా.

"అయితే ఒకపని చేద్దాం. మనిద్దరం కలిసే ప్రదక్షిణ చేద్దాం. నాకిది అలవాటు లేనిపని!" అన్నాను. మావయ్య గొంతులో వెలక్కాయ పడినట్లు ఫీలయ్యాడు.

"ఊఁ హుఁ. అదీ. ఎవరు మొక్కుకుంటారో వారే చేయాలి!"

"ఆరోగ్యానికి మంచిది కదండీ!"

"నా ఆరోగ్యానికి యిప్పుడేం! నెంబర్ వన్. ఎక్సర్ సైజ్ బాడీ అల్లుడూ!" నువ్వు మొహంలో పులుముకున్నాడు. నాకు ఒళ్ళు మండింది. తనదాకా వస్తేనేగాని యెదుటివారి కష్టం తెలీదు.

"అసలు యింటిదగ్గర బయలుదేరినపుడు దరిద్రపు పిల్లి శకునం వచ్చింది. కాస్సేపు ఆగుదామండీ అంటే సెంటి మెంట్లూ నువ్వూ అంటూ నా మీద విరుచుకుపడ్డారు. ఇపుడు చూడండి!" ఎత్తిపొడిచింది నన్ను.

"నువ్వు ముందు నోర్మూయ్. నేను చెప్పింది చెయ్.

అందాకా దేవుణ్ణి క్షమాపణలు వేడుకో నా తరపున. మళ్ళీ సంవత్సరం నేను డైరెక్టరయితే మూడువేలు వేస్తానని మొక్కుకో! అనవసరంగా లేనిపోని అనుమానాలు పెట్టి నన్ను యిరికించకు" అన్నాను.

ఎవరో ఒక అబ్బాయి సప్తగిరి పుస్తకాలు తీసుకొచ్చాడు. వాడి చెవిలో నాక్కావలసింది చెప్పేను. అతగాడి చేతికి ఓ కవరు యిచ్చాను. అయిదు నిముషాల్లో తిరిగి వచ్చాడు. నా చేతిలో అయిదురూపాయిలుంచాడు. తిరిగి అతడికే యిచ్చాను.

"పారూ! మీరు యిక్కడే వుండండి. ఆ బాక్సులో కెడతాను. మావయ్యా మీరు పారు దగ్గర వుండండి! నేను పిలిచినపుడు పారూని పంపించండి!" అని చెప్పి ముందు బాక్సులోకి నడిచాను. అక్కడెవరో అడ్డంగా నుంచున్నారు. అలా ఒక బాక్సులో నుండి మరో బాక్సులోకి మారడానికి వీల్లేదన్నాడు. పదిరూపాయలు కావాలన్నాడు పెర్మిషను కోసం. వాడి మొహంమీద విసిరేను.

5

"సిస్టర్! మీరు హిందూ టెంపిల్స్‌లోకి రావడం, దేవుణ్ణి పూజించడం చేస్తారా?" అన్నాను. సిస్టర్ నవ్వింది. పదిమంది గుంపు ఆంధ్రా నుండి వచ్చారు.

"హిందూ, క్రైస్తవులనే భేదం ఏవుంది బ్రదర్. అంతా ఒకటే కదా! బట్ మాకు దేవుడిమీద నమ్మకం లేదు. సమ్‌థింగ్ 'థ్రిల్' వుందంటారు తిరుమల గుడిలో. అది చూడాలని వచ్చాం. మీ దేవుడు చెప్పిందీ, మా దేవుడు చెప్పిందీ ఒకటే-విశ్వాసం. ఫెయిత్ ఈజ్ గాడ్" అంది చిరునవ్వు నవ్వి.

"మీరు ఎక్కడ్నుంచి వచ్చారు?" ఎదురుప్రశ్న వేసింది

సిస్టర్.

"నేను పాలకొల్లునుండి వచ్చానండీ!"

"ఏం చేస్తుంటారు?"

"ఏదో వ్యవసాయం చేస్తుంటాను! మీరేం చేస్తుటారు!"

"భీముని పట్నంలో సెంట్ ఎంతోనీలో టీచర్ని-వీరంతా మా స్టాఫర్స్."

'క్యూ' కదిలింది. ముందు సిస్టర్స్ అంతా నడుస్తున్నారు. నేనూ ఫాలో అయ్యాను. మావయ్య, పారూ నన్ను రెప్పార్పకుండా చూస్తున్నారు.

"మీరెక్కువ తెలుగు సినిమాలు చూస్తుంటారా? నికలస్ గారూ!" అన్నాను.

ఆమె షాక్ తింది. "నా పేరు మీ కెలా తెలుసు?" అనడిగింది. నవ్వాను.

"మీ వ్యానిటీ బ్యాగ్ మీద లెటరింగ్ మరిచిపోయారా?" గుర్తుచేశాను. చిలిపిగా నాలుక్కరుచుకుంది.

గర్భగుడిలోకి ప్రవేశించాం. మా ఆవిడ దూరాన్నుండి కారాలు మిరియాలు నూరుతూంది. "ఈయన సినిమా బుద్ధులు పోనిచ్చుకోరు నాన్నా! దేవుడి గుడిలో కొచ్చాక ఏవిటా కబుర్లు. అందులో క్రిస్టియన్ లేడీతో-ఛీఛీ! అసలు ఈ ప్రయాణం శుద్ధ దండగ!" చిరాకుపడింది. సాధ్యమయినంత వరకు ముందున్న వారినందర్నీ తోసుకు వచ్చేశారు మావయ్య పార్వతి. కొంచెం దూరంలో వున్నారు. వారి ముందు యెవరో గడుసు ఆడవాళ్ళు తయారయి అడుగు ముందుకి వెయ్యనివ్వలేదు.

"రామూ! కొంచెం ఆగకూడదు! గర్భగుడిలోకి ఇద్దరూ వెళ్ళి" అంటుండగా నా కళ్ళు చూసి బిక్కమంటూ ఆగి



పోయాడు. పారూ కూడా నన్ను చూసి అసహనంగా తల దించుకుంది.

దర్శనం పూర్తయింది; మెడపెట్టి గెంటినట్లు గెంటారు. వందలు, వేలూ ఖర్చుచేసి వచ్చిన యాత్రికులని నిముషం కూడా దర్శనం చేసుకోనివ్వకపోవడం అక్కడి పూజారుల హోమ్‌గార్డ్స్ ప్రత్యేకత.

నికలస్ సిస్టర్ వడివడిగా నడవసాగింది. నేనూ అనుసరించాను. నా కాలు ఆమె కాలుమీద పడింది.

"వాటీజ్ దిస్!" కోపంగా చూసింది. నా చేతులు ఆమె చెయ్యి పట్టుకున్నై.

"యూ ఇడియట్!" అంటూ చెయ్యి ఎత్తబోయింది. అలాగే పట్టుకున్నాను రెండో చేతిని.

"యు డర్టీ రోగ్ గివ్ దిస్!" వ్యానిటీ బ్యాగ్ లాగాను. రిజర్వు పోలీసు మమ్మల్ని గమనించి దగ్గరికి వచ్చాడు.

"ఏవిటండీ ఆడపిల్లని బలవంతంగా...."

"వాడెవడో రౌడీ వెధవ క్యూలో నుంచున్నప్పటి నుంచీ బాతాఖానికి తగిలాడు. ఆ మాటా ఈ మాటా ఆడి ప్రక్కకి చేరాడు. రోమియో రాస్కెల్!" అంది కసిగా చూస్తూ.

ఇంతలో ట్రస్ట్ వాళ్ళు వచ్చారు. కొంతమంది భక్తులు చుట్టుముట్టారు. సిస్టర్స్ ఈ గొడవ పట్టించుకోకుండా వెళ్ళిపోయారు.

"నికలస్! పిలువ్ మీ సిస్టర్స్‌ని. రంగు తేలుస్తాను!" అని నేనే పిలిచాను.

అందులో ఒక ముసలామె యింగ్లీషులో యెందుకు అని అడిగింది.

"మీరు ఎక్కడ్నుంచి వచ్చారు?"

"ఆంధ్రా."

"ఈవిడ మీకు తెలుసా?"

"మాకూ ఈవిడికీ సంబంధం లేదు!" అంటూ తిరిగి నా ప్రశ్నకోసం చూడకుండా వెళ్ళిపోయింది. 'మిరాశీదార్' వచ్చాడు.

"ఏవిటయ్యా యిది. ఏవంటావు! ఎందుకీ అమ్మాయిని పట్టుకున్నావు. పవిత్రమయిన ఆలయంలో ఇలా దౌర్జన్యం చేయొచ్చా!" పెద్దమనిషిలాగా అడిగాడు బొజ్జ సవరించుకొని.

"ఆమె పేరు ప్రస్తుతానికి నికలస్. నిన్న రాత్రి మాతో చెప్పిన పేరు కమల. అంతకుముందు సాయంత్రం గరుడాద్రిలో కాటేజీ నెంబరు 91 తీసుకున్నపుడు టి.టి.డి. రిజర్వేషన్ కౌంటర్‌లో నవతాళ్ కీ 6372 తీసుకున్నపుడు చెప్పిన పేరు ప్రమీలారాణి. రాత్రంతా మా ఆవిడతో పిచ్చాపాటీ కబుర్లు చెప్పింది. మా మావయ్యగారు పాపం భోలా

పడిపోయి ఆడపిల్ల కదా అని తోడుగా నా భార్య వుంటుం దని యింట్లో పడుకోమన్నారు ఏం పారూ!" అన్నాను.

పార్వతి పరీక్షగా ఆమె మొహంలోకి చూసి, చివాల్న ఏదో గుర్తుకొచ్చి కాలిమెట్టెల వంక చూసింది. నాగసర్పం మట్టెలున్నై.

"అవునండీ. ఈమే నిన్న మాట్లాడింది!" అంది అరుస్తూ. మావయ్య నోరావులించాడు.

"నో....నో....నాకేం తెలీదు. నేను సెంట్ ఎంతోనీతో టీచర్‌ని" అంది.

ఆమె కళ్ళల్లో నీరు తిరుగుతున్నై. అర్థం కానట్లు చూశాడు మిరాసీదార్.

"ఆమె మాతోబాటు నిన్న రాత్రి వుండి దేవుడి హుండీలో వేయాలనుకున్న వెయ్యిరూపాయిల్ని మాయం చేసింది!" అన్నాను.

"వెయ్యిరూపాయలా! మీరెవర్ని చూసి ఎవరనుకుంటు న్నారు. నా పేరు నికలస్. నిన్న సాయంత్రం వచ్చాను. 'వెంకటాద్రి'లో కాటేజీ నెంబరు సెవెంటీ టూ లో వున్నాను. ఈ డబ్బు సంగతి నాకు తెలీదు!" అంది.

మిరాసీదార్ వెంటనే వెంకటాద్రి కౌంటర్‌కి ఫోన్‌చేసి కాటేజీ నెంబరు 72లో ఎవరున్నట్లు ఎంక్వయిరీ చేశాడు. 'నికలస్' అని సమాధానం వచ్చింది.

నన్ను ముద్దాయిని చూసినట్టు చూశాడు.

"భలేవాడివయ్యా నీ పెళ్ళాం కూడా నీకు తాళం వేస్తుందే. చదువుకున్నవాడిలాగా కనిపిస్తున్నావ్? ఇదేవిటి. ఆడపిల్లల్ని యిలా అల్లరి చేయొచ్చా?" నిలదీసి అడిగాడు.

"ఆ అమ్మాయి వెయ్యిరూపాయలు దొంగతనం చేసినట్టు నిరూపించకపోయావో నిన్ను ఉతికేస్తాం. అందులోనూ

ఒక క్రిస్టియన్ యువతి. అభ్యుదయ భావాలతో హిందూ టెంపిల్లోకి వస్తే గౌరవించాలి గానీ యిలా అవమాన పరుస్తారా! చెప్పు! ఏ బేసిస్ మీద అనుమానించావు. సరిగ్గా చెప్పకపోయావో ఆ దేవుడక్కర్లేదు. మేమే వేస్తాం సరైన శిక్ష!" మిరాశీదార్ ఆయాసపడుతూ మందలించాడు.

"గుడ్! ఆమె కాళ్ళకు నాగసర్పాలున్న మట్టెలున్నై క్రిస్టియన్సు పెట్టుకుంటారా? అడగండి!" అన్నాను.

"ఇది నేను పెళ్ళిచేసుకున్నప్పుడు పెట్టుకున్నాను తర్వాత 'మతం' తీసుకున్నాను. మార్చలేదు. ఇది నేను చేసిన నేరమా?" ఎదురుప్రశ్న వేసింది. అంతా తలూపేరు ఇది తప్పా! అన్నట్లు—

"ఆమెకి యిష్టదైవం ఏసుప్రభువుకాదు యన్. టి. రామారావు! కావలిస్తే ఆయన ఫోటో అయిదురూపాయ లిచ్చి కొనుక్కుంది చూడండి!" అన్నాను.

ఆమె గతుక్కుమంది. మిరాశీదార్ 'బాగ్' తెరిచాడు. యన్.టి.ఆర్. ఫోటో వుంది. కంగుతిన్నాడా పెద్దమనిషి.

"ఏమిటమ్మా ఈ పైత్యం. సినిమానటుల్ని పూజిస్తావా!" అడిగాడు మిరాశీ.

"లేదండీ! ఇక్కడే దేవస్థానం అబ్బాయి అమ్ముతూ వుంటే తీసుకున్నాను. ఆయన పురాణపాత్రలు వేస్తుంటాడు. నాకు ఆయనలో రాముడు, కృష్ణుడు తప్ప మరొకరు కనిపించరు. ఇది నిజం. నన్ను నమ్మండి!" దీనంగా అందరికేసి చూసింది.

"ఆమె బ్యాగులో నవతాళ్ 6372 నెంబరు 'తాళం' వుంటుంది చూడండి. గరుడాద్రిలో కాటేజి తీసుకుంది. ఆ రూమ్ వెకేట్ చేసినట్టు యింకా రిపోర్టు చేరలేదు. తాళం వేసి భద్రంగా తాళంచెవి మాత్రం బాగ్‌లో దాచుకుంది."

బ్యాగ్ తెరిచారు. తాళంచెవి కనిపించింది. నెంబరు చూశారు. 6372_ అంతా తెల్లబోయారు. 'మోలీ' చూస్తు నట్లు చూడసాగారు.

"లేదు. ఇందులో ఏదో మోసంవుంది. నా తాళంచెవి తీసి చెవిలో దురదపెడుతుంటే గోక్కున్నాను. అపుడు నెంబరుచూసి వుంటాడు" అంది టక్కున. అందరూ నా మొహం చూశారు.

"కరెక్ట్! ఆమె తాళంచెవి తీసి చెవిలో పెట్టుకోనూ లేదు. నేను చూడనూలేదు. మిమ్మల్ని నమ్మించడానికి చేసే ప్రయత్నం యిది. సరే తాళంచెవి నెంబర్ తెలుసు. కాటేజ్ నెంబరు నాకెలా తెలుస్తుంది. గరుడాద్రి '91'కి ఫోన్‌చేసి కనుక్కోండి. 90లో నేనున్నాను. ఆమెపేరు ప్రమీలా రాణి అని చెప్పేను. కనుక్కున్నారు. కరెక్టేనని తేలింది.

"చాలా! ఇంకేవయినా ఆధారాలు కావాలా! అవసర మయితే వెంకటాద్రి 72కి వెడదాం పదండి" అన్నాను.

నికలస్ భోరున ఏడ్చింది. పొరపాటయి పోయింది. "నేను యం. బి. బి. యస్. చదువుతున్నాను. నాకు డబ్బు లేదు. కళ్ళెదుట వెయ్యిరూపాయలు కనిపిస్తుంటే నిగ్ర హించుకోలేక పోయాను!" అంది నికలస్ కమ్ కపల.

"సరే! ఇలా నిగ్రహించుకోలేని పరిస్థితుల్లో యెంత దోచుకున్నావో మాకు చూపించు! పద!" అంటూ వెంక టాద్రికి నడిచాం.

రూమ్ తెరిచాం. రూమ్‌నిండా ఫర్నిచరువుంది. నాలు గయిదు సూట్‌కేసులున్నాయి. చిన్నబ్రీఫ్ కేసుంది. బ్రీఫ్ కేసులో నగలున్నాయి. సూట్‌కేస్‌లో క్యాష్ వుంది. దాదాపు యాభయ్‌వేల రూపాయిలుంటాయి. కొన్ని హుండీల పళంగా వున్నాయి. వాటిలో మా హుండీకూడా

వుంది. మిరాశీదార్ గుండె బాదుకున్నాడు.

టి. టి. డి. పోలీస్‌స్టేషను ముందు నుంచోబెట్టాం.

అంతే! నన్ను క్రయిం సినిమాలో హీరోని చూసినట్టు చూడసాగారు. పబ్లిక్ ఎనౌన్స్‌మెంట్ చేయసాగారు. "ఎవరి సామాను పోయినా, ఎవరి డబ్బు పోయినా, ఎవరి హుండీలు పోయినా తగిన ఆధారాలతోవస్తే యిక్కడ వున్న వాటిలో మీ బంగారు, డబ్బు, హుండీలు నిజంగా వున్నట్లయితే దేవస్థానం మిరాశీదార్ సముఖంలో యిప్పించడం జరుగుతుంది" అని చెబుతున్నారు. ఆమెను అంతా తలో తిట్టు తిట్టసాగారు.

"దొంగ రాస్కెల్!"

"ఆడదికాదు గాడిద!"

"అందులోనూ దేవుడు సొమ్ము అపహరించడమా!" తలోవిధంగా తిట్టారు.

"మీరెవరోగాని చాలా చాకచక్యంతో వ్యవహరించి, మీ హుండీలో డబ్బు తిరిగి పొందడమేగాకుండా ఎంతమందినో ఆపదలో వున్నవారిని కాపాడినవా రయ్యారు. థాంక్యూ వెరీమచ్!" అన్నాడు మిరాశీదార్. డబ్బు తీసుకున్నాను.

"థాంక్యూ సర్! మా పోలీసు డిపార్టుమెంట్‌కి చాలా రోజులుగా హెడ్‌ఏక్‌గా వుంది ప్రమీలారాణి చేష్టలు—తెలివిగా యింతకాలం భక్తుల్ని దోచుకుంది. రోజుకో వేషం వేసి పోలీసుల కళ్ళు, దేవుడి కళ్ళు, ప్రజలకళ్ళు కప్పింది. మీరు పట్టి మాకు ఒప్పగించినందుకు చాలా సంతోషంగా వుంది. మీలాంటి యువకులు సమాజానికి అవసరం!" భుజాలు చరుస్తూ అభినందించాడు పోలీసు ఇన్‌స్పెక్టర్.

అక్కణ్ణించి శలవు తీసుకుని గరుడాద్రికేసి కదిలాం.

6

"అమ్మమ్మ .... ఎలా కనిపెట్టావయ్యా బాబూ! ఆ అమ్మాయిని. అవును. నిన్న పాపతో ఆ అమ్మాయి మాట్లాడుతుండగా నువు నిద్రపోతున్నావుకదా — కాలి మట్టెలు ఎలా గుర్తుపట్టావు?" మావయ్య సందేహం.

"ఇలాంటి ప్రాంతాలకు వచ్చినపుడు తెలివిగా వ్యవహరించడం మంచిది. కమల, పారూ మాట్లాడుకుంటున్న మాటలన్నీ విన్నాను. అప్పుడే ఆమె గురించి తెలుసుకున్నాను!" అన్నాను.

"అదిసరే—ఆమె వేషం మార్చిందిగదా? ఆమె కమల అని ఎలా గుర్తుపట్టావ్?" మావయ్య ధర్మసందేహం.

"పుస్తకాలమ్మే అబ్బాయి రాలేదూ. అతనిచేతికి ఎన్. టి. ఆర్. ఫోటోలిచ్చి పంపించాను. డెఫినెట్‌గా ఆమె తీసుకుంటుందని నా అనుమానం. ఆమె బెదురుచూపులూ ముందువెనుకలు గమనించడం చూశాక ఆ అబ్బాయిని పంపించాను. ఫోటో చూడగానే—తీసుకుంది. ఆమె దగ్గరికి వెళ్ళినపుడు ముందు గమనించింది ఆమె కాలిమట్టెలు. తరువాత అబ్జర్వ్‌చేసింది ఆమె గొంతు."

"ఎంతయినా నా అల్లుడి వనిపించావయ్యా! ఇప్పుడంటే వయసు అయిపోయింది. బ్రెయిను పనిచేయడం మానేసింది గాని, యింతకుముందు నీలాగే ఎంత చురుగ్గా పనిచేసే వాడ్నని—" తనను తను పొగుడుకున్నారు మావయ్య.

"అందుకేగా నలభయ్యేళ్ళ సర్వీసులో హెడ్‌కానిస్టేబుల్ అయింది. మీతో వారంతా ఇన్‌స్పెక్టరాఫ్ పోలీస్‌గా రిటయర్ అయితే—" అన్నాను.

జోకు అర్థమయినట్టు గలగలా నవ్వేశాడు మావయ్య. □

ముక్కల గాలి

ఎమ్. శిరీష



బార్ సందడిగా వుంది. తినేవాళ్ళూ తాగేవాళ్ళూ కేరిం తలు కొడుతున్నారు. బార్ చుట్టూ అద్దాల తలుపులు. రోడ్డుమీద వచ్చేపోయేజనం—వాహనాలు.

రాబర్ట్ అద్దాల్లోంచి రోడ్డుమీదకు చూశాడు.

అతడికళ్ళు తళుక్కుమన్నాయి.

జనం రద్దీలో అతడు తోసుకుంటూ నడుస్తున్నాడు. భారీగావున్న మనిషిని సమీపించాడు. భారీమనిషి ప్రక్కగా నడవసాగాడు. భారీమనిషి ప్రక్కజేబులున్న సిల్కుకమీజు వేసుకున్నాడు. గ్లాస్కోపంచె కట్టుకున్నాడు.

తోసుకుంటూ నడుస్తోన్న మనిషి అతడిజేబులో చెయ్యి పెట్టాడు. మరుక్షణంలో మనీపర్సు గాల్లో కనిపించి మాయమైంది.

ఎప్పటిలాగానే అతడు రద్దీలో పారిపోసాగాడు.

రాబర్ట్ నవ్వుకున్నాడు.

పర్సు వుబ్బెత్తుగా వుంది. బాగానే డబ్బువుండి వుంటుంది.

భారీమనిషి నిశ్చింతగా నడుస్తోన్నాడు. పర్సు తీయవల్సి వచ్చినపుడుకాని అతడికి దాని విషయం గుర్తురాదు.

రాబర్ట్ గ్లాసు అందుకున్నాడు. ఖాళీగావుంది. గ్లాసును చటుక్కున టేబులుమీద కొట్టి లేవబోయాడు.

"కూర్చో మిస్టర్ రాబర్ట్!"

రాబర్ట్ అతడివైపు చూశాడు. అతడికి నలభయ్యేళ్ళు వయసుంటుంది. నున్నగా గీచిన గడ్డం, జేగురు రంగు కళ్ళు, కొంటెరు ముక్కు .... అతడివొంటిన మాసిన సిల్కుచొక్కా, ఎం. ఎస్. 55 షరాయి వున్నాయి.

"నాపేరు అలీ!" అన్నాడతడు కుర్చీ లాక్కుంటూ.

"నాతో నీకేం పని?" అన్నాడు రాబర్ట్.

"కంపెనీ యివ్వు భాయి! తెల్లగుర్రం విస్కీ...." అతడు విస్కీబాటిలు బల్లమీద పెట్టాడు.

"నేను నీకు ఎలా తెలుసు?"

అలీ నవ్వాడు. బాటిలు మూతవిప్పాడు. రెండు గ్లాసులలో ద్రవం నింపాడు.

"మూడురోజుల క్రితం నువు మార్వాడీషాపులో నగలు ఎత్తుకుపోయావు." అతడు ఒకగ్లాసును రాబర్ట్‌వైపు జరి పాడు.

"నేనా? అబద్ధం!" రాబర్ట్ నిస్సత్తువగా కూలబడ్డాడు.

"తాళాలు పగల కొట్టావు. సేఫ్ బద్దలుకొట్టావు. ఆ రకంగా తాళాలు పగలకొట్ట గలవాడివి నువ్వే!"

"నువు నన్ను కాచివడబోసినట్టు మాట్లాడుతున్నావే!"

"పోలీసులకు యింకా నువ్వని తోచలేదు."

"పోనీ నువు చెప్పు!"

"చెప్పేవాడినే; నీతో నాకు పనిబడింది."

రాబర్ట్ గ్లాసు అందుకున్నాడు.

ఇద్దరూ ఛీర్స్ చెప్పుకున్నారు. గ్లాసులు ఖాళీఅయ్యాయి.

"నాతో పనేమిటి?"

"మైసూర్ రాష్ట్రంలో కోలార్ గనులున్నాయి తెల్సా?"

"బంగారు గనులా?"

"అవును."

"గనుల్లో దొంగతనం చేయాలా? మెకన్నాస్ గోల్డు" రాబర్ట్ నవ్వాడు.

"గనుల్లోకాదు....కోలార్ అవతల పచ్చలూర్ వుంది. అది కొండలమీద గ్రామం...."

"పచ్చలూర్....పచ్చలుంటాయా ఆ వూళ్ళో...."

"పచ్చలు....వజ్రాలు....కెంపులు .... పుష్యరాగాలు.... గోమేధికాలు... ఒకటేమిటి? ఆ వూర్లో కోట్లరూపాయలు విలువచేసే దుకాణాలు పదివరకూ వున్నాయి."

"పోలీసులు...."

"ఒక హెడ్‌కానిస్టేబులూ....ఇద్దరు కానిస్టేబుల్సూ...."

"అంతేనా?"

"అవును. రెండువేల పైచిలుకు జనాభా...."

"దొంగలుపడితే వాళ్ళు ఏమూలా?"

"పైగా వాళ్ళుముగ్గురు మందుభాయిలూ .... మగువ భాయిలూ...."

"వెరిగుడ్....చెప్పు. ఇంటరెస్ట్‌గా వుంది...." సీసా వొంపాడు రాబర్ట్.

రెండో రౌండ్ ముగిసింది.

చిప్స్ అయిపోవచ్చాయి.

వెయిటర్ కట్‌లెట్స్ తెచ్చిపెట్టాడు.

"రైట్. పచ్చలూర్‌కి పోలీసు రక్షణలేదు."

"అవును. వాళ్ళను మనం త్రాగించవచ్చును."

"మరి షాపులకు రక్షణ ఏమిటి? ఎలక్ట్రిక్ అలారం ఏర్పాటు వుందా?"

ఆలీ పకపక నవ్వాడు. "ఆ వూరికి కరెంటు రాలేదు భాయీ!"

"కరెంటు లేకపోతే సమస్యేలేదు."

ఆలీ సీసా ఖాళీచేసాడు.

"కరెంటు లేదుగానీ, కుక్కలున్నాయి. పచ్చలూర్ నిండా వూరకుక్కలు!"

"వూరకుక్కలా? అవి అంతమంచి కాపలాకుక్కలు కావు!"

"నిజమే కావచ్చు. ఆ వూరకుక్కలకో ప్రత్యేకత వుంది."

"వూరకుక్కలకు ప్రత్యేకతా?"

"అవును. అవి రాత్రంతా మొరుగుతూనే వుంటాయి".

"గ్రామస్తులు నిద్రపోరా?"

"ఎందుకు నిద్రపోరు? అలవాటు పడిపోయారు."

"అయితే కొత్తగా వెళ్ళినవాళ్ళకు నిద్రపట్టిచావదు."

"అవును పచ్చలూర్ విహారయాత్రా స్థలం. అయినప్పటికీ చీకటిపడితే అక్కడ ఎవరూ వుండరు!"

"కుక్కలు అంత గోలపెడతాయా?"

"గోల అనక! హోరు. గుండెజబ్బు మనిషివుంటే చీకటిలో ఒక గంటకూడా వుండలేడు."

"కొత్తవాళ్ళను కరుస్తాయా?"

"మొరిగేకుక్కలు కరవ్వు."

"నువు వెళ్ళొచ్చావా?"

"ఎన్నోసార్లు!"

బీర్‌సీసాలూ, ఐస్ క్యూబ్స్ తెచ్చిపెట్టాడు వెయిటర్.

"అయితే ఎప్పుడు ప్రయాణం?" అడిగాడు రాబర్ట్.

"రేపు. ఇక్కడినుండి మద్రాసు. తర్వాత బెంగుళూర్ .... బెంగుళూరు వెళ్ళాక కోలార్‌వెళ్ళే మార్గం చూద్దాం."

"రైట్!"

టప్ టప్!

బీర్‌సీసాలు పొంగిపొర్లాయి. గ్లాసులో ఐస్‌క్యూబ్స్....

ఇద్దరూ గట గట త్రాగసాగారు.

2

విశాలమైన కొండమీద పరచుకుని వుంది పచ్చలూర్.

ఎటుచూసినా పచ్చటిమొక్కలూ, అడవితీగెలూ, కొండవాలులో పండే అనాసపళ్ళూ, ఆవుసంపెంగ చెట్లూ, సమతలంలో సాగయ్యే వరిపంటా, ఎక్కడినుండో ప్రవహించే జలధారలూ, కొండమీదనుండి దూరంగా కనిపిస్తోన్న కోలార్ గనిప్రాంతమూ, నలుచదరంగా కత్తిరించినట్టు ఆకుమడులూ....

"ఓహ్ ఎంత అందమైన ప్రాంతం!" పరవశంగా అన్నాడు రాబర్ట్.

"అటు ప్రకృతి సంపదా, యిటు అమూల్యమయిన రాళ్ళూ, లోహాలూ పచ్చలూర్‌కి పెట్టని ఆభరణాలు. కుక్కలు లేకపోతే యిక్కడే వుండిపోయేవాడిని!" ఆలీ అన్నాడు.

ఇద్దరూ వాలులోంచి నడచి కొండయెక్కారు.

గ్రామంలో అడుగుపెట్టారు. వరుసలు తీర్చిదిద్దినట్లు పెంకుటిళ్లూ....వాటినిదాటాక తాటాకు యిళ్ళూ....తాటాకు యిళ్ళకు యివతలగా మరోవరసలో అంగడివీధి....ఆ వీధిలో ఒకే మోస్తరు షాపింగ్‌భవనా లున్నాయి. అన్ని స్లాబ్ వేసిన యిళ్ళు.

ఆ యిళ్ళమీద సైన్‌బోర్డులు.

బంగారప్ప జువెలర్స్, పచ్చలూర్.

కన్నప్ప గోల్డుమర్చంట్స్, పచ్చలూర్.

బోర్డులు చదువుకుంటూ ఒక షాపుముందు ఆగారు.

శంకరప్ప గోల్డు అండ్ జువెలరీమార్ట్.

తింటున్నాయి.

"కుక్కలలో ఎంత క్రమశిక్షణ!" ఆశ్చర్యపోయాడు రాబర్ట్.

ఆలీ లోయలోకి దిగసాగాడు. రాబర్ట్ అతడిని అనుసరించాడు.

"శంకరప్ప కొట్టులో పాతిక ముప్ఫయికోట్ల రూపాయల విలువయిన సరుకు వుంటుంది!"

"అయితే మన టార్గెట్ శంకరప్ప కొట్టే."

"అవును. ఈ రాత్రే! టూరిస్టులు కూడా ఎక్కువమంది లేరు."

"ఎంతమంది వుంటే ఏం? చీకటిపడితే ఒక్కడు మిగలడు. పచ్చలూర్ జనాభా రాత్రివేళల్లో నిలడకగా వుంటుంది."

"వూరకుక్కలకు ఆహారం తీసుకువద్దాం!"

"నేను తెచ్చాను. కుక్క బిస్కట్లు."

"వెరీగుడ్!"

"కాంటీన్‌కి వెళ్దాం!"

"పద."

3

అమావాస్య చీకటి.

రాబర్ట్ అడుగులో అడుగు వేసి నడవసాగాడు. ఆలీ రెండోదారిన ముందే శంకరప్ప కొట్టువద్దకు చేరుకుని వుంటాడు.

వాచీ చూసుకున్నాడు రాబర్ట్.

రాత్రి 11 గంటలు దాటుతోంది.

ఎవరో చనిపోయినట్టుగా వూరకుక్కలు మొరుగుతున్నాయి. ఒక్కొక్క వీధిలో కుక్కలు ఒక్కొక్కసారి మొరుగుతున్నాయి. ఒక వీధిలోని కుక్కలు అరిచి ఆగిపోయాక ఆ అరపును ప్రక్కవీధి కుక్కలు అంది పుచ్చుకుంటున్నాయి.

చెవులు పగిలేలాగా,

గుండెలు పగిలేలాగా కుక్కలు ఒకటే మొరుగుతోన్నాయి. రాబర్ట్‌కి పిచ్చెక్కుతోంది. సాయంత్రం 6-30 నుండి అవి సైరన్స్ మోగినట్టుగా ఒకటే గోల! చెవులు హోరెత్తిపోతున్నాయి.

రాబర్ట్ తన చెవుల్లో దూది వుండలు కుక్కుకున్నాడు. అంగడి వీధిలోకి చకచక నడవసాగాడు.

చాలా కుక్కలు అతడిని చూస్తున్నాయి. అతడు బిస్కట్లు విసురుతూ నడుస్తున్నాడు. అంగడి వీధిలోకి మరలాడు రాబర్ట్.

"హూష్...."

రాబర్ట్ అటు చూశాడు.

చీకట్లో ఆలీ!

"కుక్కలు బిస్కట్లు తిన్నాయా?" అడిగాడు ఆలీ.

"లేదు తినడం లేదు. మొరుగుతోనే వున్నాయి. మన

విషయం అవి పట్టించుకోవటం లేదు.''

''పోలీసులకు త్రాగించావా?''

''అవసరం లేకపోయింది. కొండక్రింద ఏదో పని పడిందట వాళ్ళకు!''

''పచ్చలూర్ అంతా నిర్మానుష్యం అన్నట్టు.... ఈ కుక్కల గోలలో ఇక్కడివాళ్ళు ఎంత నిశ్చింతగా నిద్ర పోతున్నారో....'' ఆశ్చర్యపోయాడు రాబర్ట్.

రాబర్ట్ శంకరప్ప కొట్టు సమీపించాడు.

స్టీల్ షట్టర్‌కి వున్న తాళం కప్పతో కుస్తీపట్టాడు. తాళం తెరచుకుంది.

షట్టర్ ఎత్తాడు. లోపలకు నడిచాడు. ఆలీ అతడిని అనుసరించాడు.

ఇద్దరూ సేఫ్టీవాల్వ్ ముందున్నారు.

క్షణాలలో వాల్వ్ తెరిచాడు రాబర్ట్.

ఆ వీధి కుక్కలు అరవడంలేదు. ప్రక్క వీధులలోని కుక్కలు మొరుగుతూనే వున్నాయి.

చీకట్లో కూడా విలువైన రాళ్లు తళతళలాడుతున్నాయి.

''అబ్బ! ఎంత ఆస్తి!'' ఆలీ మాట నోట్లోనే వుండి పోయింది.

రోడ్డుమీద అలజడి.

సినిమా వదలినట్టుగా జనం రోడ్డుమీద పరుగెత్తుకు వస్తున్నారు. శంకరప్ప కొట్టుచుట్టూ మూగారు వాళ్లు. దూరంగా కుక్కల మొరుగుడు వినిపిస్తూంది.

''అరె! ఈ వీధిలోని కుక్కల మొరుగుడు ఏది?''

''ఆశ్చర్యం! వాటి మొరుగుడు ఆగిపోయింది. జనం లేచారు.''

"మన వీధి కుక్కలు మాత్రమే మొరగడం మానే శాయి."

"కరెక్ట్! అదే సిగ్నల్ అయివుండాలి. ఎక్కడ దొంగలు పడితే అక్కడ కుక్కలు మొరగవ్" రాబర్ట్ చెమటలు క్రక్కాడు.

"కొంప మునిగింది. పచ్చలూరు ప్రజలకు అదే పిగ్నల్. మన ప్రాంతంలో కుక్కలు మొరిగితే ప్రమాదం వున్నట్టు! ఇక్కడ మొరిగే కుక్కలు మానేస్తే ప్రమాదం సిగ్నల్."

వాళ్ళ మాటలు పూర్తి కాలేదు. జనం షాపులో జొర బడ్డారు.

చీకట్లో కొరివిదయ్యాల్లాగా ఉన్నారు ఆలీ, రాబర్ట్‌లు. △

సైలెంట్ బెడ్!

"డబుల్‌రూం తీసుకున్నారేం సార్! మీరు ఒక్కరే కదా వచ్చారు!" అడిగాడు బేరర్.

"రెండో బెడ్ నిశ్శబ్దంగా వుంటే చూచి ఆనం దించాలని!"

—ఎమ్.ఎస్. దేవి, విశాఖపట్నం.

ఫారిన్ బొమ్మ

జొన్నలగడ్డ రామలక్ష్మి

సీనూకి వాళ్ళ మావయ్య ఫారిన్‌నుంచి వస్తూ ఓ రబ్బరు బొమ్మ తీసుకొచ్చాడు. ఏ కాగితం మీదనైనా పెన్సిల్‌తో కానీ, సిరాతోకానీ, ఆఖరికి బాల్‌పెన్నుతో కానీ రాసిన అక్షరాలమీద ఆ రబ్బరు బొమ్మను ఒక్క నిముషంసేపు వుంచి తీసేస్తే ఆ అక్షరాలు మాయమైపోతాయి. కాగితం ఎప్పటి

లాగే శుభ్రంగా వుంటుంది.ఎటొచ్చీ కాగితం మీది అక్షరాలు మరీ పాతపడిపోకూడదు.

మామయ్య సీనూకి ఇందులోని తమాషా ఏమిటో కూడా క్లుప్తంగా వివరించాడు.

ప్రపంచం మొత్తం ఆకర్షణశక్తి మీద నడుస్తోంది. అనంత విశ్వంలో ఇన్ని గోళాలు పరిమిత పరిధుల్లో వుండ దానికి కారణం పరస్పరాకర్షణ శక్తి. భూమికి వున్న ఆకర్షణ శక్తివల్లనే పైకి ఎగురవేసిన ప్రతి వస్తువూ తిరిగి క్రింద పడుతోంది. కాగితంమీద అక్షరాలు నిలబడడానికి కూడా కారణం కాగితం సిరాను ఆకర్షణశక్తితో తనకు అంటిపెట్టుకునేలా చేయడం. ఈ రబ్బరుబొమ్మ అడుగున వున్న ఓ పదార్థం ఆ ఆకర్షణ శక్తికి మించిన శక్తితో సిరాను తనవైపుకు లాక్కోగలదు. అందువల్ల సిరా పొడి పొడిగా బొమ్మకు అతుక్కుని పోతుంది. నీటితో కడిగితే ఆ అక్షరాలు బొమ్మనుంచి కూడా పోతాయి.

కాగితాన్నీ, అక్షరాలనూ బంధించే శక్తి మొదట్లో కాస్త బలహీనంగా వుంటుంది. కొన్నిరోజులు గడిచాక ఆ రెంటికీ మధ్య రియాక్షన్‌కూడా ప్రారంభమై—రెంటి బంధమూ మరింత బలపడుతుంది. అందుకే బొమ్మ కొన్ని రోజుల తర్వాత రాసిన అక్షరాలను తనవైపు లాక్కోలేదు.

మామయ్య ఇదంతా చెప్పి — "నీకు అర్థం కావడం కోసం విషయం నేను క్లుప్తంగా చెప్పాను. అసలు విషయం మరీ యింత సింపుల్ కాదు. పెద్దయ్యాక నీకు ఇంకా బాగా అర్థమవుతుంది. ఇప్పటి కీమాత్రం తెలిస్తే చాలు" అన్నాడు.

సీనూ వయసు పదకొండు. ఏడవ తరగతి చదువు

తున్నాడు. వాడికిది చాలా ఉత్సాహాన్ని కలిగించింది. వాడు కాగితాలమీద ఏవేవో రాసి దానిమీద బొమ్మను కాసేపుంచి తీసేసేవాడు. అక్షరాలు మాయమైపోతే అమితంగా ఆశ్చర్య పడేవాడు. అవే అక్షరాలు తిరగబడి బొమ్మ అడుగున వుండేవి. బొమ్మలో ఇంకో విశేషమేమిటంటే అక్షరాలున్న చోటుకూడా మళ్ళీ అక్షరాల్ని ఆకర్షించేవి. కార్బన్ కాగితం మీద రాసినచోట మళ్ళీ రాసినా పనిచేసినట్లు!

సీనూ పెన్సిల్ ఉపయోగించాడు. పెన్నుపయోగించాడు. బాల్ పెన్నుపయోగించాడు. ఒక పూటపూటంతా ఈ ప్రయోగా లన్నీ చేసి బొమ్మగురించి ఎన్నో తెలుసుకున్నాడు వాడు. బొమ్మ అడుగున వున్న అక్షరాలు నీళ్ళతో కడిగితే సుల భంగా పోయేవి.

సీనూకో పెద్ద సందేహం వచ్చింది — "కాగితంకంటే అక్షరాల ఆకర్షణ రబ్బరు బొమ్మకే ఎక్కువగదా — మరి కాగితంమీది అక్షరాలు కడిగితే పోవు. బొమ్మమీది అక్షరాలు కడిగితే పోతున్నాయి."

మామయ్యది విని—"రబ్బరు బొమ్మను నీళ్ళతో కడిగినా ఏమీ కాదు. కానీ కాగితాన్ని కడిగితే ఏమవుతుంది? కాగితం స్వభావం వేరు. రబ్బరు స్వభావం వేరు. నీటి విషయంలో రెంటినీ పోల్చడానికి వీలుపడదు" అన్నాడు.

సీనూకి తనలో తను ఆడుకోడం అయిపోయింది. ఆ తర్వాత వాడు ఇంట్లో వాళ్ళందరికీ మ్యాజిక్ పేరు చెప్పి ఆ బొమ్మతో ప్రదర్శనలివ్వసాగాడు. ఎవరెవరు ఏ పనుల్లో వున్నారూ అన్నదాంతో వాడికి నిమిత్తంలేదు. అన్నం వార్చుకుంటున్నప్పుడు తల్లినీ, భగవద్గీత మననం చేసుకుం టున్నప్పుడు తాతయ్యనూ, స్నానానికి వెడుతూంటే పిన్నినీ- ఇలా అందరినీ పట్టుకుని వాడు ప్రదర్శనాలివ్వసాగాడు.

కొంతసేపు అందరూ ఓపికగానే భరించారు. కాసేపయ్యే సరికి అంతా ఎంతగా విసిగిపొయ్యారంటే — "నువ్వు మాజిక్ చేస్తేచెయ్యి. కానీ మమ్మల్ని చూడమన్నావంటే మాత్రం తంతాం" అనేశారు.

సీనూకి ఏం చేయాలో తోచలేదు. మామయ్య వాడిదగ్గర కొచ్చి—"ఒరేయ్-నీ యీడు పిల్లలతో నువ్వాడుకోవాలి గానీ—ఇలా అన్నింటికీ ఇంట్లో పెద్దాళ్ళని కాలిస్తే ఎలా? నీకు బొమ్మ తెచ్చినందుకు ఇంటిల్లపాదీ నన్ను తిడుతున్నారు. ఇలా చేశావంటే ఇంకెప్పుడూ నీకేమీ తేను" అనేశాడు.

ఈ మాటలు సీనూ మీద పనిచేశాయి. వాళ్ళుండే వీధిలో వాడీడు పిల్లలు ఇద్దరు మాత్రమే వున్నారు. మిగతావాళ్ళు మరీ చిన్నవాళ్ళు. వాళ్ళంటే సీనూకి చిరాకు. మరీ పెద్ద వాళ్ళు కొందరున్నారు. వాళ్ళంటే సీనూకి భయం. ఆ వీధిలోని ఆ యిద్దరు తన ఈడు పిల్లలన్నా సీనూ కాట్టే ఇష్టముండదు. వాళ్ళకు చదువు తప్ప ఆటలమీద ధ్యాస వుండదు. పైగా ప్రతిదానికీ వాళ్ళకి ఆశ్చర్యమే! బంతి చూపించి "చూడు - ఇది ఎలా తూలుతోందో" అంటే "అవును-ఎలా తూలుతోందో" అని ఆశ్చర్యపోతూంటారు. వాళ్ళకీ బొమ్మ చూపించడం శుద్ధ దండగ!

అయినప్పటికీ సీనూ వేరే దారిలేక వాళ్ళనే పిలిచి బొమ్మతో ప్రదర్శన ఇచ్చాడు. వాళ్ళు ఎప్పటిలాగే ఆశ్చర పోయారు తప్పితే కళ్ళలో కుతూహలం కనబడలేదు. సీనూ అదెలా పనిచేస్తుందీ వివరించి చెప్పాడు. దానికీ ఆశ్చర్య పోయారు వాళ్ళు. సీనూ బొమ్మతో మరిరెండు ప్రదర్శన లిచ్చి "మీకూ ఇలా చేయాలని వుందా?" అన్నాడు.

"చేయాలనే వుంది కానీ - ఇంటిదగ్గర చేయాల్సిన

లెక్కలింకా యాభై వుండిపోయాయి. ఏమీ అనుకోకు—ఇంకో రోజు వస్తాం" అని వెళ్ళిపోయారు రమణ, రంగారావు—అక్కడికి సీనూకేదో నష్టం కలిగినట్లు!

"వెధవల్ని-అనవసరంగా పిలిచాను...." అనుకున్నాడు సీనూ. వాడి ఉత్సాహమంతా చచ్చిపోయింది. వాడికింక వున్నదల్లా ఒక్కటే ఆశ. స్కూలు!

ప్రస్తుతం స్కూలు సెలవులు. నాలుగురోజుల్లో తీస్తారు. ఇంత కాలం సెలవులై పోతాయేమోనని బెంగపెట్టుకున్నాడు సీనూ. కానీ వాడికిప్పుడు స్కూలెప్పుడు తీస్తారా అని ఆత్రుతగా వుంది. ఆ నాలుగురోజులూ వాడు ముళ్ళ మీద వున్నట్లున్నాడు. క్షణం యుగంలా గడిచింది వాడికి.

2

ఎలాగైతేనేం స్కూలు తెరిచారు.

సీనూ ఉత్సాహంగా బడికి పెందరాళే వెళ్ళాడు. కానీ ఆరోజు బడికి చాలామంది లేటుగా వచ్చారు. ఇంటర్వెల్ వరకూ సీనూకి ఎవరితో మాట్లాడడానికి కుదరలేదు. అప్పుడు వాడు తన బొమ్మను తీసి అందరిముందూ ప్రదర్శించాడు. వెంటనే జనం వాడి చుట్టూ మూగారు.

సీనూ ఉత్సాహానికి అంతులేదు. వాడుత్సాహంగా వరుసగా ప్రదర్శనలివ్వడమే కాక తన స్నేహితులైన చంద్రశేఖరం,కిషోర్,మోహన్‌లనుకూడా ప్రదర్శనలివ్వనిచ్చాడు.

వాడి క్లాసులో అందర్నీ ఆ బొమ్మ ఆకర్షించింది. చాలా మంది సీనూతో స్నేహానికి సిద్ధపడ్డారు. అంతకాలం సీనూతో గొడవపడే కిట్టూగాడు కూడా పాత గొడవలన్నీ మరిచిపోదామనీ తనను స్నేహితుడిగా చేసుకోమనీ ప్రాధేయపడ్డాడు.

ఇప్పుడు సీనూకీ, వాడి మిత్రబృందానికీ కూడా గర్వం పెరిగింది. వాళ్లు పదిమంది జట్టుగా ఏర్పడ్డారు. మిగతా వాళ్ళని వాళ్ళు తమ పక్షంలో చేర్చుకోలేదు. వాళ్ళంతా ఒక చోట కట్టుగా కూర్చుని క్లాసులో పాఠం అవుతున్నా కూడా నోట్సు రాస్తూ బొమ్మతో చెరిపేస్తూ ఆడుకోసాగారు.

చంద్రం మేష్టారు పాఠం చెబుతూండగా ఓ పిలకమనిషి బొమ్మగీసి క్రింద లెక్కలమేష్టారు అని రాశాడు. అది నలుగురికీ చూపించాడు. అంతా నవ్వుకున్నారు. ఆ శబ్దం కాస్త ఎక్కువే అయింది. దాంతో మేష్టారులిక్కిపడి "ఏమటా గొడవ!" అని అరిచాడు. అంతా గప్‌చిప్ అయి పోయారు.

"ఎవరూ మాట్లాడరేం?" మేష్టారు మళ్ళీ గద్దించాడు.

కిట్టూగాడు చంద్రానికి వెనుకనే కూర్చున్నాడు. తనకా బొమ్మ దొరకలేదని వాడికి మహాకోపంగా వుంది. వెంటనే వాడు లేచి నిలబడి "చంద్రం ఓ పిలకమనిషి బొమ్మగీసి దాని కింద మీ పేరు రాశాడు సార్!" అన్నాడు.

చంద్రం వణికిపోయాడు. మేష్టారు వాడివంక తీవ్రంగా చూసి "నిజమేనా?" అనడిగాడు.

చంద్రం లేచి నిలబడ్డాడు. మేష్టారు వాణ్ణి సమీపించి వాడి నోట్సు లాక్కున్నాడు.

అయితే అప్పటికే సీనూ తన రబ్బరు బొమ్మ నుపయోగించి చంద్రం వేసిన బొమ్మను చెరిపేశాడు. అందువల్ల మేష్టారికక్కడింకేమీ కనబడలేదు. ఆయన కిట్టూవంక కోపంగా చూసి "అబద్ధం చెప్పావు కదూ?" అన్నాడు.

"లేదుసార్! నేను నిజంగానే చూసింది చెప్పాను...." అన్నాడు కిట్టు.

మేష్టారు ఆ వరుసలో అందరి నోట్సూ ఒకసారి చెకప్ చేసి "మీలో ఎవ్వరూ సరిగ్గా నోట్సు తీసుకోవడంలేదు. కాబట్టి నిలబడి మరీ నోట్సు తీసుకోండి" అన్నాడు. ఆ క్లాసులో సీనూ బృందానికి అల్లరిచేయడానికి కుదరలేదు.

క్లాసు అయిపోయాక కిట్టూ సీనూ దగ్గరికి వచ్చి "నువ్వు నీ బొమ్మతో ఆ బొమ్మ చెరిపేశావని నాకు తెలుసు. కానీ బొమ్మ గురించి లెక్కల మేష్టారుకి చెప్పలేదు. ఎందుకో తెలుసా?" అన్నాడు.

"అవును. అదే నాకూ ఆశ్చర్యంగా వుంది. ఎందుకు చెప్పలేదు?" అన్నాడు సీనూ.

"మేష్టారుకి బొమ్మ గురించి తెలిసిపోతే ఇకముందు ఇలాంటి వినోదానికి ఆస్కారముండదు. క్లాసు జరుగుతూండగా మనకు తోచిన పిచ్చిరాతలు రాసుకుని నవ్వుకోవచ్చు. చుక్కలాట ఆడుకోవచ్చు. మేష్టారుకి అనుమానం కలిగితే బొమ్మతో చెరిపేయొచ్చు. అందుకే నేనిది మేష్టారికి చెప్పలేదు. నన్ను నీతోపాటు చేర్చుకోవూ?" అన్నాడు కిట్టూ.

సీనూ కాస్త మెత్తబడ్డాడు కానీ చంద్రం దీనికి ఒప్పుకోలేదు. వాడు పాతపగలన్నీ గుర్తుచేసి సీనూని ఆవేశపరిచాడు. ఫలితంగా కిట్టూ కోరిక ఫలించలేదు.

ఆ తర్వాత రెండుమూడు రోజులు ఆ బొమ్మతో సీనూ బృందం బాగా వినోదించారు.

సీనూ అల్లరిపిల్లాడు కాదు. సాధారణంగా క్లాసులో మొదటిబెంచీ మీద, తప్పితే రెండో బెంచీమీద కూర్చునేవాడు. ఈ బొమ్మ వచ్చినప్పట్నించీ వాడి స్థానం మారింది. అల్లరి పెరిగింది. క్లాసులో పాఠాలు వినడం బొత్తిగా మానేశాడు. అదేం చిత్రమో వాళ్ళకి బొమ్మతో ఆడుకోవ

డానికి క్లాసులు జరిగే సమయంలోనే బాగుంటోంది. ఉత్తప్పుడు వాళ్ళకా సరదాయే ఉండేదికాదు. బొమ్మ వచ్చినప్పట్నించీ స్కూలుగానీ, క్లాసుగానీ మానాలని వాళ్ళకు అనిపించడంలేదు.

3

సీనూ బొమ్మ తెచ్చిన నాలుగవ రోజున ఇంటర్వల్ సమయంలో క్లాసులో కుస్తీపట్లు ప్రారంభమయ్యాయి. అప్పుడప్పుడిది మామూలే! ఇద్దరు కుర్రాళ్లు కుస్తీపడుతూంటే మిగతా అందరూ వినోదంగా చూసేవారు. సీనూ కూడా ఆ రోజున అలాగే చేస్తుండగా హఠాత్తుగా గమనించాడు తన బొమ్మ మాయమయిందని.

వాడు కంగారుగా తన మిత్రబృందాన్నడిగాడు బొమ్మ గురించి. ఎవ్వరూ తమకు తెలియదంటే తమకు తెలియదని అన్నారు. సీనూ బొమ్మగురించి గోలపెట్టసాగాడు.

కుస్తీపోటీ ఆగిపోయింది. అంతా కంగారుగా నమ్మకం కోసం తమ జేబులుతీసి చూపించారు. చంద్రం గబగబా అక్కడున్న విద్యార్థుల పేర్లన్నీ నోట్ చేశాడు.

"కుస్తీ ప్రారంభం కాకముందు బొమ్మ నా దగ్గరే వుంది. కాబట్టి ఇక్కడున్నవాళ్ళలోనే యెవరో ఈ బొమ్మ తీసివుండాలి. మర్యాదగా నా బొమ్మ నాకిచ్చేయండి" అన్నాడు సీనూ.

సీనూ అనుమానం కిట్టూ మీదకు పోయింది. కానీ కిట్టూ అందరికంటే ముందే తన జేబులు, పుస్తకాలసంచీ అన్నీ తీసి చూపించాడు. బొమ్మ పోవడం వాడికీ ఆశ్చర్యంగానే వుంది. అంతా క్లాసురూం వెతకసాగారు. అంతా క్షుణ్ణంగా వెతికినా ఎక్కడా బొమ్మ జాడలేదు. సీనూకి ఏడుపు వచ్చేయబోయింది.

"ఆ బొమ్మ నా ప్రాణంరా-ఎవరు తీశారో చెప్పండిరా-వాళ్ళకి దణ్ణం పెడతాన్రా!" అన్నాడు సీను.

సీనూ ముఖం చూస్తే చాలామందికి జాలివేసింది. వాడితోపాటు మరో యిద్దరు కుర్రాళ్ళు కూడా ఏడ్చేశారు. కానీ ఎవ్వరూ ఆ బొమ్మ యివ్వలేదు. మళ్ళీ మళ్ళీ వెతికినా అది కనబడలేదు.

మధ్యాహ్నం క్లాసుకి టీచరు రాగానే సీనూ తరఫున చంద్రం జరిగిందాయనకు చెప్పాడు. టీచర్ క్లాసులోని కుర్రాళ్ళందర్నీ చెక్ చేశాడు. మాటలగారడీ చేశాడు. కానీ ఫలితం కనబడలేదు. ఆయన కూడా తన సానుభూతి సీనూకి తెలియజేసి ఊరుకున్నాడు.

సాయంత్రం గడిచినా బొమ్మ జాడలేదు. సీను హతాశుడై ఇల్లు చేరుకున్నాడు. ఏం జరిగిందని ఇంటిల్లపాదీ అడిగారు—వాడి దిగులు ముఖం చూసి. జరిగింది వాడి నోటినుంచి విన్నాక అంతా తలోమాటా అన్నారు. అది స్కూలుకు తీసుకుపోవడం తప్పనీ, తీసుకువెళ్ళినా ఆ బొమ్మను చూసి మరీ అంతలా ఆడిపోకూడదనీ కొందరన్నారు.

"అసలిలా ఓ రోజున జరుగుతుందని నాకు ముందే తెలుసు" అన్నాడు సీనూ పెద్దన్న.

"తెలిసుంటే ఇప్పుడు చెప్పడమెందుకు? ముందుగా చెబితే జాగ్రత్తపడి వుండేవాణ్ణిగదా!" అన్నాడు సీనూ ఉక్రోషంగా. వాడికి మళ్ళీ ఏడుపు వస్తోంది.

అంతా వాణ్ని తలోమాటా అంటూంటే తల్లి వాణ్ని దగ్గరగా తీసుకుని—"అసలే బొమ్మపోయి వాడేడుస్తూంటే మీరంతా ఏమిటీ మధ్య! చేతనైతే ఆ బొమ్మ ఎలా మళ్ళీ సంపాదించాలో ఉపాయం చెప్పండి. బొమ్మ పారేసుకోవడం

వాడికి మాత్రం సరదాయా ఏమన్నానా?" అంది.

తల్లి అలా చేరదీసేసరికి సీనూకి ఏడుపు వచ్చేసింది. వాడు బ్యారుమని ఏడ్చేశాడు. అప్పుడు తల్లితోపాటు అంతా కూడా వాడిమీద జాలిపడ్డారు. కానీ బొమ్మ తిరిగి సంపాదించే ఉపాయం మాత్రం చెప్పలేకపోయారు.

"సమయానికి మీ మామయ్యిక్కడ లేడు. వాడు మళ్ళీ రేపొస్తాడు. వాడు నీకు మంచి ఉపాయం చెబుతాడులే. వీళ్ళెవరూ అంత తెలివైన వాళ్ళు కారు" అంది తల్లి.

ఆ రాత్రంతా సీనూకి సరిగ్గా నిద్రపట్టలేదు. అప్పుడప్పుడు కునుకుపడితే అందులో బొమ్మ దొరికినట్లు కలవచ్చింది. అది మళ్ళీ ఇంకెవరో కొట్టేయడానికి ప్రయత్నిస్తున్నారుట. నిజానికి ఆ బొమ్మ కిట్టూగాడే తీసేట్ట. ఏదో పనిమీద వాడింటికి వెడితే చంద్రం చూశాట్ట. దెబ్బలాడి వాడి పెద్దాళ్ళకు చెప్పి చంద్రం ఆ బొమ్మ మళ్ళీ సీనూకి వచ్చేలా చేశాడు.

సీనూ చంద్రాన్ని ఎంతగానో మెచ్చుకున్నాడు.

ఆ బొమ్మ మళ్ళీ కొట్టేయాలని కిట్టూగాడు ఓరోజు కత్తి పట్టుకుని దారికాశాడు. సీనూకి ముచ్చెమటలుపోశాయి. అప్పుడే వాడికి మెలకువరాగా—"అమ్మయ్య ఇది కలేనన్న మాట!" అనుకున్నాడు. ముందు వాడి మనసు తేలికపడింది. కానీ తర్వాతబొమ్మ దొరకడం కూడా కలేనని గ్రహించాక వాడికి మళ్ళీ ఏడుపు వచ్చేసింది. అయినా ఆపుకుని చటుక్కున లేచి గదిలో దీపం వేశాడు.

గదిలో దీపం వెలగగానే వాడి బామ్మ — "ఒరేయ్ అబ్బిగా—దీపమెందుకు వేశావూ?" అంది.

"టైము చూస్తున్నాను బామ్మా!" అన్నాడు సీనూ. గోడగడియారం సరిగ్గా అప్పుడే ఠంగుఠంగుమని నాలుగు

గంటలు కొట్టింది. సీనూ లైటు ఆర్పేసి మళ్ళీ మంచంమీద పడుకున్నాడు.

"ఇప్పుడు టైమెందుకురా చూడ్డం!" అంది బామ్మ ఆవులిస్తూ.

"నా బొమ్మ దొరికినట్లు కలొచ్చింది బామ్మా! తెల్లవారు ఝామున వచ్చిన కలలు నిజమవుతాయంటారు గదా— అందుకని టైముచూశాను. బామ్మా — టైము నాలుగైతే అది తెల్లవారుఝాముకిందే వస్తుందా?" అనడిగాడు సీనూ.

"పిచ్చివెధవకానా!" అని నెమ్మదిగా జాలిగా గొణుక్కుని—"నాలుగంటే తెల్లవారుఝామే!" అని చెప్పింది బామ్మ.

ఆ మాటలు సీనూ హృదయాన్నెంతగా తేలికపరిచాయంటే ఆ తర్వాత వాడు ఏడింటికే నిద్రలేచాడు. అదీ తల్లి వచ్చి లేపాక!

తన కల సంగతి చంద్రానికి చెప్పాలని సీనూ తాపత్రయ పడిపోతున్నాడు. చంద్రంవల్ల — కిట్టూగాడినుంచి తన బొమ్మ దొరుకుతుందని వాడికి నమ్మకం ఏర్పడింది. కల రావడంలోనూ కిట్టూగాడే దొంగ అన్న వాడి అనుమానం బలపడింది.

సీనూ స్కూలుకు వెళ్ళి చంద్రానికి తన కల సంగతి చెప్పుకున్నాడు. చంద్రం అంతా విని ఉత్సాహంగా— "అయితే నేను వాడింటికి వెళ్ళి బొమ్మను పట్టేస్తాను. తెల్లవారుఝామున వచ్చిన కలలు నిజమవుతాయని మా బామ్మ అంటుంది" అన్నాడు.

కిట్టూ సీనూని ఒంటరిగా కలుసుకోవాలని ఎదురుచూస్తున్నాడు. వాళ్ళిద్దరూ గుసగుసలాడుకోవడం వాడికి తెలుస్తోంది. అంతేకాదు — వాళ్ళనే శ్రద్ధగా పరిశీలిస్తున్న

మూలాన వాడికి చూచాయగా వాళ్ళ సంభాషణా సారాంశమూ తెలుస్తోంది. చంద్రం ఒక్క-క్షణం కనుమరుగైతే చాలునని చూస్తున్నాడు వాడు. అలాంటి అవకాశం మొదటి పీరియడ్ అయినాక వచ్చింది వాడికి. చంద్రం పాస్‌కు వెళ్ళాడు.

కిట్టూ చటుక్కున సీనూని సమీపించి—"నువ్వు గుడ్డిగా చంద్రాన్ని నమ్ముతున్నావు. వాడే నీ బొమ్మ తీశాడని నా అనుమానం. నిన్న వాడి లెక్కల టెక్స్టు పుస్తకంలో ముప్ఫయ్యారో పేజీలో ఆరో లైన తర్వాత వచ్చిన కాళీలో చంద్రంగాడు దొంగవెధవ అనిరాశాను. వాడి దగ్గర బొమ్మ వుంటే అక్షరాలీపాటికి చెరిపేసుకుని వుండాలి. చూస్తే నీకే తెలుస్తుంది" అన్నాడు.

సీనూ ఆత్రుతగా చంద్రం బల్లమీంచి లెక్కలపుస్తకం తీసి చూశాడు. ముప్ఫైయ్యారో పేజీలో ఎక్కడా సిరాతో వ్రాసిన జాడలేదు. "ఇంకేం—వాడే ఆ బొమ్మ తీశాడు. సందేహం లేదు" అని కిట్టూ వెళ్ళి తన సీట్లో కూర్చున్నాడు.

సీనూకి మతిపోయినట్లయింది. తను ఎంతగానో నమ్మిన చంద్రం తన్ను మోసగించాడా? రానీ—చెబుతాను వాడి పని-అనుకున్నాడు సీనూ. అయితే చంద్రం టీచరు ఒక్కసారే క్లాసులోకి వచ్చారు.

సైన్సు టీచరు చాలా స్ట్రిక్టు. ఆయన క్లాసులో సూది పడితే వినపడటంత నిశ్శబ్దం కావాలి. చిన్న గుసగుస వినబడితే చాలు "సైలెన్స్!" అని స్కూలంతా అదిరిపోయేలా అరుస్తాడాయన.

ఈ సంగతి తెలిసి అంతా ఆయన క్లాసులో నిశ్శబ్దంగా వుంటారు. కానీ ఈరోజు సీనూ చంద్రాన్ని పలకరించకుండా వుండలేకపోయాడు. వాణ్ణి మోసగు చేసిన నమ్మక

ద్రోహానికి నానా తిట్లూ తిట్టాలని వుంది సీనూకి. అందుకనీ చంద్రాన్ని గోకి ఏవేవో మాట్లాడాలని ప్రయత్నించసాగాడు. వాడు చంద్రంతో ఇంకా మాట్లాడకుండానే "సైలెన్స్!" అని అరిచాడు సైన్సు టీచర్.

నేనూ కొద్ది నిముషాలు మాత్రమే నిగ్రహించుకోగలిగాడు. వాడు మళ్ళీ ఏదో మాట్లాడబోతే "హుష్!" అన్నాడు చంద్రం.

"సైలెన్స్!" గట్టిగా అరిచాడు సైన్సు టీచర్.

అలా రెండుమూడు సార్లు జరిగేసరికి సైన్సుటీచర్ సహనం నశించింది. ఆయన సీనూని లేచి నిలబడమన్నాడు. సీనూతో పాటు చంద్రం కూడా లేచి నిలబడుతున్నాడు.

"నువ్వెందుకు లేచావ్?" గద్దించాడాయన.

"నేనే సీనూని పలకరించానండి. తప్పు నాదండి" అన్నాడు చంద్రం.

"ఇద్దరూ క్లాసులోంచి బైటకు పొండి!" అన్నాడు టీచర్. తన హెచ్చరికలను వరుసగా లెక్కచేయనందుకు ఆయనకు వాళ్ళమీద చాలా కోపం వచ్చింది.

సీనూ ఆశ్చర్యపడ్డాడు. క్లాసులోంచి బయటకు వచ్చేసేక వాడు "నేను నిన్ను పలకరిస్తే నువ్వే నన్ను పలకరించానన్నావెందుకు? అది నిజం కాదుగదా!" అన్నాడు.

"నువ్వు నాతో ఏదో మాట్లాడాలని ఆత్రుతపడుతున్నావు. అసలే నువ్వు బొమ్మ పోగొట్టుకుని విచారంలో వున్నావు! ఒక్కడివీ బైటకు పోతే మరింత దుఃఖపడతావని అనిపించింది నాకు. నీకు తోడుగా రావడంకోసం అలాగన్నాను. మన స్నేహం ఏనాటికీ ఆదర్శంగా వుండాలికదా! ఇంతకీ నువ్వు నాకు చెప్పాలనుకుంటున్నదేమిటి? బొమ్మగురించి కొత్త ఆచూకీ ఏమైనా తెలిసిందా?" అన్నాడు చంద్రం.



సీనూ ఆవేశమంతా కరిగిపోయింది. చంద్రం ఎంత మంచి స్నేహితుడు? వాణ్నెలా అనుమానించేది? కానీ నిజం తెలిశాక వాడికి చెప్పకుండా ఎలా? కాసేపు తటపటాయించినా చివరికి కిట్టూ ఆరోపణ చెప్పేశాడు సీనూ.

అది వింటూనే చంద్రం గ్రమాన్పడిపోయాడు. ఏం మాట్లాడాలో వాడికి తోచలేదు. చాలాసేపు ఆలోచించి— "కిట్టూ నీకు అబద్ధం చెప్పాడు. నా పుస్తకంలో వాడేమీ రాయలేదు. అక్షరాలు మాయం చేయడానికి నా దగ్గర బొమ్మెక్కడిది?" అన్నాడు.

"వాడబద్ధ మెందుకు చెబుతున్నాడంటావ్?" అన్నాడు సీనూ.

"మనిద్దరి స్నేహం చూసి వాడు కుళ్ళిపోతున్నాడు. ఏదో విధంగా మనిద్దర్నీ విడదీయాలనుకుంటున్నాడు. అదీ కాక బొమ్మ వాడే తీసి వుంటాడు. మనిద్దరం స్నేహంగా వుంటే వాడి దొంగతనం బైటపడుతుందని భయపడి ముందు మనిద్దరికీ చెడగొట్టేయాలనుకున్నాడు. వాడి

ఆటలు మనం సాగనివ్వకూడదు" అన్నాడు చంద్రం.

సీనూకి ఎవరిమాటలు నమ్మాలో అర్థం కాలేదు. కిట్టూ చెప్పినపుడు వాడు ఆ మాటలు నిజంగానే నమ్మాడు. చంద్రం కనబడితే వెంటనే వాణ్ని ఏకి పారేయాలనుకున్నాడు. అయిదే వాడు తనకోసం నింద తనమీద వేసుకుని క్లాసులోంచి బైటకు వచ్చేయడంలో సీనూ ఆవేశం చచ్చిపోయింది. తర్వాత చంద్రం మాటలు విన్నాక—వాడి మాటలూ నిజమేనేమో అనిపించింది.

ఆ తర్వాత చంద్రం, సీనూ దెబ్బలాడుకోక పోవడం చూసి కిట్టూ నిరుత్సాహపడ్డాడు. అయితే సీనూ చంద్రంతో మరీ అంత ఫ్రీగా మాట్లాడలేకపోతున్నాడు. వాడిలో అనుమాన బీజం తలెత్తింది. అనుమానితుల సంఖ్య ఇద్దరికి పెరిగిందిప్పుడు.

4

ఆ రోజు సీనూ యింటికి వెళ్ళేసరికి మామయ్య వచ్చివున్నాడు. మామయ్యను చూడగానే సీనూకి మళ్ళీ ఏడుపు వచ్చింది.

"ఏడవకు—జరిగినదంతా విన్నాను—...." అన్నాడు మామయ్య. అతను సీనూని చేరదీసి మొత్తం జరిగిన వివరాలన్నీ అడిగాడు. బాగా ఆలోచించి "మీ టీచర్సులో నీ బొమ్మ పోయినందుకు కాస్త సింపతీ వున్నదెవరికి?" అనడిగాడు.

"లెక్కల మేస్టారు—తెలుగు మేస్టారు" అని చెప్పాడు సీనూ.

"సరే—నేనో ఉపాయం ఆలోచించాన్లే!" అన్నాడు మామయ్య—"నీ స్నేహితుడు చంద్రం అప్పుడు క్లాసులో వున్న కుర్రాళ్ళ లిస్టు తయారుచేశాడుగదా—అదికూడా

నా క్కావాలి!"

మామయ్య చాలా నమ్మకంగా చెబుతున్నాడనిపించింది సీనూకి. పోయిన తన బొమ్మ మళ్ళీ దొరుకుతుందేమోనని వాడికి ఆశపుట్టింది. అదే జరిగితే అసలా బొమ్మనెప్పుడూ బైటకు తీసుకువెళ్ళడు. ఇంట్లోకూడా వాడడు. అమ్మ నగలతో పాటు బ్యాంకు లాకర్లో వాటినీ పెట్టేస్తాడు.

వాడి ఆలోచన విని "ఇంక బాధెందుకు? లాకర్లోనే వుందనుకో ఆ బొమ్మ!" అన్నాడు మామయ్య నవ్వి.

మర్నాడు లెక్కల మాస్టారు క్లాసులో అందర్నీ టెక్స్టు పుస్తకాలు తీసుకురమ్మన్నారు. అంతా తీసుకుని వచ్చారు. ఆయన ప్రతి ఒక్కడి పుస్తకంలోనూ ముప్పైఎయ్యారో పేజీలో ఆరో లైన్ తర్వాత ఆ కుర్రాడి పేరు రాసి పక్కన దొంగవెధవ అని రాశాడు. తర్వాత ఎవరి పుస్త కాలు వాళ్ళకిచ్చేసి—"కిట్టూ మంచి ఉపాయం చెప్పాడు. మన క్లాసులో దొంగ వున్నాడంటే అది నాకెంతో అవమా నంగా వుంది. ఆ అవమానం క్లాసులోని విద్యార్థులంతా పంచుకోవలసిందే. ఆ దొంగ ఎవడో బైటకు వచ్చి ఆ బొమ్మ సాయంతో ఈ అక్షరాలు చెరపకపోతే శాశ్వతంగా ఇవి ఇందులో వుండిపోతాయి. ఒక చిన్న బొమ్మకోసం క్లాసు క్లాసంతటినీ అప్రతిష్ట పాలుచేయడానికి సందేహించని పక్షంలో—రేపు పెద్దవాళ్ళయ్యాక మీరు స్వార్థంపేరుచెప్పి దేశం పరువు కూడా తీస్తారు. మర్యాదగా బొమ్మ తెచ్చి మా యింటికిచ్చేస్తే వాళ్ళ పేరు బైటకు రానివ్వను...." అన్నాడు.

క్లాసులోని విద్యార్థులందరూ ముఖముఖాలు చూసు కున్నారు. ఆ బొమ్మ దొరుకుతుందా? పుస్తకంలోని ఈ అక్షరాలు పోతాయా? పోకపోతే ఎల్లకాలం వీటిని భరించ

వలసిందేనా?

ఆ రోజు ఇంటర్వల్లో కుర్రాళ్ళంతా ఇదే చర్చ. ఆ అజ్ఞాత చోరుడిమీద అంతా అసహ్యాన్ని ప్రకటించారు. వాడుకనుక ఈ దెబ్బతో ఆ బొమ్మను తిరిగి ఇవ్వకపోతే - అంతకంటే దొంగవెధవ వుండడని తేల్చేశారు.

సీనూ మాత్రం మామయ్య చెప్పిన ప్రకారం ఆ సమయంలో క్లాసులో వున్నవారందరి పేర్లూ రాసుకుని - వాళ్ళ ముఖభావాలెలా వున్నాయో నోట్ చేసుకుంటున్నాడు.

సాయంత్రం సీనూ ఇచ్చిన జాబితా తీసుకుని జరిగిందంతా విని—"నీకేం భయంలేదు. సెకండ్‌ఫారం పిల్లలకు ఈ ట్రీట్‌మెంటు చాలు. ఇది పనిచేయకపోతే వాడు నిజంగానే ఆరితేరిన దొంగ అయుండాలి. నీ బొమ్మ తీసిన వాడంత పెద్దదొంగ అయుంటాడనుకోను" అంటూ తన వద్ద వున్న సీను ఇచ్చిన రెండు జాబితాలూ పరిశీలించి చూసి—"ఇంచుమించు దొంగ దొరికినట్లే!" అని తను బైటకు బయల్దేరాడు.

అతను కాసేపు బజార్లో అటూ యిటూ తిరిగి నెమ్మదిగా లెక్కల మేష్టారింటికి వెళ్ళాడు. ఆ సమయంలో లెక్కల మేష్టారబ్బాయి వీధి అరుగుమీదనే కూర్చుని కాగితంమీద ఏదో రాస్తున్నాడు. సీనూ మామయ్య అక్కడికి వెళ్ళేసరికి - ఆ అబ్బాయి ఓ బొమ్మను తను రాసిన అక్షరాలమీద వుంచుతున్నాడు.

సీనూ మామయ్య ఆ బొమ్మను గుర్తుపట్టాడు. అతడి కళ్ళు మెరిశాయి.

సరిగ్గా అదే సమయానికి లెక్కల మేష్టరు వీధి గుమ్మంలోకి వచ్చి—సీనూ మామయ్యని చూసి—"నమస్కారమండీ—మీరు చెప్పిన ట్రిక్కు ఫలించిందండీ—బొమ్మ

దొరికింది. మా అబ్బాయి సరదా పడుతూంటే ఇచ్చాను...."
అన్నాడు.

"దొంగ ఎవరు?" అన్నాడు సీనూ మావయ్య.

"చెప్పనని వాళ్ళకి మాటిచ్చాను...." అన్నాడు లెక్కల మేష్టరు.

"మీరు చెప్పకపోయినా నాకు తెలుసులెండి. వాళ్ళు అంటే వాళ్ళిద్దరుగదా....వాళ్ళ పేర్లు రమణ, రంగారావు - అవునా?" అన్నాడు సీనూ మావయ్య తాపీగా.

"ఎలా కనిపెట్టారు?" అన్నాడు లెక్కల మేష్టరు ఆశ్చర్యంగా.

"ఆ రోజు క్లాసులో బొమ్మ పోయినప్పుడు ఎంతమంది వున్నారో జాబితా తయారుచేశాడు చంద్రం. ఆ రోజు క్లాసుకు వచ్చి అక్కడ లేనివారెవ్వరో నేను విచారించాను. ఎందుకంటే దొంగతనం చేశాక అంత చిన్న కుర్రాళ్ళు అక్కడే వుండలేరు. ఆ లెక్కన చూస్తే వీళ్ళిద్దరే అక్కడ లేరని కనిపెట్టాను....అప్పుడే నా అనుమానం వీళ్ళమీదకు వెళ్ళింది. వాళ్ళెలాంటివాళ్ళో సీనూద్వారా విన్నాను కాబట్టే ఆ ట్రిక్కు ఆలోచించి మీకు చెప్పాను. ఎటొచ్చీ వాళ్ళా దొంగతనం ఎందుకు చేశారా అన్నదే నాకు ఆశ్చర్యంగా వుంది. సహజంగా వాళ్ళకు అలాంటి బుద్ధులు లేవు...."
అన్నాడు సీనూ మావయ్య.

"దొంగలు వాళ్ళేనని ఊహించలేకపోయాను. కానీ వాళ్ళ పనికి అర్థముందని నాకు అనిపించింది. పిల్లలు క్లాసుకు వచ్చేది చదువుకుందుకేగదా! అ విషయం గుర్తించి నది పిల్లల్లో వీళ్ళిద్దరే! ఎంతో బుద్ధిగా చదువుకుంటారు. శ్రద్ధగా పాఠాలు వింటారు. సీనూకూడా క్లాసులో బుద్ధిగానే వుండేవాడు. కానీ ఈ బొమ్మ వాడిబుద్ధిని పెడదార్లు

తొక్కించింది. పాతాలు మానేసి అల్లరి మొదలెట్టాడు. అడ్డమైన కారుకూతలూ రాసి తోటివాళ్ళకి చూపించడం— మేస్టరు చూసేలోగా వాటిని చెరిపేయడం—ఈ బొమ్మను ఎన్నో విధాల మంచిపనుల కుపయోగించవచ్చు. కానీ సీనూ అల్లరికుపయోగిస్తున్నాడు. అందువల్ల క్లాసులో అల్లరి వాళ్ళకి నచ్చలేదు. అందుకని ఇద్దరూ కలిసి ఆలో చించుకుని అది కాజేశారు. ఆ తర్వాత సీనూ దుఃఖం చూస్తే వాళ్ళకు జాలేసింది. ఎలా బైటపడాలో అర్థం కాలేదు....'' అన్నాడు లెక్కల మేస్టరు.

''తా మాదర్శపౌరులుగా వుండాలన్న తాపత్రం వాళ్ళ కుంది. అందుకే బొమ్మను కాజేశారు. అయితే తమ కారణంగానే క్లాసుక్లాసంతటికీ దొంగవెధవలన్న ముద్ర శాశ్వ తంగా పడుతూంటే సహించలేక ఆ బొమ్మను తిరిగి ఇచ్చే శారు. నిజంగా మంచి కుర్రాళ్ళు వాళ్ళు. ఈ సంగతి అందరికీ చెబితే—కుర్రాళ్ళంతా బుద్ధిగా ఉంటారేమో!'' అన్నాడు సీనూ మామయ్య.

''ఏది ఏమయినా మీరు వాళ్ళ పేర్లు రహస్యంగా వుంచక పోతే—కుర్రాళ్ళంతా దొంగలని వాళ్ళమీద ముద్రవేస్తారు. క్లాసు మంచికోసం వాళ్ళా దొంగతనం చేశారుగానీ నిజా నికి వాళ్ళ కా బొమ్మమీద ఎటువంటి ఆసక్తిలేదు. ఇంట్లో వుండగా కూడా వాళ్ళు దాన్నెప్పుడూ ఉపయోగించలేదుట'' అన్నాడు లెక్కలమేస్టరు.

''ఈ విషయం సీనుక్కూడా చెప్పను....'' అని బొమ్మతీసుకుని అక్కణ్ణించి బయల్దేరాడు సీనూ మావయ్య.

బొమ్మతో తిరిగొచ్చిన మామయ్యను చూసి సీనూ పొందిన ఆనందం ఇంతా అంతాకాదు. అయితే దొంగ ఎవరన్న ఆలోచన వాణ్ణి గట్టిగా పట్టుకుంది.

సీనూమామయ్య వాడి కింకేమీ చెప్పలేదు—"యెవరయితే నీకేం? చంద్రం, కిట్టూలుకాదు. క్లాసులో నువ్వు అల్లరి చేస్తున్నావని—అది నచ్చక వాళ్ళాపని చేశారుకానీ బొమ్మకోసం కాదు. ఇంకెప్పుడూ బొమ్మతో క్లాసులో అల్లరిచేయకు—" అని —"ఈ వీధిలో నీ క్లాస్‌మేట్స్ ఇద్దరున్నారుగదా—ఈ శుభవార్త వాళ్ళిద్దరికీ చెప్పవా?" అన్నాడు.

"ఆ రమణా, రంగారావా? వాళ్ళకు చదువుతప్ప ఇంకేం అక్కరలేదు. అసలు వాళ్ళకి నా బొమ్మ పోయినట్లు తెలిపిందా—అని నా అనుమానం. వాళ్ళతో నేనే ఆనందమూ పంచుకోలేను—" అన్నాడు సీనూ. □

మత్తు?

"ప్రేయసీ! నీ కళ్ళు అంత మత్తుగా చూస్తున్నాయి. కారణం ఏమిటి?"

"బార్ నుండి ఇదేనా రావడం? ఇంకా దీక్షగా చూడు. నువు ఏం తాగావో కూడా నా కళ్ళలో కనిపిస్తుంది!"

—ఎమ్. ఎస్. దేవి, విశాఖపట్నం.

సత్యానికి సంకెళ్ళా?

టెంపోరావ్

డిటెక్టివ్ అశ్వద్ధామ ఏర్‌కండిషన్డ్ గదిలో ఫోమ్ సోఫా మీద వెల్లకిలా పడుకుని అమెరికన్ క్రయిమ్ పత్రికను తిరగేస్తున్నాడు. గదిలో ప్రశాంతంగా వుంది. తన పక్కనే ఎవరో చతికిలబడ్డం గమనించి అశ్వద్ధామ అటువైపు చూశాడు. మిస్ సురేఖ నవ్వుమొహం అతనికి కని

పించింది.

"రేఖా, ఏమిటలా చూస్తున్నావు?"

మిస్ సురేఖ అతని మెడమీద వేళ్ళతో నిమురుతూ ఇలా అంది: "పాలవాడి పెళ్ళాం వచ్చింది ..."

"అతని గేదెలనూ, ఆవులనూ యెవరేనా తోలుకు పోయారా?" అద్దొస్తూ అడిగాడు డిటెక్టివ్ అశ్వద్ధామ.

"ఇవాళ పొద్దుట పాలవాడిని హత్యానేరం మీద అరెస్టు చేశారట" అందామె.

"గుడ్ హెవెన్స్, ఘన పాలవాడినా! అతను మంచి వాడుగా!"

"సత్యం చాలా మంచివాడు. అతనిభార్య లక్ష్మి కూడా ఎంతో మంచిది. ఇదంతా యెలా జరిగిందో విచిత్రంగా వుంది."

అశ్వద్ధామ సోఫాలో లేచి కూర్చున్నాడు. సురేఖను తనవైపు లాక్కొని ఆమె కళ్ళల్లోకి చూస్తూ వుండి పోయాడు. లోకంలోని సౌందర్యమంతా ఆమెలో మూర్తీభ వించిందేమో అనిపిస్తోందతనికి.

"లక్ష్మిని పిలవనా?" అంది సురేఖ.

అశ్వద్ధామ ఆమెను తన కౌగిలిలోంచి వదలి లక్ష్మిని పిలవమన్నాడు. సురేఖ చకచక బయటకు వెళ్ళిపోయింది.

అశ్వద్ధామ స్టేట్ ఎక్స్ప్రెస్ 555 సిగరెట్ వెలిగించాడు. సోఫాలోంచి లేచి గదిమూలనున్న ఫిష్‌పాండ్స్ వైపు నడిచాడు. రంగురంగుల చేపలు స్వేచ్ఛగా పరుగెడుతున్నాయి. మానవుడికి కూడా స్వేచ్ఛకావాలి. అతని మెదడులో ఇంతకుముందు ఎన్నోసార్లు తనతో మాట్లాడిన పాలవాడి రూపం ప్రత్యక్షమయింది.

"ఇదిగో లక్ష్మి!" అంది సురేఖ వెనకనుంచి. అశ్వ ద్ధామ తటాలున తిరిగి లక్ష్మివైపు చూస్తూ నిలబడ్డాడు. లక్ష్మి అతని వద్దకు పరుగెత్తుకువచ్చింది. రెండుకాళ్ళూ పట్టుకుంది. అశ్వద్ధామ ఆమెను లేవదీసి ఒక సోఫాలో కూర్చోబెట్టాడు.

"లక్ష్మి, మరేం ఫరవాలేదు, కూర్చో, ఏం జరిగిందో చెప్పు?" అన్నాడు అశ్వద్ధామ.

"పొద్దుటే శారదమ్మగారింటికి పాలివ్వడానికి వెళ్ళాడు మా ఆయన. శారదమ్మ చచ్చిపడుంది. అది చూచి ఆయన పారిపోడానికి ప్రయత్నిస్తూంటే శారదమ్మ మొగుడు వచ్చి మా ఆయన్ని పట్టుకున్నాడు. పోలీస్‌రిపోర్ట్ ఇచ్చాడు. ఆయన్ని అరెస్టు చేశారు. బాబూ మీరెలాగైనా నా భర్తని విడిపించాలి. నాకు పతిభిక్ష పెట్టాలి!" అంది లక్ష్మి దీనంగా.

ఆమెను మరేమీ అడగలేదు. అశ్వద్ధామ ప్రశ్నలకు జవాబిచ్చే స్థితిలో ఆమెలేదు. అశ్వద్ధామ, లక్ష్మిని ఇంటికి వెళ్ళమన్నాడు. తను చెయ్యగలిగింది చేస్తానని హామీ యిచ్చాడు. మిస్ సురేఖ లక్ష్మికి ధైర్యం చెప్పి బయటకు సాగనంపింది.

2

ఇనస్పెక్టర్ ప్రతాప్ మిస్ సురేఖను చూడగానే కుర్చీ లోంచి లేచి నిలబడ్డాడు.

"సురేఖగారూ, కూర్చోండి" అన్నాడు ప్రతాప్.

సురేఖ అతనివైపు నవ్వుతూ చూస్తూ ఇలా ప్రశ్నించింది: "ప్రతాప్‌గారూ, శారద అనే స్త్రీని యెవరో హత్య చేశారని విన్నాను. ఒక పాలవాడిని మీరు అరెస్టు చేశారట."

"అదా! శర్మగారి భార్య శారద. ఆ ఇంట్లో శర్మగారూ భార్యా వుంటున్నారు. ప్రొద్దుటే 'అమ్మా పాలు' అన్న పాలవాడి కేక ఆయనకి కూడా వినిపించేది. ప్రతిరోజు చీకటి వుండగానే పాలవాడు వచ్చి పాలుపోసి వెళ్తూ వుంటాడు. ఈనాడు వాడికి యే శనిదేవతో పట్టి వుంటుంది. ఆమె మెళ్ళోన్ని నగల్ని చూస్తుంటే యేదో దుర్బుద్ధిపుట్టి వుంటుంది. చిన్న కత్తితో ఆమెను పొడిచి చంపేశాడు. ఆమె నగలన్నీ పట్టుకుపారిపోతూంటే భర్త అడ్డుపడి పట్టు కున్నాడు."

"అయితే పాలవాడి వద్ద నగలు కూడా దొరికాయా?" అంది సురేఖ.

"నగల్లేవు. ఎవరికో ఇచ్చిపంపేసి వుంటాడు."

మిస్ సురేఖ విచిత్రంగా నవ్వసాగింది.

"ప్రతాప్‌గారూ, పాలవాడెక్కడున్నాడు?"

"మా లాకప్‌లోనే."

"అతడిని ఒకసారి కలుసుకోవచ్చునా?"

"పదండి. తీసుకువెళ్తాను."

మిస్ సురేఖ అర్ధచీకటిగా వున్న గదిలోకి ప్రవేశించింది. నేలమీద పడుకునివున్న పాలవాడు తలెత్తి ఆమె వైపు చూశాడు. అతని కళ్ళమ్మట నీళ్ళు జలజల రాలాయి.

"అమ్మగారూ. నాకేం గత పట్టిందో చూడండి" అన్నాడతను దీనంగా.

మిస్ సురేఖ అతనికి కొంచెం దగ్గరగా జరిగి నిలబడింది. "సత్యం నేను చెప్పేది జాగ్రత్తగా విను. ఇవాళ ప్రొద్దుట ఏం జరిగిందో యేదీ దాచకుండా చెప్పు" అందామె.

"అమ్మగారూ! శారదమ్మకీ, భర్తకీ నేనంటే గిట్టదు.

పాలల్లో నీళ్ళు కలుపుతున్నానని యెన్నోసార్లు నన్ను ఎత్తి పొడిచేవాడు. నేనెప్పుడూ నీళ్ళు కలిపేవాడినికాను. ఒక రోజు నా మీద హెల్తాఫీసర్‌కు రిపోర్టు యిచ్చారు. అటు పైన నేను వాళ్ళకిచ్చిన పాలు హెల్తాఫీసువాళ్ళు పరీక్షించారు. పాలల్లో నీళ్ళు కలపలేదని వాళ్ళనగానే శర్మగారు చిన్నబుచ్చుకోవలసి వచ్చింది.

ఇవాళ ప్రొద్దుటే మీకు పాలుపితికి ఇచ్చి వాళ్ళింటికి వెళ్ళాను. ఇంకా చీకటిగా వుంది—

'అమ్మా పాలు' అని అరుస్తూ గుమ్మంవైపు నడిచాను.

గుమ్మం తెరిచివుంది. గుమ్మంమీద ఆమె వెల్లకిలా పడివుంది. గుండెలో దిగిన కత్తిని చూడగానే తొందరగా పోవడం మంచిదనిపించింది. అప్పుడే శర్మగారు లోపల నుంచి గబగబ పరుగెత్తుకువచ్చి నన్ను బలంగా పట్టుకున్నారు. నాకేమీ తెలియదని అరిచాను. ఎదురింటివాళ్ళు, పక్కిళ్ళల్లోనివాళ్ళూ పోగయ్యారు.

కాస్సేపట్లో పోలీసులొచ్చి నన్ను అరెస్టు చేశారు. నా బుర్ర పగిలిందాకా ప్రశ్నలువేసి ఇక్కడికి తీసుకొచ్చి పడేశారు. నేను నిర్దోషినమ్మా. ఇది మీరు అశ్వద్ధామగారికి చెప్పండి. ఈ చేతుల్తో నోరులేని దూడల్ని కూడా నేనెప్పుడూ కొట్టలేదమ్మా!"

ఏడుపుతో పాలవాడి కంఠం బొంగురుపోయింది.

"భయపడకు, ధైర్యంగా వుండు. ప్రొద్దుట లక్ష్మి మా ఇంటికొచ్చింది. అశ్వద్ధామగారు పరిశోధన సాగిస్తున్నారు. సత్యానికి సంకెళ్ళు పడకుండా ఆయన తప్పక చూస్తారు."

మిస్ సురేఖ గబగబ గదిలోంచి బయటకు నడిచింది. ఇనస్పెక్టర్ ప్రతాప్‌కి థాంక్స్ చెప్పి, బయటనున్న డిసోటో కారు ఎక్కింది. కారును స్పీడుగా పోనిచ్చింది.

3

డిటెక్టివ్ అశ్వద్ధామ తన కాడిలాక్ కారుని శర్మ ఇంటి ముందు ఆపాడు.

ఇంటిముందు పహారాకాస్తూన్న ఒక కానిస్టేబుల్ తలుపు తెరిచి అతనికి శల్యూట్ చేశాడు. లోపలనుంచి శర్మ గుమ్మంలోకి వచ్చాడు.

అశ్వద్ధామ కారుదిగి గుమ్మంవైపు నడిచాడు. గచ్చు నేలను నీళ్ళతో కడిగిన సూచనలున్నాయి.

అశ్వద్ధామ గుమ్మంలో నిలబడ్డ వ్యక్తివైపు చూస్తూ వుండిపోయాడు. పైజామా, జిబ్బా ధరించాడు. మాసిన గడ్డం, మొహాన్ని విచారం అలుముకుంది.

"శర్మగారు మీరేనా?"

"లోపలకు రండి."

చిన్నహాలు. డిటెక్టివ్ అశ్వద్ధామ స్టేట్ ఎక్స్‌ప్రెస్ 555 సిగరెట్ వెలిగించాడు. శర్మకి సిగరెట్ డబ్బా అందించాడు. ఇద్దరూ క్షణకాలం సిగరెట్లు పీలుస్తూ వుండిపోయారు.

"మీ భార్య శవాన్ని పోస్టుమార్టంకి పంపారా?"

"పోలీసువాళ్ళు అందుకే తీసుకువెళ్ళారు."

"శర్మగారూ, మొహం చూస్తే మీ భార్యమీద మీకెంత మమకారం వుండేదో స్పష్టంగా తెలుస్తోంది. ఇవాళ ప్రొద్దుట ఏం జరిగిందో చెప్పండి. మీ భార్య శారదను ఎవరు హత్య చేశారో కనుక్కోవాలి."

"పాలవాడిని పోలీస్‌వారు అరెస్టుచేసి తీసుకువెళ్ళారు."

"అనుమానంమీద! ఆ మాటకొస్తే పోలీసువారు మిమ్మల్నీ అరెస్టు చేయ్యొచ్చు. హత్యాస్థలంలో వున్న వాళ్ళందరూ అనుమానితులే" అన్నాడు అశ్వద్ధామ గంభీరంగా.

"ఇంతకీ మీరెవరు?"

"డిటెక్టివ్ అశ్వద్ధామని."

శర్మ ఉలిక్కిపడి లేచి నిలబడ్డాడు.

"కూర్చోండి. నేను మీకు సహాయపడ్డానికే వచ్చాను. శారదను యెవరు హత్య చేశారో కనుక్కొని ఆమె ఆత్మకు శాంతి చేకూర్చాలి. అందుకోసం నాకు మీరు సహాయ పడండి. జరిగిందంతా చెప్పండి."

"అశ్వద్ధామగారూ, మాకు పిల్లాజెల్లాలేరు. పెళ్ళయి అయిదేళ్ళు అయింది. నేను రమణ స్టీల్ కార్పొరేషన్‌లో కాషియర్‌గా పనిచేస్తున్నాను. ప్రతిరోజూ శారద బయటకు వెళ్ళి పాలు తీసుకుంటూ వుండేది. ఇవాళ ప్రొద్దుట నేను నిద్రపోతున్నాను. "అమ్మా పాలు" అన్నకేక నాకూ విని పించింది. నేను లేవలేదు. అలా నిద్రపోతూనే వుండి పోయాను. కాస్సేపయ్యాక అదేకేక మళ్ళా వినిపించింది.

శారద యింకా బయటకు వెళ్ళలేదేమో అని కళ్ళు తెరిచాను. నా పక్కనున్న మంచం ఖాళీగా వుంది. నిద్ర కళ్ళతో వీధిగుమ్మంవైపు వెళ్ళాను. బయట చీకటి. ఎవరి అడుగులచప్పుడో నాకు వినిపించింది. బయటకు పరుగెత్తి పారిపోతున్న ఒక ఆకారాన్ని నా చేతుల్తో బంధించాను. మా పాలవాడు! తనకేమీ తెలియదని అరవడం ప్రారం భించాడు. ఇంతలో ఇరుగు పొరుగు వాళ్ళు గుమికూడారు. వాడిని వాళ్ళకి అప్పగించి సమీపములో వున్న కళ్యాణ మంటపానికి వెళ్ళి పోలీసువారికి టెలిఫోన్ చేశాను. కాస్సే పట్లో పోలీసువారు వచ్చారు."

"మీ ఇంట్లో వస్తువులేమైనా పోయాయా?"

"నా భార్య వంటిమీద 10 వేల రూపాయల నగలు వుండేవి. ప్రతిరోజూ అవన్నీ వేసుకోవద్దని నేనెంత

చెప్పినా అది వినేది కాదు. ఆ నగలన్నీ పోయాయి."

"పాలవాడికి మీ భార్యను చంపవలసినంత కసి ఏదైనా మీ మీద వుందా?"

"అశ్వద్ధామగారూ. నా భార్య నగలకోసం ఈ హత్య జరిగిందని తెలుస్తోంది. పాలవాడికి మా ఇద్దరిమీదా కొంచెం కోపంగా వుండేది. అతనిమీద మేము రిపోర్టు యిచ్చాము. పాలల్లో నీళ్ళు కలుపుతున్నాడన్నాం. అతను మాకిచ్చిన ఒకరోజు పాలను హెల్త్ డిపార్టుమెంటు వారు పరీక్షించి నీళ్ళు లేవన్నారు. అదృష్టవశాత్తూ ఆ రోజు పాలల్లో వాడు నీళ్ళు కలపలేదు.

మా రిపోర్టువలన పాలవాడికి మా మీద కోపం ఏర్పడింది. ఒకవైపున మా మీద పగ సాధించాడు. మరో వైపున 10 వేల రూపాయల నగలు పట్టుకుపోయాడు. వాడు దొరికినా నగలుమాత్రం పోలీసువారికి కనబడలేదు. ఎక్కడో రహస్యంగా దాచివుంటాడు."

"మరెవరిమీదేనా మీకు అనుమానం వుందా?"

"లేదు."

అశ్వద్ధామ శర్మకళ్ళలోకి సూటిగా చూశాడు.

"శర్మగారూ, శారదను మీరు హత్యచేసే అవకాశం

కూడా వుందని మరిచిపోకండి" అన్నాడు అశ్వద్ధామ.

"ఉండొచ్చు. కాని అవసరంలేదు. నాభార్య పోతే నాకు చిల్లిగవ్వరాదు. ఆమెను నేను ప్రేమించి పెళ్ళాడాను. మా దాంపత్య జీవితం ఎంతోహాయిగా సాగుతోంది. ఆమెలేని ఈ లోకంలో నాకు వుండాలని అనిపించలేదు."

శర్మ ఆగాడు. అతనికళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి. అశ్వద్ధామ మెల్లిగా బయటకు నడిచాడు. కాడిలాక్ కారులో కూర్చున్నాడు. కారు కదిలింది.

4

మధ్యాహ్నం ఒంటిగంట అవస్తోంది. రమణీ స్టీల్ కార్పొరేషన్ ఆఫీసులోకి ఒకతను ప్రవేశించాడు.

"స్టాటిస్టికల్ డిపార్ట్‌మెంటు నుంచి వస్తున్నా. ఈ కార్పొరేషన్‌లో పనిచేసేవాళ్ళను గురించి నాకు కొన్ని వివరాలు కావాలి. నా పేరు జోగిరాజు" అన్నాడతను.

మేనేజర్ కాఫీకి ఆర్డరిచ్చి, "అడగండి" అన్నాడు.

"మీ స్టాఫ్ మెంబర్ల జీతాలు, గ్రేడ్స్ కావాలి. అందరూ సరిగ్గా మనస్ఫూర్తిగా పనిచేస్తున్నారో లేదో తెలపాలి. ఎవరేనా మోసంచేస్తూంటే వాళ్ళని గురించి వివరాలు కూడా ఇవ్వాలి."

మేనేజర్ డ్రాయర్లోంచి జీతాలషీటు ఒకటితీసి జోగిరాజు కందించాడు.

"దానిలో జీతాల వివరాలన్నీ వున్నాయి. ప్రస్తుతం అందరూ బాగానే పనిచేస్తున్నారు. మనుష్యులు వున్నంత కాలం అప్పుడప్పుడు మోసాలు జరుగుతూనేవుంటాయి. వాటినిగురించి మీకు చెప్పడం అనవసరం అనుకుంటా" అన్నాడు మేనేజర్.

"అత్యవసరం. మనదేశంలో కంపెనీలలో పనిచేసే

వాళ్ళల్లో నూటికి ఎంతమందికి కృత్రిమ బుద్ధివుందో అంచనా వెయ్యడానికి ప్రయత్నిస్తున్నాం. మా సర్వే పూర్తయ్యాక వాటిని అరికట్టడానికి ప్రభుత్వం కొత్తపథకాలను ప్రవేశ పెడుతుంది.''

''మా కార్పొరేషన్‌లో ఆరుగురు మాత్రం కొన్ని మోసాలు చేశారు. వాళ్ళమీద తగుచర్య మేమే తీసు కుంటున్నాం. వాళ్ళను గురించి చెబుతాను వినండి.''

మేనేజర్ చెప్పసాగాడు. జోగిరాజు మౌనంగా వింటు న్నాడు. తన డైరీలో ఏదో రాసుకుంటున్నాడు. అరగంట తరువాత మేనేజర్‌కి థాంక్స్ చెప్పి జోగిరాజు బయటకు నడిచాడు.

5

మధ్యాహ్నం ఒంటిగంటన్నర అవుతోంది. డిటెక్టివ్ అశ్వద్ధామ హాల్లోకి ప్రవేశించి శర్మవైపు చూస్తూ నిల బడ్డాడు.

''మళ్ళా మీరెందుకు వచ్చారో నా కర్థం కావడంలేదు. చెప్పవలసిందంతా మీకు పొద్దుటే చెప్పాను'' అన్నాడు శర్మ.

డిటెక్టివ్ అశ్వద్ధామ స్టేట్ ఎక్స్‌ప్రెస్ 555 సిగరెట్ వెలిగించాడు. పొగ పీలుస్తూ క్షణకాలం శర్మ కళ్ళలోకి చూస్తూ వుండిపోయాడు.

''శర్మగారూ. ఇంతకుముందు డబ్బుకోసం భార్యలను హతమార్చిన భర్తల నెందరినో నేను కళ్ళారా చూశాను. పాపం, మీ దుస్థితి చూస్తే నాకు చాలా విచారంగా వుంది. రమణీ స్టీల్ కార్పొరేషన్ నుంచి రెండువేల రూపాయలు మీరు కాజేసేరు. పోలీసు రిపోర్టు ఇస్తామని వాళ్ళు బెదిరి స్తున్నారు.

అర్జెంటుగా మీరు కంపెనీకి డబ్బు కట్టాలి. మీ చేతిలో దబ్బులేదు. శారదను మీరు నగలిమ్మని అడిగారు. తన నగలు ససేమిరా ఇవ్వనంది. ఇంతవరకూ గౌరవంగా బ్రతికిన మీకు జైల్లో పడటం ఇష్టంలేదు. శారదపోతే ఆ నగలన్నీ మీ వశమవుతాయి....''

"అశ్వద్ధామగారూ!'' శర్మ గట్టిగా అరిచాడు. మొహాన్ని తన చేతుల్తో కప్పేసుకున్నాడు.

"మీరు చెప్పినదానిలో కొంత నిజముంది. శారదని కొన్ని నగలిమ్మన్నాను. ఇవ్వలేదు. కాని నేను హంతకుడిని కాదు. నన్ను నమ్మండి. నేను నా భార్యను చంపలేదు. ఆమె నగలు ఏమయ్యాయో నాకు తెలీదు.''

"ఈ ఇల్లు సోదాచేస్తే నగలెక్కడున్నాయో తెలుస్తుందేమో....?''

"సోదా చెయ్యండి. కావాలంటే నా హృదయాన్ని చీల్చి అందులోవున్న శారద రూపాన్ని చూడండి. నిజం మీకే తెలుస్తుంది'' అన్నాడు శర్మ ఉద్రేకంతో.

డిటెక్టివ్ అశ్వద్ధామ శర్మవైపు అదోవిధంగా చూస్తూ బయటకు నడిచాడు. క్షణకాలం గుమ్మంలో నిలబడి అటూయిటూ చూశాడు. ఇరువైపులా రెండిళ్ళు వున్నాయి.

రోడ్డు కటువైపున ఇంటికెదురుగా ఒక మేడ వుంది. అశ్వద్ధామ ఎడంవైపున్న ఇంటికేసి నడిచాడు. తరువాత కుడివైపున ఇంటికి వెళ్ళాడు. ఆఖరున ఎదురుగా వున్న మేడలోకి ప్రవేశించాడు.

అశ్వద్ధామను చూడగానే రేషన్ బియ్యంలోని బెడ్డలు ఏరుతూన్న ఒక ముసలామె లేవబోయింది.

అశ్వద్ధామ ఆమె దగ్గరగా వెళ్ళాడు.

"అబ్బాయి ఆఫీసుకెళ్ళాడు'' అందామె.

"ఇవ్వాళ ప్రొద్దుట ఎదురింట్లో ఏదో హత్య జరిగింది. దాన్ని గురించి మీకేమైనా తెలుసా?" అడిగాడతను.

"అబ్బాయికి తెలుసు. ప్రొద్దుటే అరుపులు విని అబ్బాయి అక్కడకు పరిగెత్తుకు వెళ్ళాడు. కోడలూ పిల్లలూ పుట్టింటికి వెళ్ళారు. అందువలన నే నిక్కడే వుండిపోవలసి వచ్చింది. అదీకాకుండా జయదేవ్ అప్పుడే టాక్సీ ఎక్కి వెళ్ళిపోతున్నాడు. అతనివద్దనుంచి పైగది తాళంచెవీ అవీ తీసుకుని సాగనంపాను."

"జయదేవ్ ఎవరు?"

"అతను మా మేడమీద గదిలో అద్దెకుంటున్నాడు. ఇవ్వాళ తెల్లవారుఝామున గది ఖాళీచేసి వెళ్ళిపోయాడు. రాత్రి ఏదో టెలిగ్రాం వచ్చిందిట. తండ్రికి వంట్లో బాగా లేదుట."

"అతని గది ఒకసారి చూడొచ్చా?"

ముసలామె ఒక తాళంచెవిని అశ్వద్ధామకు అందించింది.

"మీరెవరు? పోలీసులా?"

"అలా అనుకోవచ్చు" అన్నాడు అశ్వద్ధామ.

"మీరు వెళ్ళి గదిచూసి రండి. ముసలిదాన్ని. ఎక్కలేను. మెట్లెక్కగానే కుడివైపు వరండాలోకి తిరగండి. మొదటి గదిలోనే జయదేవ్ వుండేవాడు."

అశ్వద్ధామ చకచక మేడమెట్లు ఎక్కాడు. కుడివైపు వరండామీద కొంచం దూరం నడిచి ఒక గది తాళం తెరిచాడు. లోపలకు అడుగు పెట్టాడు. గుమ్మాని కెదురుగా వున్న కిటికీ వద్దకివెళ్ళి నిలబడ్డాడు.

క్షణకాలం ఎదురుగా వున్న శర్మ ఇంటివైపు చూస్తూ వుండిపోయాడు. ఎదురింటి గుమ్మంలో నిలబడి శర్మ

కానిస్టేబుల్‌తో ఏదో మాట్లాడుతున్నాడు!

అయిదు నిమిషాలపాటు అశ్వద్ధామ అలాగే నిలబడి పోయాడు. అతని మెదడులో విమానాలు పరిగెడుతూ వున్నాయి.

గదికి తాళంవేసి గబగబా మెట్లు దిగాడు. తాళంచెవి ఆమెకందించి, "మీ అబ్బాయి పేరేమిటి? అతను ఎక్కడ పని చేస్తున్నాడు" అని ప్రశ్నించాడు.

"కష్ణమూర్తి. పంకీబ్రాండ్ ముక్కుపొడుం కంపెనీలో" అందామె.

అశ్వద్ధామ బయటకు నడిచి కారెక్కాడు. కాస్సేపట్లో కాడిలాక్ కారు పార్క్‌టౌన్‌లో ఒక భవనం ముందు ఆగింది. బయట వేళ్ళాడుతున్న బోర్డుచూసి భవనంలోకి ప్రవేశించాడు. కాస్సేపట్లో కృష్ణమూర్తి కెదురుగా కుర్చీలో కూర్చున్నాడు.

కృష్ణమూర్తి గాభరాగా అశ్వద్ధామ వైపు చూశాడు. కొంచెం ముక్కుపొడుం పీల్చి!

"ఏం కావాలి?" అని అడిగాడు.

"జయదేవ్‌ని గురించి మీకేం తెలుసు?"

"ఆరునెలల క్రితం అతను నాకు బజార్లో తటస్థపడ్డాడు. కలకత్తానుంచి వచ్చాడట. గదికోసం వెదుకుతున్నా నన్నాడు. అప్పట్లో మేడమీద ఓ గది ఖాళీగావుంది. డెబ్బయి అయిదు రూపాయలు అద్దె యిస్తే ఇస్తానన్నాను. రెండునెలల అద్దె ముందు ఇవ్వమన్నాను."

"ఇచ్చాడా?"

"లేదు. ఇస్తానని గదిలోజేరాడు. తరువాత నేనే వూరుకున్నాను. ఉద్యోగంకోసం పట్నమంతా తిరుగుతున్నాడు. అద్దెకూడా ఆలస్యంగా ఇస్తూండేవాడు."

"అతను ఏ రాష్ట్రంవాడు?"

"దాన్నిగురించి నేనెప్పుడూ అడగలేదు. అతను అయిదారు భాషలు బాగా మాట్లాడేవాడు."

"ఇంత హఠాత్తుగా, ఇవాళ తెల్లవారుఝామున అతను ఎందుకు వెళ్ళిపోయాడు?"

"రాత్రి టెలిగ్రాము వచ్చిందట, తండ్రికి ఒంట్లోబాగా లేదుట."

"టెలిగ్రాము రావడం మీరు చూశారా?"

"చూడలేదు."

అశ్వద్ధామ కుర్చీలోంచి లేచాడు. డబ్బాతెరిచి సిగరెట్ వెలిగించాడు. కృష్ణమూర్తిముందు పచార్లు చెయ్యసాగాడు.

"సార్, సార్, ఇక్కడ సిగరెట్లు కాల్చకూడదు." అన్నాడు కృష్ణమూర్తి.

"ముక్కుపొడుం పీల్చొచ్చా?" అడిగాడు అశ్వద్ధామ నవ్వుతూ.

కృష్ణమూర్తి దగ్గరగా అశ్వద్ధామ నడిచాడు.

"జయదేవ్ ఫోటో ఏదేనా మీవద్ద వుందా?"

"మీ రడిగితే జ్ఞాపకం వచ్చింది. ఒకసారి నాభార్య పిల్లల ఫొటోలు నేను తీస్తూంటే అతను కూడా వచ్చాడు. అతని ఫొటో తీశాను. ఆ ఫొటో కాపీ అతనికి కావాలంటే ఇచ్చేశాను."

"దాని నెగటివ్ వుందా?"

"వుండాలి, వెతికితే దొరుకుతుంది."

"అయితే రండి, ఇంటికి తీసుకువెళతాను. ఆ నెగటివ్ కోసం వెతకండి. అది మాకు అర్జెంటుగా కావాలి" అన్నాడు అశ్వద్ధామ గంభీరంగా.

"సాయంత్రం ఇంటికివెళ్ళాక వెతుకుతానులెండి."

"ఒక హత్యసందర్భంలో ఇక్కడికి వచ్చాను. సాయంత్రం దాకా గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోడానికి వ్యవధి లేదు."

కృష్ణమూర్తి గభరాగా లోపలకువెళ్ళి తొందరగా తిరిగి వచ్చాడు.

"పదండి" అన్నాడు.

అశ్వద్ధామ, కృష్ణమూర్తి కాడిలాక్ కారు ఎక్కారు.

6

మినిట్ ఫొటోస్టూడియోముందు కాడిలాక్ కారుఆగింది.

అశ్వద్ధామ గబగబా లోపలకు వెళ్ళాడు. ప్రొప్రయిటర్ సెల్వరాజ్ అతడిని ఆహ్వానిస్తూ ఏం కావాలని అడిగాడు.

అశ్వద్ధామ తన జేబులోవున్న నెగటివ్‌ని అతనికందించి "దీనికి అయిదు ప్రింట్‌లు అర్జెంటుగా కావాలి. ఎంత టైము పడుతుంది?" అని అడిగాడు.

"మీరు మా నేమ్‌బోర్డు చూసేవుంటారు. ఇలా ఫొటోలు తీసి నిమిషంలో ప్రింట్సు ఇస్తూవుంటాం."

"అయితే తీయించండి."

అశ్వద్ధామ బయటకు నడిచాడు. పేవ్‌మెంటు మీద ఇటూ అటూ పచార్లు చేయసాగాడు. టైము రెండుదాటింది. తనింకా భోజనం చెయ్యలేదు. ఊచలవెనుక కూర్చున్న పాలవాడి మొహం అతని మెదడులో మెదుల్తోంది.

వీలయినంత త్వరగా తను వల విసరాలి. జయదేవ్ పట్టుబడితే తన కేదేనా తెలియవచ్చు.

అశ్వద్ధామ మళ్ళా స్టూడియోలోకి ప్రవేశించాడు. ఐదు ఫొటోకాపీలను తీసుకుని, డబ్బు చెల్లించి కారెక్కాడు.

కారు స్టార్టుచేసేముందు తదేకంగా కొంతసేపు జయదేవ్ ఫొటోవైపు చూస్తూవుండిపోయాడు. జయదేవ్

యువకుడు. అమెరికన్ క్రాపు. రాజ్‌కపూర్ మీసాలు. ఫొటోనుబట్టి అంచనావేస్తే అతని ఎత్తు కనీసం 5 అడుగులు 10 అంగుళాలు వుండొచ్చు.

కారు స్టార్టయింది. కాస్సేపట్లో శర్మ యింటిముందు ఆగింది. ఈసారి శర్మ కారుపద్దకు పరుగెత్తుకు వచ్చాడు.

"శర్మగారూ! ఈ వీధికి యెవరేనా వాచ్‌మన్ వున్నాడా?"

"ఒక గూర్కా వున్నాడు. వాడు పహరా కాస్తూ వుంటాడు. ప్రతి ఇంటినుంచీ వాడు ఒక రూపాయ మాత్రం జీతం తీసుకుంటూ వుంటాడు."

"వాడు ఎక్కడుంటాడో తెలుసా?"

"అడ్వకేట్ రాజగోపాల్‌గారి ఇంట్లో కారుషెడ్లో వుంటున్నాడు."

"కారెక్కండి," అన్నాడు అశ్వద్ధామ తలుపు తెరుస్తూ.

కాడిలాక్ కారు కాసేపట్లో రాజగోపాల్ కాంపౌండులోకి ప్రవేశించింది. అశ్వద్ధామ, శర్మ కారుషెడ్‌లోకి ప్రవేశించారు. షెడ్‌లో కారులేదు. ఒక చాపమీద కాకీ దుస్తులు ధరించిన గూర్కా గుర్రుపెడుతూ నిద్రపోతున్నాడు. అశ్వద్ధామ అతడిని తట్టాడు.

"జాగ్‌తేరహో! పహరా ఉషార్!" అని సగంనిద్రలో అరుస్తూ గూర్కా కళ్ళుతెరిచి వాళ్ళవైపు చూసాడు. ఉలిక్కిపడి లేచి నిలబడ్డాడు.

"క్యాసాబ్?" అని ప్రశ్నించాడు.

అశ్వద్ధామ తన జేబులోని ఫొటోని గూర్ఖాకి అందించాడు.

"ఇతడిని చూశావా?" అడిగాడు.

"దేఖాసాబ్, మైనే యే సాబ్‌కో టాక్సీలాయా!"

అన్నాడు గూర్ఖా.

"ఆ టాక్సీనంబరు గుర్తుందా?"

"నయీసాబ్, ఓ డ్రయివర్ హమ్‌కో మాలూమ్, సాబ్."

"డ్రయివర్ ఎక్కడ దొరుకుతాడు?"

"మిడ్‌లాండ్ హోటల్ హైనా — ఉదర్ ఓ మిలేగా సాబ్."

"నువ్వు మాతోరా," అన్నాడు అశ్వద్ధామ.

ముగ్గురూ కారెక్కారు. మిడ్‌లాండ్ హోటల్ టాక్సీ స్టాండువద్ద కారాగింది. గూర్ఖా దిగి కాస్సేపట్లో ఒక డ్రయివర్ని తీసుకువచ్చాడు.

అశ్వద్ధామ తన జేబులోని ఫొటోను డ్రయివరుకి చూపించాడు.

"ఈమనిషి ఇవాళపొద్దుట నీ టాక్సీలో ఎక్కాడా?"

"ఎక్కాడు సార్."

"ఎక్కడికి తీసుకువెళ్ళావ్?"

"మొదట సెంట్రల్ స్టేషన్‌కి తీసుకువెళ్ళానుసార్. అప్పుడు ట్రెయిన్‌లేదుట. అందువల్ల ఆయన్ని బెంగుళూరువెళ్ళే బస్సులస్టాండ్‌వద్ద దింపాను" అన్నాడు టాక్సీ డ్రయివర్.

అశ్వద్ధామ తన జేబులోంచి రెండు అయిదురూపాయల నోట్లు తీసి గూర్ఖాకి, డ్రయివర్‌కి ఇచ్చాడు. కాడిలాక్ కారుని స్టార్టుచేశాడు.

"శర్మగారూ, మీభార్య హంతకుడి కోసం అన్వేషణ సాగుతోంది. మీరు నాతో వస్తారా? లేక యింటిదగ్గర దింపెయ్యనా?"

"పదండి ఇంట్లోకూర్చుని చేసేదేమిటి?" అన్నాడు

శర్మ.

సరిగ్గా మూడింటికి బెంగుళూర్ బస్టాంప్‌వద్ద కాడిలాక్ కారు ఆగింది. బస్ కంపెనీ మేనేజర్ని అశ్వద్ధామ కలుసు కున్నాడు. తన జేబులోని ఫొటో చూపించాడు. పది గంటల బస్సులో జయదేవ్ బెంగుళూరుకి వెళ్ళాడని నిర్ధా రణ చేసుకున్నాడు.

"ఆ బస్సు బెంగుళూరు ఎప్పుడు చేరుతుంది?" అశ్వ ద్ధామ అడిగాడు.

"ఇవాళ రాత్రి ఏడింటికి" అన్నాడు మేనేజర్.

అశ్వద్ధామ తటాలున కారెక్కి తలుపుమూశాడు. తిన్నగా తన ఇంటివైపు కారుని పోనిచ్చాడు.

అశ్వద్ధామ, శర్మ ఏర్‌కండిషన్డ్ గదిలోకి ప్రవేశించారు. మిస్ సురేఖ తను కనుక్కున్నదంతా చెప్పడానికి ఉపక్ర మించింది. శర్మ సోఫాలో కూర్చున్నాడు. అశ్వద్ధామ సిగ రెట్ పీలుస్తూ వింటున్నాడు.

స్ప్రింగ్‌తలుపు తెరిచి మంజూ గదిలోకి అడుగుపెట్టింది. అశ్వద్ధామ ఆమెవైపు చూశాడు.

"మీరు భోజనవిషయం పూర్తిగా మరిచిపోయారు" అంది మరుగుజ్జు మంజూ.

"మంజూ, ముగ్గురికి తొందరగా వడ్డించు, వస్తాం."

మరుగుజ్జు మంజూ గబగబా వెళ్ళిపోయింది. మిస్ సురేఖ తన కథనం పూర్తిచేసింది. అశ్వద్ధామ బుర్ర ఆలో చనలతో వేడెక్కిపోతోంది. సురేఖ దగ్గరగా వెళ్ళాడు. ఆమె జుట్టును తనవేళ్ళతో నిమురుతూ, "రేఖా" అని ఆప్యాయంగా పిలిచాడు. సురేఖ అతనివైపు అప్పుడే విక సించిన పువ్వులా చూసింది.

"రేఖా, ఇది చాలా అర్జెంటు. ఇండియన్ ఎయిర్ లైన్స్ ఆఫీసుకి ఫోన్ చెయ్యి. ప్లేన్‌లో బెంగుళూరుకి మూడు టిక్కెట్లు రిజర్వుచెయ్యి. ఇవాళ ఆరుగంటలలోగా మనం బెంగుళూరులో వుండాలి. ఇప్పుడు ప్లేన్ లేకపోతే స్పెషల్‌చార్టర్డ్ ప్లేన్ సిద్ధంగా వుంచమను. ఒక కారును ఏరోడ్రోమ్‌కి పంపమని నాగప్పకి ఫోన్‌చేయి."

మిస్ సురేఖ టెలిఫోన్‌వైపు పరుగెత్తింది.

అశ్వద్ధామ ఫిష్‌పాండ్ల దగ్గరకు నడిచాడు. నీళ్ళల్లో చేపలు చలాకీగా తిరుగుతున్నాయి. ఇవాళ వాటికి తిండి వేయడం అతను మర్చిపోయాడు. డబ్బా మూతతీసి అందులోని పౌడర్‌ని నీళ్ళల్లోకి మెల్లిగా జల్లాడు. చేపలు పైకెగిరి ఉల్లాసంగా తినడం ప్రారంభించాయి.

మిస్ సురేఖ రిసీవర్ని పెట్టేసి, అశ్వద్ధామ పక్కకొచ్చి నిలబడింది.

"సరిగ్గా నాలుగున్నరకి చార్టర్డ్ ప్లేన్ సిద్ధంగా వుంటుంది. ఆరులోపల అది బెంగుళూరు చేరుకుంటుంది" అంది సురేఖ.

"పద్దించాను" అంది మరుగుజ్జు మంజూ లోపల్నించి.

7

సరిగ్గా ఆరింటికి విమానం బెంగుళూరు ఏరోడ్రోమ్‌లో దిగింది.

అశ్వద్ధామ, శర్మ, మిస్ సురేఖ విమానంలోంచి బయటకు దిగారు.

అప్పుడే చీకటి పడుతోంది. ఏరోడ్రోమ్ టవర్‌మీది ఆకుపచ్చ ఎట్టదీపాలు మెరుస్తున్నాయి.

ముగ్గురూ గబగబా ఏరోడ్రోమ్‌లోకి వెళ్ళారు. నాగప్ప పంపిన డాడ్జికారు బయట తయారుగా వుంది. డ్రయివర్ని



అక్కడే వుండమని, అశ్వద్ధామ, సురేఖ, శర్మ కారెక్కారు. అశ్వద్ధామ కారుని పోనిచ్చాడు.

మద్రాసునుండి వచ్చేబస్సులు ఆగేచోట కారుని ఆపాడు. బస్సుకంపెనీ మేనేజర్ గదిలోకి గబగబా వెళ్ళాడు.

"మద్రాసులో ఇవాళ ప్రొద్దుట పదింటికి బయలుదేరిన బస్సు ఇక్కడికి ఎన్నింటికి వస్తుంది?" అశ్వద్ధామ అడిగాడు.

"మరో అరగంటలో వస్తుంది?" అన్నాడు మేనేజర్.

"నేను చెప్పేది జాగ్రత్తగా వినండి. ఆ బస్సు ఇక్కడ ఆగగానే అందులోంచి ఒక్క మనిషికూడా కిందికి దిగకుండా మీరు చూడాలి. నేను మీకు గ్రీన్ సిగ్నల్ ఇస్తాను. అటుపైన వాళ్ళు దిగవచ్చును."

"క్షమించండి, అలా చేస్తే ప్రయాణీకులకు మా బస్సు సర్వీస్‌మీద ఆగ్రహం వస్తుంది" అన్నాడు మేనేజర్.

"కోపం వచ్చినా ఫరవాలేదు. తరువాత అంతా సర్దు

కుంటుంది."

"మీరు అధికార ధోరణిలో మాట్లాడుతున్నారు. ఇంతకీ మీరు ఎవరు?" అడిగాడు మేనేజర్.

"అధికంగా మీతో మాట్లాడటానికి టైము లేదు. ఆ బస్సులో ఒక హంతకుడు ప్రయాణం చేస్తున్నాడు. ఇది పోలీస్ ఉత్తరువుగా...."

"గుడ్‌గాడ్!" మేనేజర్ అరిచాడు. అతని చేతిలోని సిగరెట్ యాష్ట్రేలో పడింది!

"మీరు చెప్పినట్లే చేస్తాను సార్. స్వయంగా అంతా నేనే చూస్తాను" అన్నాడు మేనేజర్.

అశ్వద్ధామ బయటకు నడిచాడు. కారులో కూర్చున్నాడు. ప్రక్కనున్న సురేఖనీ వెనుకకూర్చున్న శర్మనీ క్షణకాలం చూసి, అశ్వద్ధామ సిగరెట్ వెలిగించాడు. పొగపీలుస్తూ నలువైపులా చూస్తున్నాడు.

విశాలమైన బజారు. వీధి ఫ్లోరసెంట్ దీపాలు ప్రకాశ వంతంగా వెలుగుతున్నాయి. ప్రజలు ఇటూ అటూ నడుస్తున్నారు.

"రేఖా, బెంగుళూరులో మహా చలిగా వుంది" అన్నాడు అశ్వద్ధామ.

మిస్ సురేఖ రెండు సోడాలు పట్రామని సమీపంలో వున్న షాపువాడికి సౌజ్ఞచేసింది. డాష్‌బోర్డు తెరిచింది. డిమ్‌పుల్స్ విస్కీబుడ్డీని బయటకు తీసింది. మూడు గ్లాసుల్లో పోసి సోడా కలిపింది.

అశ్వద్ధామ విస్కీని కొంచెం తాగి సిగరెట్ పీలుస్తున్నాడు. శర్మ వద్దంటూ విస్కీ గ్లాసుని అందుకున్నాడు.

"శర్మగారూ, మీరున్న స్థితిలో విస్కీ మందులాంటిది. మీ బాధలను తాత్కాలికంగా తొలగిస్తుంది" అంది సురేఖ

నవ్వుతూ.

సురేఖ మెల్లిగా విస్కీని చప్పరిస్తోంది. నిమిషాలు గడుస్తున్నాయి. గ్లాసులు ఖాళీ అయ్యాయి. తన ఖాళీ గ్లాసుని సురేఖకి అందిస్తూ, "రేఖా. మళ్ళీ పొయ్యి" అన్నాడు అశ్వద్ధామ. సురేఖ మళ్ళీపోసిచ్చింది.

అశ్వద్ధామ తాగుతూ ఆలోచిస్తున్నాడు. విస్కీలోపలకు వెళ్ళాక చలి తగ్గింది. తన కోటు జేబులోవున్న అమెరికన్ పిస్టల్ని అశ్వద్ధామ తడిమిచూసుకున్నాడు.

అప్పుడే బస్సు కంపెనీ మేనేజర్ బయటకు రావడం అశ్వద్ధామ గుర్తించాడు. తటాలున కిందకు వురికాడు. సగంతాగిన గ్లాసుని అలాగే వదిలేశాడు. ముందుకొస్తున్న బస్సు కొంచెం దూరంలో అతనికళ్ళకు స్పష్టంగా అవుపిస్తోంది.

"రేఖా, బస్సు ఆగగానే, నువ్వు ముందునుంచో. శర్మగారూ, మీరు వెనకాల నుంచోండి" అన్నాడు అశ్వద్ధామ.

మిస్ సురేఖ, శర్మ బయటకు దిగారు. బస్సు ఆగింది. మేనేజర్ కండక్టర్‌తో ఏదో చెప్పాడు.

"ఎవ్వరూ బస్సులోంచి దిగకండి" కండక్టర్ గట్టిగా అరిచాడు.

డిటెక్టివ్ అశ్వద్ధామ, బస్సు కంపెనీ మేనేజర్ బస్సులో ప్రవేశించారు. అశ్వద్ధామ తన కిరువైపులా సీట్లమీద కూర్చున్న మనుష్యులనుచూస్తూ ముందుకు వెళ్తున్నాడు. ముందు భాగంలో ఎడంవైపు సీటుమీద కూర్చున్న జయదేవ్ అతని కళ్ళకు కనిపించాడు.

అశ్వద్ధామ జయదేవ్ సీటు దగ్గరకి వెళ్ళాడు "మిస్టర్ జయదేవ్ మీరు నాతో రండి. మీ సామానులూ అవీ కూడా తీసుకోండి" అన్నాడు అశ్వద్ధామ.

"ఎవరు మీరు?" జయదేవ్ కోపంగా అరిచాడు.

"కాస్సేపట్లో తెలుస్తుంది."

"తెలిస్తేగాని నేను రాను. నాకు అర్జెంటు పనుంది."

"ఎంత అర్జెంటుపనున్నా రాక తప్పదు" అశ్వద్ధామ జయదేవ్ చెయ్యిని పట్టుకుని బలంగా పైకి లాగాడు.

"వదలండి. పెద్దమనిషిలా ప్రవర్తించండి. వస్తాను, పదండి" అన్నాడు జయదేవ్.

అశ్వద్ధామ, జయదేవ్, వెనకబస్సు కంపెనీ మేనేజర్ కిందకీ దిగారు.

"ఈ సామానులను ఆ కారులో పెట్టండి" అన్నాడు అశ్వద్ధామ. ఒక కూలీ ఆ సామానులను పట్టుకెళ్ళి కారు డిక్కీలో పెట్టాడు.

బస్సు కంపెనీ మేనేజర్‌కి థాంక్స్ చెప్పి అశ్వద్ధామ జయదేవ్‌ని కారువద్దకు తీసుకువెళ్ళాడు. ముందు సీటుమీద అతనిని కూర్చోబెట్టాడు. మిస్ సురేఖ జయదేవ్ పక్కనే కూర్చుంది. వెనక కూర్చున్న శర్మ, జయదేవ్ వైపు భయంతో చూస్తున్నాడు.

తన జేబులో వున్న పిస్టల్ని డిటెక్టివ్ అశ్వద్ధామ, సురేఖకి అందించారు. కారుని పోనివ్వసాగాడు.

"నన్నీవిధంగా బలాత్కారంగా ఎక్కడికి తీసుకుపోతున్నారు? నన్ను పోనివ్వండి" అరిచాడు జయదేవ్.

"మీరు బుద్ధిగా వుంటే ఏ ప్రమాదమూ రాదు. మీరు ఏదేనా చెయ్యడానికి ప్రయత్నిస్తే రేఖ చేతిలో వున్న పిస్టల్ వైపు ఒకసారి చూడండి. ఆమె షూట్ చేస్తే బతకడం బహుకష్టం."

"ఇంతకీ మీకేం కావాలి?"

"మీరు కృష్ణమూర్తి ఇంట్లో మేడమీద గదిలో వుండే

వారు. ఇంత హఠాత్తుగా ఇవాళ తెల్లవారుఝామున ఎందుకు ఖాళీచేసి వెళ్ళిపోయారు?''

"రాత్రి నాకు టెలిగ్రామ్ వచ్చింది. మా తండ్రిగారు ప్రమాదస్థితిలో వున్నారు. అందువలన గది ఖాళీచేసి ఇలా రావలసి వచ్చింది.''

"ఆ టెలిగ్రాము మీవద్ద వుందా?''

"చూశాక ఎక్కడో పడేశాను.''

"వెతికితే దొరుకుతుందా?''

"నా దృష్టిలో చదివేసిన టెలిగ్రాములు తినిపారేసిన విస్తరాకులతో సమానం.''

"మీ తండ్రిగారు బెంగళూరులోనే వున్నారా?''

"బెంగుళూర్‌లో కాదు. టుంకూరులో వుంటున్నారు.''

"మీ తండ్రిగారి పేరు, అడ్రసు తెలపండి?''

"ఆయన పేరు గోపీచంద్. ఈ మధ్యనే ఆ వూళ్ళో నివశించడం ప్రారంభించారు.''

కారు స్పీడు తగ్గింది. కబన్ పార్కులో అశ్వద్ధామ కారు ఆపాడు.

"డిక్కీలో వున్న మీ పెట్టె, పరుపూ సోదాచెయ్యాలి?''

"చేసుకోండి'' అన్నాడతను ఒక తాళంచెవిని అశ్వద్ధామకి అందిస్తూ.

డిటెక్టివ్ అశ్వద్ధామ కారు డిక్కీని తెరిచి అతని సామానులను సోదాచేసి, డిక్కీ మూసి, కాస్సేపట్లో తిరిగి వచ్చాడు. ఆలోచిస్తూ స్టీరింగ్ వీల్ వెనుక కూర్చున్నాడు. చటుక్కున జయదేవ్ కోటు జేబుల్లోని వస్తువులను తడవసాగాడు. మనీపర్సుని బయటకు లాగాడు. తెరిచిచూశాడు. పర్సులో నూట ఇరవై రూపాయలు కొంత చిల్లర మాత్రం వుంది. ఒక రిసీట్‌ని అశ్వద్ధామ జాగ్రత్తగా పరిశీలించాడు.

ఆ రోజు ప్రొద్దుట సెంట్రల్ స్టేషన్‌లోని లెఫ్ట్‌లగ్గేజి ఆఫీసు ఇచ్చిన రిసీట్ అది.

"ఇదేమిటి?" అడిగాడు అశ్వద్ధామ.

"చూస్తే తెలుస్తోందిగా? పొద్దుటే నా సామానంతా పట్టుకుని సెంట్రల్ స్టేషన్‌కి వెళ్ళాను. సాయంత్రందాకా ట్రెయిన్ లేదట. కొంత సామాను లెఫ్ట్ లగ్గేజి ఆఫీసులో పెట్టి రిసీట్ తీసుకున్నాను. పెట్టె, బెడ్డింగ్ మాత్రం పట్టుకుని బస్సులో ప్రయాణం చేశాను."

"మిస్టర్ జయదేవ్, మీరు మాతో మద్రాసు రావాలి. ఏరోడ్రోమ్‌లో విమానం సిద్ధంగా వుంది. ఈ రిసీట్‌కి సంబంధించిన సామానులో ఏముందో తెలిస్తేగాని మిమ్మల్ని వదలివెయ్యడానికి వీలుపడదు" అన్నాడు అశ్వద్ధామ గంభీరంగా.

"ఇంతవరకూ మీరేంచేసినా నోరు మూసుకుకూర్చున్నా. ఏ పోలీసు ఆఫీసరూ భారత పౌరులని బాధపెట్టడు. టుంకూర్‌లో నా తండ్రి ప్రాణం పోతుంటే మీరు నన్నీ విధంగా బంధించి నిందించడం చూస్తూంటే అసహ్యంగా వుంది" అన్నాడతను కోపంగా.

జయదేవ్ తటాలున సురేఖను తొయ్యబోయాడు. కాల్లోంచి బయటకు వురకబోయాడు!

మిస్ సురేఖ పిస్టల్ని అతని నుదురువైపు గురిపెట్టి కదలపద్దని హెచ్చరించింది. మరేం గత్యంతరంక జయదేవ్ కారు సీటుమీద చతికిలబడ్డాడు.

కారు స్పీడుగా ఏరోడ్రోమ్ వైపు దూసుకుపోయింది.

8

రాత్రి తొమ్మిదింటికి విమానం మీనంబాకం ఏరోడ్రోమ్‌లో దిగింది.

నలుగురూ బయటనున్న కాడిలాక్ కారులో కూర్చు న్నారు. కాస్సేపట్లో కూలీలు పట్టుకొచ్చిన జయదేవ్ సామానులను డిక్కీలో పెట్టించి అశ్వద్ధామ కాడిలాక్ కారుని స్పీడుగా సెంట్రల్ స్టేషన్ వైపు పోనివ్వసాగాడు.

స్టేషన్ ముందు కారుని ఆపి అశ్వద్ధామ కిందికి దిగాడు. జయదేవ్‌ని జాగ్రత్తగా చూసుకోమని సురేఖనీ, వెనుక సీట్లో కూర్చున్న శర్మని హెచ్చరించి, అశ్వద్ధామ స్టేషన్ లోపలకు వెళ్ళాడు.

ఒక చిన్న ట్రంకు పెట్టెతో అయిదు నిమిషాల్లో తిరిగి వచ్చాడు, స్టీరింగ్ వీల్ వెనుక కూర్చున్నాడు. కారు లోపల లైటు వెలుగుతుంది. పెట్టె అశ్వద్ధామ ఒళ్ళో వుంది.

"మిస్టర్ జయదేవ్ దీని తాళంచెవి ఇస్తారా?"

జయదేవ్ జేబులు తడిమి చూసుకున్నాడు.

"ఎక్కడ పడేశానో జేబులో లేదు" అన్నాడు గాభ రాగా.

"రేఖా!" అశ్వద్ధామ పిలిచాడు.

మిస్ సురేఖ తన హేండ్ బాగ్ తెరిచి ఒక విచిత్ర మైన తాళం చెవిని అతనికి అందించింది. దానితో అశ్వద్ధామ క్షణంలో తాళం తెరిచాడు. జయదేవ్ ఇటూ అటూ కదుల్తున్నాడు. వెనుక కూర్చున్న శర్మ ముందుకి వంగి తదేకంగా చూస్తున్నాడు. అశ్వద్ధామ పెట్టెను తెరిచాడు.

"అవన్నీ శారద నగలే. నా భార్యవి! నా భార్యవి!!" శర్మ అరుస్తూ వెక్కి వెక్కి ఏడ్వసాగాడు.

అశ్వద్ధామ పెట్టెను మూశాడు. తాళం వేశాడు. చెవిని సురేఖకి అందించి కారుని స్టార్టుచేశాడు.

కాడిలాక్ కారు శరవేగంగా పోలీసు హెడ్ క్వార్టర్స్

వైపు వెళ్తోంది. జయదేవ్ చలనంలేనట్టు కూర్చుండి పోయాడు. వెనుకనుంచి శర్మ మాత్రం అప్పుడప్పుడు నిట్టూర్చుతున్నాడు.

కాస్సేపట్లో కాడిలాక్ కారు పోలీస్ హెడ్ క్వార్టర్స్ ఆవరణలో ఆగింది. అశ్వద్ధామ, సురేఖ, శర్మ బయటకు దిగారు. జయదేవ్ మాత్రం దిగలేదు.

"జయదేవ్ బయటకు రా" అన్నాడు అశ్వద్ధామ.

జయదేవ్ నోటమ్మటి జవాబురాలేదు. క్షణంలో కారు స్టార్టు అయింది. జయదేవ్ కారుని వెనక్కి పోనివ్వ సాగాడు. శర్మ అరుస్తున్నాడు. వెనుక తలుపు తెరిచి వుంది. కాని జయదేవ్ రయ్యిన వెనక్కి కారుని పోనిచ్చాడు.

"ఆ కారులో నువ్వెక్కువ దూరం పారిపోలేవు— ఆగు!" అశ్వద్ధామ గట్టిగా అరిచాడు.

అరుపులు విని కొంతమంది పోలీస్ కానిస్టేబుల్స్ బయటకు పరుగెత్తుకు వచ్చారు. కాడిలాక్ కారు గేటు దాట బోతోంది.

మిస్ సురేఖ గబగబా ముందుకి పరుగెత్తింది. గురి చూసి పిస్టల్ పేల్చింది. ముందు టైరు చటుక్కున బరస్ట్ అయింది.

కాని ఆ స్థితిలోనే జయదేవ్ గేటు దాటాడు. పోలీస్ కానిస్టేబుల్సు గేటువైపు పరుగెత్తారు. కొంచం దూరం వెళ్ళి కాడిలాక్ కారు కదలలేక ఆగిపోయింది.

డిటెక్టివ్ అశ్వద్ధామ, సురేఖ, శర్మ, కానిస్టేబుల్స్ కారుని చుట్టేశారు.

జయదేవ్‌ని బయటకు లాగి దింపారు. కానిస్టేబుల్స్ జయదేవ్‌ని గట్టిగా పట్టుకొని హెడ్ క్వార్టర్స్‌లోకి తీసుకు

వెళ్ళారు.

అశ్వద్ధామ, సురేఖ, శర్మ, వాళ్ళను వెంబడించారు.

9

ఆ రోజు రాత్రి పదయింది..

అశ్వద్ధామ ఏర్‌కండీషన్డ్ గది అనేక మందితో కిటకిట లాడుతోంది. గదిలోని ఫ్లోరసెంటు దీపాలు ప్రకాశ వంతంగా వెలుగుతున్నాయి. కొంచెం దూరంలో అనేక రంగు కాంతుల్లో మెరస్తూ నీళ్ళల్లో ఈదుతున్న చేపలవైపు అందరూ ఆనందంగా చూస్తున్నారు. ఒక్కొక్కళ్ళే సోఫాల్లో కూర్చోడం ప్రారంభించారు.

అశ్వద్ధామ సిగరెట్ పొగపీలుస్తూ గదంతా కలయ జూశాడు.

అందరూ తనకు తెలిసిన మొహాలే. ఇనస్పెక్టర్ ప్రతాప్, శర్మ, పాలవాడు సత్యం. అతనిభార్య లక్ష్మి, కృష్ణమూర్తి, మరుగుజ్జు మంజూ కొందరు కానిస్టేబుల్స్ తలుపు దగ్గరగా నిలబడ్డాడు.

మిస్ సురేఖ రిఫ్రిజిరేటర్‌లోని కూల్‌డ్రింక్‌లు తీసి మరుగుజ్జు మంజూకి అందిస్తోంది. మిస్ సురేఖ తన పని పూర్తి చేసి అశ్వద్ధామ పక్కనున్న సోఫాలో చతికిలబడింది.

ఇనస్పెక్టర్ ప్రతాప్ సగర్వంగా అశ్వద్ధామ వైపు చూశాడు.

“అశ్వద్ధామగారూ, ఇవాళ తెల్లారుజామున హత్య జరిగింది. రాత్రి తొమ్మిదికల్లా హంతకుడిని, అతను దొంగిలించిన నగల్ని మాకు పళ్ళెంలో పెట్టినట్టు మీరు అందించారు. మా పోలీస్ డిపార్టుమెంటు తరపున మీకు జోహార్లు అర్పిస్తున్నాను” అన్నాడు ఇన్‌స్పెక్టర్ ప్రతాప్.

"ఇవాళ ప్రొద్దుట లక్ష్మిని చూస్తూంటే నా గుండె కరిగి పోయింది. పాలవాడూ భార్య అయిదు ఏళ్ళగా మా యింటి కొచ్చి పాలు పితికిపోస్తున్నారు. అతడీ హత్య చేశాడంటే నేను ఎంమవల్లనో నమ్మలేకపోయాను. అతడు నిర్దోషని నిరూపించి లాకప్‌లోంచి ఇవాళే విడిపించినందుకు నాకెంతో ఆనందంగా వుంది" అన్నాడు అశ్వద్ధామ.

గదిలో నిశ్శబ్దంగా వుంది.

"అశ్వద్ధామగారూ, మీ అనుమానం జయదేవ్ మీదకు యెలా వెళ్ళిందో చాలా ఆశ్చర్యంగా వుంది" అన్నాడు శర్మ.

"అంతా వివరంగా చెప్పండి" అన్నాడు ఇన్‌స్పెక్టర్ ప్రతాప్.

డిటెక్టివ్ అశ్వద్ధామ ఇలా చెప్పసాగాడు.

"మద్రాసు మహాపట్నంలో పాలవాళ్ళందరూ తెల్లవారు జామున యిళ్ళకి వచ్చి పాలుపోసి వెళ్తూంటారు. పాలవాడి కేక వినగానే ఇంటి యజమానురాలు గిన్నె పట్టుకుని పరు గెత్తుకు వెళ్తుంది. ఆ సమయంలో యింట్లోని వాళ్ళందరూ నిద్రపోతూ వుండొచ్చు. కాని ఇంతవరకూ ఏ హత్యా ఈ విధంగా జరగలేదు. శారద హత్య క్షణంలో జరిగి పోయింది.

"నేను మొదటినుంచీ పాలవాడిని అనుమానించలేను. నా అనుమానం ఆమెభర్త శర్మమీదకు వెళ్ళింది. కాని ఆయన హృదయాన్ని తరువాత అర్థం చేసుకోగలిగాను. భార్యంటే ఆయనకెంతో ప్రేమ. శారదను పాలవాడూ శర్మగారూ చంపకపోతే మరెవరో చంపి వుండాలి. నా పరిశోధన ముందుకి వెళ్ళదేమో అని భయపడ్డాను.

"అప్పుడు శర్మగారి యింటికి యెదురుగా వున్న జయదేవ్ గదిలోకి వెళ్ళడం తటస్థించింది. జయదేవ్ గది కిటికీవద్ద నిలబడితే యెదురుగావున్న శర్మగారి యిల్లు స్పష్టంగా అవుపడుతుంది. శర్మగారు కానిస్టేబుల్‌తో ఏదో మాట్లాడుతున్నారు. అదే విధంగా ప్రతిరోజూ పాలవాడొచ్చి పాలు పోస్తూంటే అతడినీ, శారదనీ చీకట్లో నిలబడి చూసే అవకాశం జయదేవ్‌కి వుంది. దానితో నాలో అనుమానం మొలకెత్తింది. దానికి తోడు అతడు హత్య జరగగానే తెల్లవారుజామునే గది ఖాళీచేసి వెళ్ళిపోవడం నా అనుమానాన్ని యింకా పెంచింది.

"శారద హత్య చాలా విచిత్రంగా జరిగింది. జయదేవ్ యెదురింట్లో మేడమీద గదిలో వుంటున్నాడు. అతడు ఉద్యోగానికి తిరుగుతున్నాడని కృష్ణమూర్తి పొరబడ్డాడు. నిజం చెప్పాలంటే జయదేవ్ నిరుద్యోగి కాదు. చాలా కాలంనుంచీ అతను ఎన్నో దొంగతనాలు చేస్తున్నాడు.

"ప్రతిరోజూ శారద పాలవాడి కేక వినగానే ఇంట్లోంచి ఆమె బయటకు వచ్చేది. జయదేవ్ కూడా నిద్రలేచి కిటికీ వద్దకు జరిగేవాడు. ఆమె మెళ్ళో నగలు మెరస్తూ అతని కళ్ళకు స్పష్టంగా అగుపించేవి. వాటిని అపహరించాలనే దుర్బుద్ధి అతనిలో పుట్టింది. పాలవాడి కేక శారదను అవలీలగా బయటకు రప్పించే విధానాన్ని జయదేవ్‌కి సూచించింది.

"ప్రతిరోజూ తెల్లవారుజామున అయిదున్నర ప్రాంతంలో శారదింటికి పాలవాడు వస్తూంటాడు. ఇవాళ పాలవాడికంటె ముందు జయదేవ్ శారద ఇంటికి వెళ్ళాడు. గుమ్మంలో నిలబడ్డాడు. 'అమ్మా పాలు' అని అరిచాడు.

ఈ కేక శర్మగారు కూడా విన్నారు.

"శారద గిన్నె పట్టుకుని తలుపు తెరుచుకుని బయటకు వచ్చింది. ఎదురుగా చేత్తో కత్తి పట్టుకొని నిలబడ్డ వ్యక్తిని చూడగానే ఆమె యెంత భయపడిందో మనం వూహించ లేము. ఆమె అరవబోయి వుంటుంది. ఆ ప్రమాదం లేకుండా ఆమె నోరునొక్కి గట్టిగా మూసేసి జయదేవ్ ఆమెను గుండెల్లో పొడిచి హతమార్చాడు. ఆమె చావుకేక సమీపంలో వున్న వాళ్ళకు వినిపించలేదు. మెళ్ళోవున్న నగలు తీసుకుని జయదేవ్ యెదురుగా వున్న తన గదిలోకి వెళ్ళిపోయాడు.

"జయదేవ్ వెళ్ళిపోయిన కాస్సేపట్లో అసలు పాలవాడు 'అమ్మా పాలు!' అంటూ గుమ్మంవైపు నడిచాడు. తలుపు తెరిచేవుంది. శారద వెల్లకిలా పడుంది. గుండెల్లో దిగిన కత్తిని చూడగానే పాలవాడికి భయంవేసింది. పాలవాడి కేక శర్మగారికి వినిపించింది. ఆయన బయటకొచ్చి చూశారు. అప్పుడే భయంతో వెళ్ళిపోబోతున్న పాలవాడిని పరుగెత్తుకెళ్ళి పట్టుకున్నారు. కాని అతనివద్ద నగలులేవు.

"శర్మగారు నాతో మాట్లాడుతూ పాలవాడు 'అమ్మా పాలు!' అని రెండుసార్లు అరిచినట్లు చెప్పారు. పాలవాడు ఒకసారి అరిచి గుమ్మంలోకి చేరుకునేసరికి అక్కడ శారద శవం పడివుంది. ఆ పరిస్థితుల్లో అతను మళ్ళా 'అమ్మా పాలు' అని అరవవలసిన అవసరం వుండదు. దీన్నిబట్టి ఆలోచిస్తూంటే మొదటిసారి 'అమ్మా పాలు' అని మరెవరో అరిచారని నేను తార్కికంగా వూహించాను. దీనిమూలంగా ఎదురుగావున్న మేడగదిలో వుంటూన్న జయదేవ్‌మీద నా అనుమానం పెరిగింది.

"ఆలస్యంచేస్తే హంతకుడు పారిపోవచ్చు. అదృష్ట వశాత్తూ ఇవాళ నా పరిశోధనకి అనేకమంది సహాయపడ్డారు. బెంగుళూర్ వెళ్ళి బస్‌స్టాండ్‌లో జయదేవ్‌ని పట్టుకుని విమానంలో మద్రాసుకి తీసుకొచ్చాను. శారద హంతకుడు, శారద నగలు అన్నీ దొరికాయి. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ మనందరం కాస్సేపు నిశ్శబ్దంగా వుందాం."

గదిలో ఓ నిమిషంపాటు అందరూ మౌనం వహించారు. శర్మ కళ్ళు తుడుచుకుంటున్నాడు.

ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ సోఫాలోంచి లేచినిలబడ్డాడు. అశ్వద్ధామతో కరచాలనంచేసి అన్నాడు. "అశ్వద్ధామగారూ, మీరు చెప్పినట్లే అంతా జరిగింది. జయదేవ్ మాకు స్టేట్‌మెంటు ఇచ్చాడు. అయిదేళ్ళనుంచీ అతను ఎన్నో దొంగతనాలు చేస్తున్నాడు. అనేక పట్నాలలోని పోలీసువాళ్ళు అతనికోసం గాలిస్తున్నారు. జయిదేవ్‌మీద వారం రోజుల్లోగా ఛార్జిషీటు ఫైలుచేస్తున్నాను. వెళ్లొస్తాను."

ఇన్‌స్పెక్టర్ ప్రతాప్, సురేఖకి నమస్కరించి శర్మనీ, కృష్ణమూర్తినీ వెంటబెట్టుకుని బయటకు వెళ్ళిపోయాడు.

ఏర్ కండిషన్డ్ గది ఖాళీగావుంది. అశ్వద్ధామ పక్క కూర్చున్న సురేఖను ఆప్యాయంగా తనవైపు లాక్కున్నాడు. ఆమె కళ్ళలోకి ఆవేశంతో చూస్తూ పెదిమలమీద ముద్దుపెట్టుకున్నాడు. ఫ్రిజిడైర్ పక్కనే సీసాల చప్పుడయింది. కాస్సేపట్లో మరుగుజ్జు మంజూ మెల్లిగా గుమ్మంవైపు నడుస్తోంది.

"మంజూ, నువ్వు ఏ సోఫా వెనకో నిలబడితే కళ్ళకు కనిపించవు!" అన్నాడు అశ్వద్ధామ నవ్వుతూ.



వాణిశ్రీ

కాంచన గ్రహం

(గత సంచిక తరువాయి)

అవి బయద్దేరినప్పుడు రాత్రి పన్నెండయింది. ఐదు నిమిషాలలో నేను విజిలెన్స్ డైరెక్టర్‌కి ఫోన్‌చేసి సమాచారం చెప్పగలిగాను. ఆ విధంగానే ఆయన తెల్లవారు జామున నగరానికి చేరుతున్న లాకీలు పట్టుకోవడం జరిగింది. అందు కాయన్ని. సిబ్బందిని అభినందిస్తున్నాను.

అప్పుడు డ్రైవర్లు, క్లీనర్లు తమకి యేమీ తెలియదని బుకా యించారు. కాని కొద్దిసేపటి తర్వాత ఆ లారీలు నా ప్రోద్బలం మీద బయల్దేరాయని వాళ్ళు స్టేట్‌మెంట్ యిచ్చారు.

అంటే సిమెంట్ పట్టుబడిందని కంట్రాక్టర్‌గారికి తెలిసి ప్లేటు ఫిరాయించాడన్న మాట.

చూశారా? గమ్మత్తు. నన్ను అరెస్ట్ చేశారు. నేను సిమెంట్ దొంగిలించానని కేసుపెట్టారు. బలమైన సాక్ష్యాధారాలు వున్నాయి. గోడౌన్ వాచ్‌మాన్ చెప్తాడు నన్ను కొట్టి తాళాలు పగలకొట్టింది చైతన్య అని. లారీల వాళ్లూ అదే పాట. కాబట్టి నాకు శిక్ష పడుతుంది. అంటే దొర దొంగగా జైల్లోకి పోతాడు. దొంగ దొరలా విచ్చలవిడిగా తిరుగుతూ వుంటాడు.

ఇటువంటి అన్యాయాన్ని నేను సహించను. ఎదిరించి తీరతాను. అందుకే జైల్లోంచి తప్పించుకున్నాను. నిజా నిజాలను ప్రజలకు తెలియజేస్తారని మీకు చెప్పడం జరిగింది.

ఈ విషయంలో నేను అధికారులను హెచ్చరిస్తున్నాను. అసలు దొంగను అంటే కాంట్రాక్టర్ గోవిందరాయుడ్ని వెంటనే అరెస్ట్ చెయ్యాలి. నా మీద పెట్టిన దొంగకేసు వుపసంహరించుకోవాలి.

రెండురోజులు గడువు ఇస్తున్నాను.

అలా జరగకపోతే దొరనైన నన్ను దొంగని చేసినందుకు ప్రతిగా దొంగగా కంటిన్యూ అవుతాను. నిజంగానే దొంగతనాలు చేస్తాను. దేశాన్ని అల్లకల్లోలం చేస్తాను.

ఇదే నా ప్రతిజ్ఞ."

చైతన్య ఆవేశంగా చెప్పాడు.

విలేఖరులు అతన్ని చుట్టుముట్టి ప్రశ్నలు అడిగారు.

"మీరే పట్టిచ్చారని గోవిందరాయుడు యెలా వూహించాడు?"

"నేనే చేసివుంటాడని ఆయనకు తెలుసు. మా ఇద్దరికీ విరోధం మొదలైంది."

"మీకు విరోధం యెందుకు?"

"అవి స్వంత విషయాలు. క్షమించండి."

"మీరు ఏం చదువుకున్నారు?"

"ఎమ్మెస్సీ!"

"మీరు ఏం చేస్తున్నారు?"

"గోవిందా కనస్ట్రక్షన్ కంపెనీలో పనిచేశాను మూడేళ్ళ క్రితం."

"ఇప్పుడేం చేస్తున్నారు?"

"ఇంకా ఏమీలేదు."

"చైతన్య అంటే మూడేళ్ళ క్రితం గ్రహవాసులు కిడ్నాప్ చేశారని సంచలనం రేగింది మీరేనా?"

"ఆ గొడవల్లో నా పేరే ప్రముఖంగా మ్రోగిందని ఇప్పుడు తెలిసింది."

"మిమ్మల్ని పరాయి గ్రహవాసులు కిడ్నాప్ చేశారా? మూడేళ్ళు మీరు అక్కడే వున్నారా?"

"క్షమించండి. అవన్నీ యిప్పుడు చెప్పలేను. ముందు ముందు మీకే తెలుస్తుంది. దాన్ని గురించి దయచేసి యిప్పుడు ఏమీ అడక్కండి."

చైతన్య నమస్కారం చేసాడు.

విలేఖరుల సమావేశం ముగిసింది.

చైతన్యను అరెస్ట్ చెయ్యడానికి పోలీసులు రెడీగా వున్నారు.

అక్కడున్న బాయ్‌ని చైతన్య ప్రక్కకు పిలిచి "బాత్ రూమ్ ఎక్కడ?" అని అడిగాడు.

అతను చూపించాడు.

"మిమ్మల్ని అరెస్ట్ చెయ్యడానికి పోలీసులు రెడీగా వున్నారు" అన్నాడు ఒక విలేఖరి.

కృష్ణచైతన్య నవ్వాడు.

"ఇంపాజిబుల్" అన్నాడు.

విలేఖరి తెల్లబోయాడు.

అలాగే జరిగింది.

చైతన్య బాత్‌రూమ్ వైపు వెళ్ళడం అంతా చూశారు. తిరిగి రావడం ఎవరూ చూళ్ళేదు.

గంట. రెండు గంటలు.

బాత్‌రూమ్‌లో ఎవరూలేరు.

అంతా తెల్లబోయారు.

ప్రెస్ క్లబ్‌లోకి అతను ఎలా వెళ్ళాడు?

తిరిగి ఎలా వచ్చాడు?

సమాధానంలేని ప్రశ్నలుగా మిగిలిపోయాయి.

మర్నాడు పేపర్లో కృష్ణచైతన్య స్టేట్‌మెంట్ ప్రముఖంగా ప్రచురించారు.

అతను ప్రభుత్వానికి చేసిన సవాల్ సాహసోపేతమైనదని పొగిడారు.

దొంగని వదిలిపెట్టడం దొరలను దొంగలుగా తయారుచేసే పద్ధతి ఏహ్యమైన పని అని కొన్ని పత్రికలు సంపాదకీయాలు వ్రాశాయి.

అవినీతిని ఎదిరించే వారిని దొంగలుగా మారుస్తుందా

ప్రజాసామ్యం? అని కొశ్చెన్ మార్కు వేసింది ఒక పత్రిక.

జైలు నుంచి తప్పించుకుని విలేఖరుల సమావేశం ఏర్పాటుచేయడం ఒక చరిత్ర సృష్టించిన సంఘటన. అతను గుండెలు తీసినబంటు అని, సత్యానికున్న బలంవల్ల అతను ధైర్యం ప్రదర్శించాడనీ పొగిడారు.

ప్రభుత్వం నిజానిజాలను తెలుసుకుని ప్రవర్తించక పోతే రానున్న ప్రమాదం గురించి పత్రికలు హెచ్చరించాయి.

కృష్ణచైతన్య ఫోటో అన్ని పత్రికలలోనూ పడింది. ఎవరైనా అతన్ని సులభంగా గుర్తుపట్టొచ్చు. కాబట్టి అతన్ని పట్టియిచ్చిన వారికి గాని ఆచూకీ తెలియజేసిన వారికి గాని పదివేలు బహుమతి యిస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

అయితే అతను పోలీసులకు చిక్కలేదు.

ప్రజల నుంచి సమాచారం రాలేదు.

గోవిందరాయుడు పేపర్లో చదివి హడలిపోయాడు. చైతన్య తనకి పట్టిన సైతాన్ అని తిట్టుకోసాగాడు.

అరుణతార ఏమీ మాట్లాడటంలేదు.

అతనిలో ఏదో అసాధారణమైన శక్తి దాక్కుని వున్నట్లుగా ఆమె గ్రహించింది.

అతనికి ఎలా వచ్చింది ఆ శక్తి?

13

రెండురోజులు గడిచిపోయాయి.

ప్రభుత్వం గోవిందరాయుడ్ని అరెస్ట్ చెయ్యలేదు. కృష్ణ చైతన్య మీద పెట్టినకేసు వుపసంహరించుకోలేదు.

అతన్ని అరెస్ట్ చెయ్యడానికి పోలీసులు అహర్నిశలూ ప్రయత్నిస్తూనే వున్నారు. అతని ఫోటో అన్ని పోలీస్

స్టేషన్లలోనూ అలంకరించారు.

చైతన్య స్టేట్‌మెంట్ దౌర్జన్య పూర్వకంగా వుందనీ, చట్టాన్ని అతను శాసించడానికి ప్రయత్నిస్తున్నాడనీ, ఏమైనా దౌర్జన్యాన్ని ప్రభుత్వం సహించదనీ అధికార ప్రకటనలు వెలువడ్డాయి.

వెండికొండ ప్రాజెక్టులో రిజర్వాయర్ ఒడ్డునే వుంది గెస్ట్‌హౌస్. దాంట్లో రెండే సూట్లు వున్నాయి. వాచ్‌మాన్, కుక్ వున్నారు.

పెద్దపెద్ద వృక్షాల మధ్య అందమైన చిన్న కుటీరంలా వుంటుంది. ఏ మాత్రం అలజడి లేకుండా ప్రశాంతంగా వుంటుంది అక్కడ.

చైతన్య వేషం మార్చేశాడు. తలపాగా పెట్టి గడ్డం అతికించుకున్నాడు. రాంసింగ్ పేరుతో గెస్ట్‌హౌస్‌లో దిగాడు. ఆతను నీలంరంగు జీపులో ప్రయాణం చేసి దాన్ని గెస్ట్‌హౌస్ షెడ్‌లో పెట్టాడు. దాని నెంబరు ఎ.బి.సి. సూటపదకొండు.

తనకు ఇష్టమైన ఐటమ్స్ తయారు చేయించుకుని డిన్నర్ చేశాడు.

రాత్రి తొమ్మిది దాటింది.

ఏ.సి. ఆన్ చేసి ఫోం బెడ్‌మీద పడుకొని టెలిఫోన్ రిసీవర్ చేతిలోకి తీసుకుని నెంబర్ డైల్ చేశాడు.

"హల్లో" అన్నారు ఎవరో.

"ఎవరూ? గోవిందరాయుడుగారు లేరా?"

"ఇంకా ఇంటికి రాలేదు సార్! ఏదో పార్టీ వుందన్నారు. రాత్రికి భోజనం అక్కర్లేదని చెప్పి వెళ్ళారు."

"ఎవరు మాట్లాడేది?"

"నేను మల్లయ్యను సార్."

"మీ అయ్యగారు యెక్కడ ఉన్నారుందో చెప్పలేదా?"

"మానస సరోవర్‌లో అన్నారు సార్!"

"వెరీగుడ్ ఫోన్ పెట్టెయ్!"

"మీ రెవరు సార్?"

"ఫోన్ పెట్టెయ్" గట్టిగా అన్నాడు చైతన్య.

మానస సరోవర్ రూఫ్ గార్డెన్లో పార్టీ మొదలైంది.

వెన్నెల కిరణాలు చిక్కగా జారుతున్నాయి.

రిజర్వాయర్ ప్రశాంతంగా అద్దంలా మెరుస్తోంది.

వెన్నెల్లో మానస సరోవర్ భవనం వెన్నముద్దలా కనిపిస్తోంది.

రూఫ్ గార్డెన్ పిట్టగోడల మీద క్రోటన్ మొక్కలకు రంగు రంగుల డెకరేషన్ బల్బులు పళ్ళగుత్తులా వ్రేలాడుతూ తళతళలాడుతున్నాయ్.

కోటిరూపాయల కాంట్రాక్టు తనకు వచ్చినందుకు ఒక కంట్రాక్టర్ మిత్రులకు పార్టీ ఇస్తున్నాడు. అందులో వాళ్ళ సహకారం చాలా వున్నందున అది అడ్వాన్సు మాత్రమే.

క్వింటాల్ బియ్యం బస్తాకన్నా భారీగానే కనిపిస్తున్నారు అంతా. అంతా ఏభై ఏళ్ళ పైబడ్డ వాళ్ళే. తెల్లటి గ్లాస్కో లాల్చీలు, ఖద్దరు పంచెల్లో యూనీఫాంలో వున్న మిలటరీ అధికారుల్లా వున్నారు.

అందులో అరడజను మందే వున్నా టేబుల్‌మీద రకరకాల నాన్ వెజిటేరియన్ ఐటమ్స్ భారీ ఎత్తున వున్నాయి. గాజుగ్లాసులు ఖాళీ అవుతున్నప్పుడల్లా రాయల్ సెల్యూట్ విస్కీ నింపి ఐస్ క్యూబ్స్ వేసి అందిస్తోంది అప్సరలాంటి అందగత్తె.

పార్టీలో ఆఖరి ఐటమ్‌గా నగరం నుంచి తెప్పించిన

దేవకన్యలు వాళ్ళతోపాటు విస్కీ పుచ్చుకుంటూ బూతులు మాట్లాడుకుంటూ నవ్వులు వడిస్తున్నారు.

పార్టీ మధ్యలో పానకంలో పుడకలా టెలిఫోన్ గణ గణమంది.

అరడజను మంది అమ్మాయిల్లో ఒకమ్మాయి రిసీవర్ ఎత్తి "హలో!" అంది తియ్యటి కంఠంతో.

"హలో ఎవరు మాట్లాడుతున్నారు?"

"నేను రిసెప్షనిస్టుని" నవ్వింది ఆమె.

"గోవిందరాయుడుగారు వున్నారా?"

ఆమె రిసీవర్‌కి తన అరచేతిని అడ్డంపెట్టి "గోవింద రాయుడుగారు ఎవరు?" అంది.

అప్పుడు గోవిందరాయుడు వులిక్కిపడి, "నేనే! ఎవరో అడుగు" అన్నాడు.

"ఉన్నారు....మీ రెవరో కనుక్కోమన్నారు."

"నా పేరు చైతన్య అని చెప్పండి."

"ఎవరో చైతన్య అట సార్."

గోవిందరాయుడు కలవరపడుతూ రిసీవర్ అందు కున్నాడు. తను కంగారు పడుతున్నట్లు ఎవరూ గమనించ కూడదని ఎంతో ధైర్యం వున్నవాడిలా సీరియస్‌గా ముఖంపెట్టి గట్టిగా గాలిపీల్చి "ఎవరు?" అన్నాడు.

"నమస్తే! గోవిందరాయుడుగారూ!"

"నమస్తే....నమస్తే!"

"నేను చైతన్యను మాట్లాడుతున్నాను."

"ఏమిటి సంగతి?"

"ఏం లేదుసార్! కంగ్రాట్స్ చెబుదామని ఫోన్‌చేశాను. తమరు ఇంట్లో లేరని తెల్సింది. పార్టీలో వున్నారని తెలి సింది. ఎలాగయితేనేంలెండి ఫోన్‌లో దొరికారు."

"కంగ్రాట్స్ ఎందుకు? నేనేం ఘనకార్యం చేశానని?"

"అయ్యో! ఎంతమాట. సిమెంటు కుంభకోణంలో జైలుకు పోవలసినవారు ఆ కేసును ఎంతో తెలివిగా నా మీదకు త్రిప్పి నన్ను దొంగని చేశారుగదా! మీ అద్భుత వాకచక్యానికి జోహార్లు."

"ఇప్పటికయినా తెలిసిందా నా సంగతి. అప్పుడే సంబరపడకు. ముందున్నది ముసళ్ళపండగ. నువ్వు తాత్కాలికంగా పోలీసు కళ్ళల్లో కారంకొట్టి తప్పించుకున్నా ఎప్పటికీ అలానే తప్పించుకోలేవు. ఎప్పుడో దొరక్కపోవు. నీకు జైలు శిక్ష పడకాపోదు."

"అదే మీకు చెప్పాలని....అసలు విషయం ఏమిటంటే ఈరోజు ఏ వారం చెప్పండి."

"శుక్రవారం."

"ఫరవాలేదు గుర్తుందే. అంటే మందు ఇంకా ఎక్కలేదన్నమాట."

"ఏమిటా పిచ్చిమాటలు?"

"సారీ!....అసలు విషయానికి వస్తాను. రేపు అంటే శనివారం రాత్రి నేను మీ ఇంటికి వస్తున్నాను."

గోవిందరాయుడు నవ్వాడు.

"సిగ్గులేదూ నీకు? ఏ ముఖం పెట్టుకుని మా యింటికి రావాలనుకుంటున్నావు? ఆ ఆశ పెట్టుకోకు. తార కూడా నువ్వంటే అసహ్యం పుట్టింది. అది రేపో మాపో అమెరికా వెళ్ళిపోతున్నది."

"నేను చెప్పేది పూర్తిగా వినండి. నేను మీ యింటికి రావాలనుకుంటున్నది వియ్యానికి కాదు. కయ్యానికే."

"ఏమిటి?"

"అవును. మీ ఇంట్లో దొంగతనానికి వస్తున్నాను.

బంగారం, బ్లాక్ మనీ అంతా జాగ్రత్తగా మూట కట్టి వుంచితే నాకు సులభంగా వుంటుంది."

"ఏయ్!...ఏమిటి నువ్వు చెప్పేది?"

"వినపడ్డంలేదా? రేపురాత్రి మీ ఇంట్లో దొంగతనం చేస్తాను. చెప్పి చేస్తాను. చైతన్య ఛాలెంజీ చేసి చేస్తాడు. కాచుకో."

చైతన్య ఫోన్ పెట్టేశాడు.

గోవిందరాయుడి నిషా దిగిపోయింది. ఉత్సాహం చచ్చిపోయింది. శరీరం మంచు ముద్దలా చల్లబడింది.

"ఏమిటి అలా ఐపోయావు? ఎవడా చైతన్య?" అడిగాడు ఒక మిత్రుడు.

"ఏం చెప్పమంటావు గురూ! వాడు నా పాలిట సైతానులా దాపురించాడు." ఏడుపు ముఖంపెట్టి అన్నాడు గోవిందరాయుడు.

"ఏం అంటున్నాడేం?"

"సిమెంట్ పట్టిచ్చిన రాస్కెల్ వీడే గురూ! అయితే అది వాడిమీదికే త్రిప్పికొట్టానుగదా!"

"అవును. జైల్లోంచి పారిపోయి కేసు విత్‌డ్రా చేసుకోమని గవర్నమెంట్‌ని బెదిరిస్తున్నాడటగా!"

"ఆఁ....అవును."

"ఇప్పుడేమంటాడు?"

"రేపు రాత్రి మా ఇంట్లో దొంగతనం చేస్తాడట!" అన్నాడు గోవిందరాయుడు.

"ఓర్నీ అసాయిధ్యం గూలా! చెప్పి చేస్తాడటనా!" అంటూ ఆశ్చర్యపోయాడు ఒకాయన.

"చెప్పి చేస్తారని కథల్లో విన్నాం. సినిమాల్లోచూశాం. కాని...."

"వాణ్ని తరవాత మెచ్చుకోవచ్చు. ముందుగా నేను డియస్పీని కలవాలి" అన్నాడు గోవిందరాయుడు.

"పార్టీ మధ్యలో వెళ్ళిపోతావా?"

"నా బతుకు పార్టీలాగే వుంది. పోతా గురూ!" నీరసంగా అన్నాడు.

"వాడేదో బెదిరిస్తున్నాడుగాని నిజంగా వాడివల్ల అవుతుందా! అయినా రేప్రొద్దున పోలీసులకి చెప్పొచ్చు. ఇప్పుడేం తొందర? కానివ్వు గురూ!" అంటూ నీలం రంగు డ్రెస్సులోవున్న అమ్మాయికి సంజ్ఞ చేస్తూ "అలా చూస్తావేం? అమృతం పొయ్యి మా వాడికి" అన్నాడు ఒకాయన.

నీలంరంగు సుందరి నవ్వుతూ గోవిందరాయుడి గ్లాసులో విస్కీ నింపి అతని మెడచుట్టూ సుతారంగా చేతులువేసి తొడమీద కూర్చుని గ్లాసుని పెదవులకు అందించింది.

గోవిందరాయుడు చైతన్య పీడ కాసేపైనా మర్చిపోవడాని కన్నట్లు విస్కీ గట....గటా....తాగేసి గుటకలు మింగాడు.

14

మర్నాడు పొద్దున్నే లేచి డియస్పీ ఇంటికి వెళ్ళాడు గోవిందరాయుడు.

డియస్పీ నీలం నాయుడు పేపరుచూస్తూ కూర్చున్నాడు.

"ఏమిటి రాయుడుగారూ! ప్రొద్దున్నే దయచేశారు. ఏమిటి విశేషం?" అన్నాడు డియస్పీ.

"ఆ సైతాన్ ఇక్కడకు వచ్చాడు సార్! ఈరోజు రాత్రి మా ఇంట్లో దొంగతనం చేస్తానని రాత్రి ఫోన్‌చేసి బెదిరించాడు."

"ఎవడండీ వాడు?"

"అదేసార్! నా సిమెంట్ దొంగతనంచేసి జైలు నుంచి తప్పించుకున్నవాడు. వాడే సార్ చైతన్య" అన్నాడు గోవిందరాయుడు.

"వాడా? వాడు మళ్ళీ ఇక్కడికి వచ్చాడా?"

"అవును సార్! అదే నాగోల?"

"వాడెవడో మోస్ట్ ఇంటలిజెంట్ ఫెలోలా వున్నాడు. ఎమ్మెస్సీ అటగదా! పేపర్లో వచ్చింది. అఫ్‌కోర్స్ వాడి ఫొటోలు అన్ని స్టేషన్స్‌లో పెట్టామనుకోండి. వాడిమీద అరెస్టువారంటు కూడా వుంది. భయపడకండి. ఈసారి వాడిని పట్టుకుని తీరతాం."

"వాడు రాత్రి తొమ్మిది దాటాక నాకు ఫోన్‌చేశాడు సార్! అంటే అప్పుడేవచ్చి వుంటాడు. మీరు అన్ని గెస్ట్ హౌసులూ, హోటళ్ళూ చెక్‌చేస్తే దొరికిపోతాడు. రాత్రికి శ్రమవుండదు."

"ఆల్‌రైట్ అలాగే వెతికిస్తాను" అంటూ డియస్పీ ఇన్‌స్పెక్టర్‌కి ఫోన్‌చేసి గెస్ట్‌హౌసులు, హోటళ్ళు, సైట్ సీయింగ్ ప్లేసెస్‌లో చైతన్యకోసం వెతకమని ఆదేశాలు ఇచ్చాడు.

పోలీసులు చైతన్య కోసం సెర్చి మొదలుపెట్టారు.

గోవిందరాయుడు కాలుగాలిన పిల్లిలా ఇంట్లోనే తిరగ సాగాడు.

పోలీసులు చీకటి పడేవరకూ హడావుడిగా జీపుల్లో తిరుగుతూనే వున్నారు. వాళ్ళకి చైతన్యజాడ దొరకలేదు.

చీకటిపడ్డాక పోలీసులు గోవిందరాయుడి ఇంటిచుట్టూ ప్రొటెక్షన్ ఏర్పాటుచేశారు. పోలీసుల కళ్ళుబడకుండా కుక్క కూడా లోపలకు పొయ్యే వీలులేదు. అడుగడుక్కీ పోలీసులు వెయ్యికళ్ళతో చూస్తున్నారు.

డియస్పీ హాల్లోనే మకాంపెట్టాడు. ఇన్‌స్పెక్టర్, యస్. ఐ. లు, ఇంటిచుట్టు పెట్రోలింగ్ చేస్తున్నారు స్వయంగా. జరగబోయే దొంగతనం నివారించడానికేకాక అతన్ని అరెస్టు చేస్తే గొప్ప క్రెడిట్ దక్కుతుంది. అన్ని జాగ్రత్తలు అందుకే.

బెడ్‌రూమ్‌లో గోవిందరాయుడు, శ్రీలక్ష్మి నిద్రపోకుండా ఏం జరుగుతుందోనని హడలిపోతున్నారు.

ఆ ఏర్పాట్లన్నీచూసి అరుణతార నవ్వి "ఇంత కాపలా కాసినా జరిగేది జరగకమానదు" అన్నది.

శ్రీలక్ష్మికి కోపం వచ్చింది.

గోవిందరాయుడు చురచుర చూశాడు కూతురువంక.

"ఏమిటి నీ వుద్దేశ్యం! ఇంతమందిని తప్పించుకుని అతను ఇంట్లోకి వస్తాడంటావా?" కోపంగా అంది లక్ష్మి.

"నా వుద్దేశ్యం కాదమ్మా! అతను మామూలు మనిషి కాడు. ఆ సంగతి మీకు చెప్పినా అర్థంకాదు."

"మామూలు మనిషికాకపోతే దెయ్యమా ఏం? ఎవరికీ కనిపించకుండా పోవడానికి."

"నువ్వూరుకో! వాదన ఎందుకు? నువ్వెళ్ళి పడుకో తల్లీ!" అన్నాడు గోవిందరాయుడు.

అరుణతార తనగదిలోకి వెళ్ళి పడుకుంది.

రాత్రి పదకొండు దాటింది.

గోవిందరాయుడు తలుపులు మూసి బోల్టుపెట్టాడు. బెడ్‌మీద పడుకున్నాడు. శ్రీలక్ష్మి గుర్రుపెట్టి నిద్రపోయింది.

గోడ గడియారం పన్నెండు కొట్టింది.

అతనికి కళ్ళు మూసుకు పోతున్నాయి. కాని నిద్రపోగూడదని పట్టుదలగా కళ్ళు తెరుస్తున్నాడు. గదంతా చూస్తు

న్నాడు.

చైతన్య ఎలా రాగలడు?

ఒకవేళ తనను ఏడిపించడానికి అలా ఫోన్‌చేసి బెదిరించాడా?

తన బుర్ర చెడగొట్టడానికి నాటకం ఆడడంలేదు గదా?

అంతే అయివుంటుంది. లేకపోతే ఎంత తెలివితక్కువవాడయినా చెప్పి మరీ దొంగతనానికి వస్తాడా?

గోవిందరాయుడి మనసులో ఆలోచనలు సుళ్ళుతిరుగుతున్నాయి.

బాత్‌రూమ్ తెరుచుకుని తలుపులు టప....టప....కొట్టుకున్నాయి.

అతను వులిక్కిపడ్డాడు.

ఎవరో నడుస్తున్నట్లు అడుగుల చప్పుడు వినిపించింది.

గోవిందరాయుడి గుండెలో భయం చోటుచేసుకుంది. రోమాలు నిక్కబొడుచుకున్నాయి సంభ్రమాశ్చర్యాలతో.

చిన్నగా నవ్వు వినిపించింది.

అతను గట్టిగా కేక పెట్టాలనుకున్నాడు.

ఎందువల్లనో గొంతు పెగల్లేదు.

"ఎవరు?....ఎవరు?...." హీనస్వరంతో అన్నాడు.

"నేనే....చైతన్యని...." మళ్ళీ నవ్వు వినిపించింది.

"ఎక్కడ నువ్వు?"

"ఇక్కడే....ఇక్కడే...." నవ్వు.

"ఎక్కడ కన్పించవేం?"

నవ్వుమాత్రం వినిపిస్తోంది.

గోవిందరాయుడికి ముచ్చెమటలు పోశాయి. గుండె వేగంగా కొట్టుకుంటోంది. ఏమిటీ మాయ? ఆ చప్పుడు, ఆ నవ్వు, ఆ మాటలు అంతా యదార్థమేనా? లేక తను

భ్రాంతి పడుతున్నాడా?

నెత్తిమీద గట్టిదెబ్బ పడింది.

గోవిందరాయుడు తెలివితప్పి పడిపోయాడు.

శ్రీలక్ష్మి మైమరచి నిద్రపోతూనే వుంది.

కాసేపటికి గోవిందరాయుడి ఇంటికి ఏభయిగజాల దూరంలో జీప్ స్టార్టయింది.

పోలీసు గస్తీ తిరుగుతూనే వున్నారు.

హాల్లో ఫోన్ మ్రోగింది.

అప్పుడు టైమ్ కరెక్టుగా ఒంటిగంటయింది.

డియస్పీ నీలంనాయుడు సోఫాలో కూర్చుని కునికి పాట్లు పడుతున్నాడు.

ఫోన్ మోతకి మెలకువ వచ్చింది.

తనే స్వయంగా లేచివెళ్ళి రిసీవర్ ఎత్తి "డియస్పీ స్పీకింగ్ ప్లీజ్" అన్నాడు ఆవులిస్తూ.

"నమస్తే డియస్పీగారూ!"

"నమస్తే. ఎవరు?"

"చైతన్యని."

"ఏమిటీ చైతన్యవా?"

"యస్సార్. థాంక్స్ ఫర్ యువర్ కైండ్ కోపరేషన్ టూ గోవిందరాయుడు."

"వాడ్డూయూ మీన్?"

"సారీసర్! దొంగతనం జరిగిపోయింది. గోవింద రాయుడ్ని అడిగి పోయిన నగలు, డబ్బు వివరాలు అడ గండి. పాపం నగలు ఏవో కొన్ని పోయాయి అంటాడు. కాని డబ్బు పదివేలు వుండి వుంటుంది అంటాడు. అదంతా నిజంకాదు. బ్లాక్ మనీ నాకు మూడులక్షలు దొరి కింది. ఫోమ్ బెడ్ లో దాచాడు. బెడ్ తోసహా తీసికెళ్ళి

అపరాధ పరిశోధన పోటీ-161

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితంపై వ్రాసి, దానితో 75 పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ 75 పైసల పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హోం. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు **7-12-81** తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు ఫిబ్రవరి '82 నెల సంచికలో ప్రచురిస్తాము.*

1. దేశంలో ఇది మరో కొత్త ఉద్యమం—?
(ఖలిస్తాన్, గిరిజన జిల్లాలు)

2. గూండాలకు మహారాజ పోషకులు—?
(స్మగ్లర్లు, రాజకీయ నాయకులు)

3. రాష్ట్రంలో ఇప్పుడిది ముమ్మరంగా సాగుతుంది—?
(కల్తీ వ్యాపారం, వ్యభిచారం)

4. ఈ నగరాన్ని నేరస్తులకు రాజధాని అనుకోవచ్చు—?
(బొంబాయి, కలకత్తా)

5. వీరిపై ఎవరూ సానుభూతి చూపరు—?
(హంతకులమీద, బిచ్చగాళ్ళమీద)

పోయాను. నగల వివరాలు మీకు చెప్తాడు. నోట్ చేసు కోండి. గుడ్ నైట్. మీట్ యూ ఎగయిన్!"

అవతల రిసీవర్ పెట్టేసినట్లు క్లిక్ మని శబ్దం వినిపించింది.

డియస్పీ రిసీవర్ విసిరికొట్టి గావుకేక పెట్టాడు.

స్టాఫ్ అంతా అదిరిపడ్డారు మృగరాజు గర్జన విని హడలి పోయిన చిల్లరజంతువుల్లా.

15

'చెప్పి దొంగతనంచేసిన చోర కళాకారుడు.'

'చోరశ్రీ చైతన్య కంట్రాక్టర్ ఇల్లు దోపిడీ'

'వాడు మనిషికాదు దెయ్యం. కంట్రాక్టర్ కథనం'

'విచిత్రమైన దొంగతనం'

రకరకాల హెడ్డింగులలో దినపత్రికలు మార్కెట్ లోకి వచ్చాయి.

గోవిందరాయుడు ఇంట్లో దొంగతనం ఎలా జరిగిందీ కథలా వర్ణిస్తూ వ్రాశాయి పేపర్లు.

చైతన్య మనిషికాడనీ, దెయ్యమనీ, కళ్ళకు కనిపించకుండా తనతో మాట్లాడాడనీ, తన తలపై బలంగా కొట్టి తెలివి తప్పిపోయిన తర్వాత దొంగతనం చేశాడనీ విలేఖరులకు చెప్పాడు గోవిందరాయుడు.

ఇంటిచుట్టూ కాపలా వున్నా కంటికి కనిపించకుండా దొంగతనంచేసి పైగా అంతా జరిగిపోయిందని చైతన్య తనకు ఫోన్ చేసి చెప్పడం చూసి తనకు మతిపోయిందనీ, ఇటువంటి వింత దొంగతనం తన సర్వీసులో చూడలేదని డియస్పీ స్టేట్ మెంట్ ఇచ్చాడు.

నగలు డబ్బు లక్షవరకూ పోయివుంటుందని అంచనా వేశారు.

మీ తీర్పు ఏమిటి?

కేసు నెం. 39: సేట్ రత్నాలాల్ వడ్డీ వ్యాపారస్థుడు. అతడు అప్పులివ్వడమే కాక, డబ్బున్నవారి దగ్గర అప్పుగా తీసుకొని వారికి సరసమైన వడ్డీ ఇస్తుంటాడు. అతని దగ్గర గుమస్తా సత్యం.

ఒకరోజు శాంతాదేవి సత్యం దగ్గరకు వచ్చి పదివేల రూపాయలిచ్చింది. ఆ సమయంలో సేట్ షాపులోలేడు.

షాపు మూసేస్తున్నాను రేపు రమ్మన్నాడు సత్యం. శాంతా దేవి అంత డబ్బు దగ్గర ఉంచుకోవటానికి ఇష్టపడకపోవటంతో, రసీదు మర్నాడిస్తాను రమ్మన్నాడు.

అయితే, సత్యం ఆ రాత్రే పదివేలు తీసుకుని ఉడాయించాడు. గుమాస్తా చేసిన నమ్మకద్రోహానికి తను బాధ్యుడిని కానన్నాడు రత్నాలాల్.

మరి, మీ తీర్పు చెప్పండి?

[పై కేసులో - మీ తీర్పు ఏమిటో ఒక పోస్టుకార్డుపై వ్రాసి 7-12-'81 తేదీ లోపల మాకు చేరేటట్లు పంపండి. అత్యుత్తమమైన తీర్పుకు రు. 25/-లు బహుమతి పంపుతాము. ఫలితాలు జనవరి '82 నెల సంచికలో చూడండి. —ఎడిటర్]

కేసు నెం 37 (తీర్పు)

కన్నారావుకు నష్టపరిహారం చెల్లించాలి.

మున్సిపాలిటీ వారి నిర్ణయానుసారము ప్రతిటాక్సి, స్టాండులోనే పార్కు చేయవలెను. ఇతర చోట్ల పార్కు చేయకూడదు. టాక్సీ స్టాండ్‌లో అన్ని టాక్సీలు నిలిపేటట్లు చూడవలసిన బాధ్యత మునిసిపాలిటీది. గనుక నష్టపరిహారము మున్సిపాలిటీ వారు కన్నారావుకు చెల్లించవలయును.

ఈ నెల న్యాయనిర్ణేత: శ్రీమతి ఎమ్. శారద, బి. ఏ., D/o ఎమ్. వెంకటేశ్వరరావు, 18-4-77, టెలిఫోన్ ఎక్ఛేంజ్ దగ్గర, తెనాలి-522 201.

ఈ ఘరానా దొంగతనం గురించి హోమ్‌మంత్రి తీవ్ర నిరసన తెలియజేశారు.

ముఖ్యమంత్రి దర్యాప్తుచేసి ఒక నివేదిక అందజేయ మని ఐ. జీ. ని ఆదేశించారు.

దొంగని పట్టుకోలేక అతను దెయ్యమని కంట్రాక్టర్‌తో పోలీసులు స్టేట్ మెంట్ ఇప్పించి వుంటారని చాలామంది తమ అభిప్రాయం వెలిబుచ్చారు.

ఈ కాలంలో దెయ్యాలు చేశాయని చెప్పడం ఆశ్చ ర్యంగా వుందనీ, మంచికి స్థానం లేనప్పుడు చెడు ఎలా విజృంభిస్తుందో ఈ సంఘటనలు తెలియజేస్తున్నాయనీ, అందుకే మంచివాళ్ళకు కోపం తెప్పించడం సమాజానికే హానికరం అనీ అనేకమంది పాఠకులు పత్రికలకు లెటర్స్ వ్రాశారు.

విఠల్‌రావు పేపరు ఆసక్తిగా చివరంటా చదివి టీపాయ్ ముందు పడేసి "ఏమోయ్ కాఫీ తీసుకురా" అని కేకపెట్టాడు.

"అదేమిటండీ ఇప్పుడేగా కాఫీ తీసుకుంది." అంది ఆయన భార్య కమల లోపల నుంచి వస్తూ.

అప్పుడు టైమ్ ఉదయం ఎనిమిది దాటింది.

"అవుననుకో! పేపరు చదివేటప్పటికి బుర్ర తిరిగి పోయింది" అన్నాడు నవ్వుతూ.

"ఏమిటో అంత విశేషం?"

"పేపరు చూడ్డం లేదా?"

"ఏదో చూస్తున్నా! మీలా టైటిల్ నుంచి ఎడిటెడ్ ప్రింటెడ్ వరకూ చదివే తీరిక నాకు లేదు."

"ఓపిక లేదని చెప్పు. తీరిక లేదనడం కరెక్టు కాదు."

"ఏదోకటి అనుకోండి."

అపరాధ పరిశోధన పోటీ-159

[ఫలితాలు]

అక్టోబరు'81 నెల "అపరాధ పరిశోధన పోటీ—159"కి సరియైన సమాధానాలు:

1. పార్టీ మార్పిడి.
2. టెలివిజన్.
3. జ్యోతి ఆత్మహత్య.
4. దినపత్రికలు చదవడం.
5. బ్రతుకుభారం.

పై జవాబుల ప్రకారం నలుగురు పాఠకులు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి జనవరి '82 నెల నుండి ఒక ఏడాది పాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ బహుమతిగా పంపబడుతుంది.

(1) శ్రీ ఎమ్. వి. రమణ, 22-51-11, టౌన్‌హాల్ వీధి, విశాఖపట్టణం-530 001.

(2) శ్రీ ఎన్. ఉమామహేశ్వరరావు, గెద్దలుప్పి - పోస్టు, బొబ్బిలి-తాలూకా, విజయనగరం జిల్లా.

(3) శ్రీ ఎమ్. ఎస్. ఆర్. మూర్తి, s/o ఎమ్. కె. శాస్త్రి, అసిస్టెంట్ ఎకౌంటెంట్, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్స్ ఆఫీస్, సిని-833 220. (బీహారు రాష్ట్రము.)

(4) శ్రీ బి. వెంకటేశ్వరరెడ్డి, యునైటెడ్ మొజాయిక్, 26-9-1, రామారావు వీధి, గాంధీనగరం, విజయవాడ-520 003.

"మరి పేపరు చూస్తుంటే తెలియడంలా మేనల్లుడి లీలలు."

"అందరితోపాటు మనకీ తెలుస్తున్నాయి."

"మొత్తానికి తండ్రిని మించిన కొడుకు అనిపించు కున్నాడు. తండ్రి చాటుగా దొంగతనాలు చేస్తున్నాడు. శభాష్! తండ్రిపేరు నిలబెట్టాడు."

"పోనివ్వండి. వాడి సంగతి ఇప్పుడెందుకు?" అంది కమల ఆ ప్రసక్తి ఇష్టంలేనట్లుగా.

"అంతేలే!" అన్నాడు విఠల్‌రావు.

అవును. అదంతా గతం. ఒక పీడకలలాంటిది. అది తల్చుకోవడం ఇష్టంలేదు వారికి. కృష్ణచైతన్య గురించి మాట్లాడుకోవడానికి మనసు ఒప్పడంలేదు, ఇప్పుడు.

ఒకప్పుడు విఠల్‌రావు తాలూకా ఆఫీసులో సాధారణ గుమాస్తా! ఇప్పుడో లక్షాధికారి. అతన్ని లక్ష్మి వరించ డానికి ఒక కథ వుంది.

విఠల్‌రావు చెల్లెలి భర్త సూర్యారావు మిలటరీలో పని చేసేవాడు. ఒక్కడే కొడుకు కృష్ణచైతన్య. ఘనరాజ పురంలో వున్న నాలుగు ఎకరాల పొలం చేసి, కొడుకు పంపే డబ్బుతో సూర్యారావు తండ్రి కుటుంబం వెళ్ళదీసే వాడు. సూర్యారావు తండ్రి చనిపోయాడు. అతని భార్య మాణిక్యం ఇంటికి పెద్దదిక్కు అయింది.

సూర్యారావు చెల్లెలు పెళ్ళి ఒక సమస్య అయింది. అతను మిలటరీ నుంచి రెండు నెలలు సెలవుల్లో వచ్చి నప్పుడు చెల్లెలికి సంబంధాలు చూశాడు. కాని కట్నానికి, పెళ్ళిఖర్చులకు డబ్బులేదు. పొలం తాకట్టు పెట్టమంది మాణిక్యం. సూర్యారావు ఇష్టపడలేదు. తాకట్టుపెడితే వది లించుకోవడం కష్టం. అమ్మేస్తేనే నయం అన్నాడు

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

(బహుమతి రు. 50/-లు నగదు)

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని ఓ పోస్టుకార్డు సైజు తెల్ల కాగితంపై వ్రాసి 7—12—'81 తేదీ లోపల మాకు చేరేటట్లు పంపండి.

ఇదేవిధంగా "సప్లిమెంట్" ముఖచిత్రాలకు కూడా మీ వ్యాఖ్యలు పంపవచ్చును. రెండు పత్రికల వ్యాఖ్యలు వేరువేరు తెల్లకాగితాలపై వ్రాసి పంపాలి. హోం.దె. సభ్యులు కాని వారు తమ వ్యాఖ్యలతో 50 పైసల స్టాంపులు జతపర్చాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఒక్కొక్కరికి రు. 25/-లు బహుమతి పంపుతాము. ఫలితాలు ఫిబ్రవరి '82 నెల సంచికలో చూడండి.

అక్టోబరు '81 పోటీ ఫలితాలు

(1) అక్టోబరు' 81 నెల "అపరాధపరిశోధన" ముఖ చిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

ముద్దు గుమ్మలకు ముప్పు!
ముగ్గురి దొక్కలే తప్పు!!

పంపినవారు : శ్రీమతి కోడూరు లక్ష్మీప్రియ, c/o కె. ఆనందరావు, ఖర్గపూర్ (పశ్చిమ బెంగాల్).

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

గురి చూసి పట్టు!
తల మీద కొట్టు!!

పంపినవారు : శ్రీ యం. శంకర్ రెడ్డి, మెయిన్ రోడ్, బెల్లంపల్లి-504 251 (ఆదిలాబాదు జిల్లా)

పై విజేతలు ఇరువురికీ చెరొక రు. 25/-లు బహుమతి పంపబడుతుంది.

సూర్యారావు. బేరం వస్తే అమ్మే ఏర్పాటు చెయ్యమని భార్యకు చెప్పి వెళ్ళిపోయాడు సూర్యారావు.

మాణిక్యం పొలం అమ్మదలుచుకున్నట్లుగా మునసబు జగన్నాధంతో చెప్పింది. జగన్నాధం వాళ్ళకి బంధువు కూడా.

"పొలం అమ్మదలుచుకుంటే ఎవరికో ఎందుకు నేనే కొనుక్కుంటాను" అన్నాడు మునసబు.

మాణిక్యం సంతోషించింది.

"పెళ్ళికి ఎంత కావాలేమిటి?" అన్నాడు.

"పదివేలు కావల్సి వస్తుంది" అంది మాణిక్యం.

"ఎకరం అయిదువేలు. నాలుగు ఎకరాలు ఇరవై వేలు. అయితే ప్రస్తుతం నా దగ్గర అంత డబ్బులేదు. మీకు ఇప్పటికి కావలసింది పదివేలే కదా! పదివేలు తీసుకుని శుభకార్యం కానివ్వండి. తర్వాత పదివేలు ఇస్తాను. నా మీద నమ్మకం వుంటేనే సుమా!" అన్నాడు మునసబు.

"అయ్యో! ఎంతమాట. అలాగే కానివ్వండి" అంది మాణిక్యం.

సూర్యారావుకి వుత్తరం వ్రాసింది. అతను సెలవుపుట్టి వచ్చాడు. మునసబు పదివేలు ఇచ్చి కాగితాలు రాయించుకుని పొలం తన స్వాధీనం చేసుకున్నాడు. సూర్యారావు చెల్లెలు పెళ్ళిచేసి వెళ్ళిపోయాడు.

ఇక తర్వాత మునసబు ఆ పదివేలు యివ్వనేలేదు. మాణిక్యం వెళ్ళి అడుగుతుంటే యిదుగో అదుగో అంటూ దాటవేస్తుండేవాడు.

సూర్యారావు మిలటరీ నుంచి రిటైరైపోయి స్వగ్రామం చేరుకున్నాడు.

తనకు అప్పుగా ఇచ్చిన పదివేలు తిరిగి ఇచ్చివేస్తానని

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, నెల నెలా పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి అసలు ధరకే రు. 10-00 లకు మా ఏజెంట్ ద్వారాగాని, వి.పి. ద్వారాగాని మీ ఇంటిదగ్గర అందజేయబడతాయి. ఇందుకు అయ్యే ఖర్చులన్నీ మేమే భరిస్తాము.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 5/-లు పంపటమే. పైకం మనియార్డరుద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంప వచ్చును. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము కార్డు అందుతుంది.

3. 'హోమ్ డెలివరీ' వల్ల మీకు కాపీలు నెల నెలా గ్యారంటీగా, త్వరితంగా చేరుతాయి. మీ ఇంటిదగ్గరనే డబ్బు చెల్లించి కాపీలు పొందవచ్చును. కాపీలకోసం మీరు ఏజెంట్ చుట్టూ తిరుగనవసరంలేదు. కాపీలు దొరకలేదనే నిరాశ,పోస్టులో పోయే సమస్య, ఎంతమాత్రం వుండదు. పైగా సభ్యులు పోటీ లలో ఫ్రీగా పాల్గొనవచ్చును.

4. ఏ కారణంచేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, వాటి పైకం రు. 10/-లు వెంటనే M. O. చేయాలి. కాపీలు తిరిగి 'రికార్డెడ్ డెలివరీ'లో పంపుతాము. లేదా మీ సభ్యత్వము అంత టితో రద్దవుతుంది.

5. ఇండియాలో మీరు ఏ మారుమూలనున్నా కాపీలు ఖచ్చి తంగా అందజేయబడతాయి. మీ చిరునామా మారినప్పుడల్లా తగినంత ముందుగా మాకు తెలియజేయండి.

6. పాతకాపీలు కావలసిన వారికి వాటి అసలు ధరకే వి. పి. ద్వారా పంపగలము. ఎక్కువ కాపీలు తీసుకునేవారికి కొంత కన్సెషన్ కూడ లభిస్తుంది.

7. నెల నెలా వి. పి. తీసుకోవటం కష్టమనుకునేవారు, ఏడాది పైకము రు. 120/-లు ముందుగా పంపవచ్చును. దీని వల్ల మీకు ఖర్చులు కొంత తగ్గుతాయి.

నేడే మీరూ 'హోమ్ డెలివరీ' లో చేరండి!

పొలం స్వాధీనం చెయ్యమనీ మునసబుని అడిగాడు సూర్యారావు.

మునసబు అలా ఒప్పుకోనన్నాడు.

పోనీ తమకు ఇవ్వవలసిన పదివేలయినా యిచ్చి అప్పట్నుంచి ధర్మవడ్డీ ఇవ్వమన్నాడు సూర్యారావు. దానికీ ఒప్పుకోలేదు మునసబు.

తనకు ఇచ్చిన పదివేలకు ధర్మవడ్డీ యివ్వడానికి సిద్ధ పడ్డాడు సూర్యారావు.

ములసబు పొలం తిరిగి స్వాధీనం చెయ్యడానికి సిద్ధ పడ్డంలేదు. పదివేలు వీలైనంత త్వరలో ఇస్తానని అంటు న్నాడు. ఆరేళ్ళయింధి పొలం తీసుకుని.

సూర్యారావు వుద్రేకస్వభావి. అమీ తుమీ తేల్చుకోవా లనుకున్నాడు. తన పోలం బలవంతంగా స్వాధీనం చేసు కుని అరిక కట్టాడు. మునసబు మనుషులు సూర్యారావుని కొట్టారు.

సూర్యారావు వీరభద్రావతారం ఎత్తాడు. పట్టపగలు బండదగ్గర మునసబుని కాల్చిచంపాడు. పోలీసులు వచ్చే లోపునే పారిపోయాడు.

మాణిక్యాన్ని, కృష్ణచైతన్యని విఠల్‌రావు తన ఇంటికి తీసుకొచ్చాడు. కాని మాణిక్యం మన స్తత్వం అన్నగారింట్లో ఇమడలేకపోయింది. విఠల్‌రావు భార్య కమల పరమ గయ్యాళి. ఆడబిడ్డ తన ఇంట్లో తిష్టవేసినందుకు అనుక్షణం గొణుగుతూ వుండేది.

(ఇంకా వుంది)

Edited and Published by S. DAMODAR REDDY
3-4-554 Narayanaguda, Hyderabad-500 029.
and Printed at Kranti Press, Madras-600 001